
## ఇలా వచ్చి అలా వెళ్లారు..

వైఎస్ జయంతి కార్యక్రమాలను అన్నిచోట్లా ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు, ఇతరత్రా ముఖ్య నాయకులు హాజరుకావాలని వైసీపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశించింది. అయితే కీలకనేత బాలినేని శ్రీనివాసరెడ్డి గైర్హాజరయ్యారు. అదేసమయంలో కార్పొరేషన్ మేయర్, వైసీపీ కౌన్సిలర్లు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. కనిగిరిలో ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నారాయణయాదవ్ తన మద్దతుదారులతో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మద్దతుదారులతో తన గృహంలో కార్యక్రమం నిర్వహించారు. చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం మినహా మిగిలిన నియోజకవర్గాల్లో గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓడిపోయిన వారంతా ఇలా వచ్చి అలా వైఎస్ విగ్రహాలకు దండలు వేసి వెళ్లిపోవడం కనిపించింది.



ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయం

జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతోంది. అధికారాన్ని కోల్పోయిన ఆ పార్టీ సైలెంట్‌గా జిల్లా కార్యాలయాన్ని మార్చింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కొత్త కార్యాలయంలోకి సామగ్రిని తరలించింది. పాత కార్యాలయాన్ని స్థల యజమాని ఖాళీ చేయించగా కొత్త ఆఫీసు భవన నిర్మాణం వివాదాస్పదం కావడంతో అక్కడా కార్యక్రమాలు చేపట్టలేని పరిస్థితి ఆపార్టీకి ఎదురైంది. చివరికి రాజశేఖరెడ్డి జయంతిని కూడా నిర్వహించలేకపోయారు. కాగా సోమవారం వైఎస్ జయంతి కార్యక్రమాలను జిల్లాలో తూతూమంత్రంగా నిర్వహించారు. ఆపార్టీ సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి, కరణం బలరాంతో పాటు కింది స్థాయిలోని ముఖ్యనేతలు కూడా గైర్హాజరయ్యారు. కొన్నిచోట్ల నేతలు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఒంగోలులో మేయర్‌తోపాటు వైసీపీ కార్పొరేటర్లు కార్యక్రమానికి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది.

# వైసీపీ ఖాళీ...!

## కార్పొరేషన్‌లో కాక

**వైఎస్సార్ జయంతి వేడుకలకు మేయర్ డుమ్మా!**

**అదేబాటలో వైసీపీ డిప్యూటీ మేయర్‌లు, కార్పొరేటర్లు**

**పలువురు ముఖ్య నేతలూ గైర్హాజరు.. నగరంలో చర్చనీయాంశం**

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 8 : ఒంగోలులో వైసీపీ రాజకీయం వేడెక్కింది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏకార్యక్రమం జరిగినా నానా హడావుడి చేసిన నేతలు ఇప్పుడు దూరమయ్యారు. సోమవారం జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకలకూ ముఖం చాటేశారు. ఆ పార్టీకి చెందిన నగర్ మేయర్ గంగాడ సుజాత, ఇద్దరు డిప్యూటీ మేయర్‌లు వెలనాటి మాధవరావు, వేమూరి బుజ్జిలతోపాటు ఇతర కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులతోపాటు పలువురు ముఖ్య నేతలు డుమ్మాకొట్టడం చర్చనీయాంశమైంది. వైఎస్సార్ జయంతి వేడుకలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని చర్చిసెంటర్‌లో నిర్వహించారు. ఒంగోలు కార్పొరేషన్‌లో మేయర్, ఇద్దరు డిప్యూటీ మేయర్‌లు, మరో 39 మంది కార్పొరేటర్లు, ఐదుగురు కోఆప్షన్ సభ్యులు వైసీపీకి చెందిన వారు కాగా, వీరంతా కార్యక్రమానికి హాజరుకాలేదు. దీంతో జంకె వెంకటరెడ్డి నేతృత్వంలో ద్వితీయ శ్రేణి, డివిజన్ నాయకులతో కార్యక్రమాన్ని మొక్కుబడిగా ముగించేశారు.

### ఎన్నికల అనంతరం మారిన తీరు

ఒంగోలుకు కార్పొరేషన్ హోదా వచ్చిన తర్వాత తొలిసారి జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి 44 మంది కార్పొరేటర్‌లు గెలిచారు. టీడీపీ నుంచి ఐదుగురు, జనసేన నుంచి ఒక కార్పొరేటర్ విజయం సాధించారు. దీంతో కౌన్సిల్ సమావేశంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అడ్డగోలుగా ఆమోదించడం సాగిపోయింది. ఇటీవల ఎన్నికల సమయంలో వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్‌లు ఆపార్టీని వీడి టీడీపీ జెండా కప్పుకున్నారు. దీంతో కూటమి సభ్యుల సంఖ్య 11కు చేరగా, వైసీపీ కార్పొరేటర్‌ల సంఖ్య 39కి పడిపోయింది. ఆతర్వాత జరిగిన పరిణామాలతో మేయర్‌తోపాటు, మరికొందరు కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గత నెలలో మేయర్ నివాసంలో సమావేశమైన వారు సైకిలెక్కడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చారు. అప్పటి నుంచి కొందరు టీడీపీ నేతలకు టచ్‌లో ఉన్నారు. ఈనేపథ్యంలో సోమవారం ఒంగోలులో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకలకు ఒక్కరూ హాజరు కాకపోవడంతో కార్పొరేషన్ పాలిటిక్స్ వేడెక్కాయి. వైసీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి నేరుగా మేయర్ సుజాతకు ఫోన్ చేసినా ఆమె స్పందించలేదని సమాచారం. ఆమె వైసీపీలో ఉంటారా? లేక మరికొంత మంది కార్పొరేటర్‌లతో కలిసి టీడీపీలో చేరతారా? అన్నది చర్చనీయాంశమైంది.



కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి

**సైలెంట్‌గా ఆఫీసు మార్పు**

**వైఎస్ జయంతి కార్యక్రమాలకు బాలినేని, కరణం డుమ్మా**

**మమ అనిపించిన నేతలు**

**కొత్త కార్యాలయం నిర్మించిన భూమి వివాదాస్పదం**

**సీజ్ చేయకుండా కార్పొరేషన్ అధికారుల ఉదాసీనత**

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో అధికారంలో ఉండగా వైసీపీ అన్ని జిల్లా కేంద్రాల్లో ప్యాలెస్‌ల లాంటి పార్టీ కార్యాలయాలను నిర్మించింది. అందులో భాగంగా ఒంగోలులో కూడా ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తే ఘనంగా ప్రారంభించాలని ఆపార్టీ నేతలు భావించారు. ఘోరపరాయం పాలవడంతో కార్యాలయ నిర్మాణంలో ఉన్న లొసుగులు కూడా బయటపడ్డాయి. దీనికి తోడు ఏడెనిమిదేళ్ల నుంచి ఆపార్టీ కార్యాలయం నడుస్తున్న భవనాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆప్పట్లో మాజీ మంత్రి బాలినేని సన్నిహితుడు పార్టీ కార్యాలయానికి స్థలం ఇచ్చారు. రెండేళ్ల నుంచి ఆయన ఖాళీ చేయాలని కోరుతున్నా అధికారంలో ఉండటంతో ఏమీ చేయలేకపోయారు. వైసీపీ అధికారాన్ని కోల్పోగానే ఆయన ఒత్తిడి పెంచారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జంకె వెంకటరెడ్డి గుట్టుచప్పుడు కాకుండా ఆపార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేశారు. సామగ్రిని కూడా వివాదాస్పదంగా ఉన్న కొత్త పార్టీ కార్యాలయంలోకి తరలించారు. అక్కడ సోమవారం వైఎస్ జయంతి వేడుకల నిర్వహణకు పిలుపునిచ్చారు. కొత్త భవనం నిర్మించిన భూమి వివాదం కేసు హైకోర్టులో ఉంది. అక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని పోలీసులు వైసీపీ నేతలకు సమాచారమిచ్చారు. బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో వైసీపీ నేతలు కార్యక్రమాన్ని అక్కడి నుంచి మార్చుకున్నారు. అలాగే వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి కార్పొరేషన్ నుంచి పూర్తి అనుమతులు లేవు. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు సీజ్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

**వాటి పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు**

**అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరిక**

**మార్కాపురం 'మీకోసం'లో 487 మంది అర్జీలు**



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం, జూలై 8 : అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. మార్కాపురంలోని వేంకటేశ్వర దేవస్థాన కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీకోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ఈ దృష్ట్యా ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా పరిష్కారం కాకపోతే కారణాలను వివరించాలన్నారు. మండల స్థాయి నుంచి పైస్థాయికి నివేదిక పంపి అది ఎక్కడ ఉందో తెలుసుకొని అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం, కనిగిరి సబ్ కలెక్టర్లు రాహుల్ మీనా, జాన్ ఇర్విన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా మీకోసం కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. 487 మంది తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు.

## టెట్ షెడ్యూల్ సవరణ

**అక్టోబరు 3నుంచి పరీక్షలు | నవంబరు 2న ఫలితాలు**

ఒంగోలు (విద్య), జూలై 8 : ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్) షెడ్యూల్‌ను ప్రభుత్వం సవరించింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కోరిక మేరకు పరీక్ష తేదీలను మార్చింది. వారి సౌలభ్యం కోసం టెట్ నోటిఫికేషన్ తేదీకి, పరీక్షల తేదీలకు కనీసం 90 రోజుల వ్యవధి ఉండేలా కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈమేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. తాజా షెడ్యూల్ ప్రకారం జూలై 2న టెట్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. పేమెంట్ గేట్‌వే ద్వారా జూలై 3నుంచి ఆగస్టు 3వరకూ ఆన్‌లైన్‌లో సీఎఫ్‌ఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలి. సెప్టెంబరు 19నుంచి ఆన్‌లైన్‌లో మాక్ టెస్ట్ ఉంటుంది. సెప్టెంబరు 22 నుంచి హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. అక్టోబరు 3 నుంచి 20వతేదీ వరకు ప్రతిరోజూ రెండు సెషన్లలో పేపర్-1ఏ, 1బీ, పేపర్ 2ఏ, 2బీ పరీక్షలు నిర్వహిస్తారు. మొదట సెషన్ పరీక్ష ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ జరుగుతాయి. అక్టోబరు 4 నుంచి పరీక్షల ప్రాథమిక కీ విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలను అక్టోబరు 5నుంచి స్వీకరిస్తారు. 27న తుది కీ విడుదల చేస్తారు. నవంబరు 2న తుది ఫలితాలు ప్రకటించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.





చతుకుపాడులో ఇసుకను టిప్పర్‌కు ఎత్తడాన్ని పరిశీలిస్తున్న స్వామి (ఇన్‌సెట్లో) ఒంగోలు ఏఎంసీలో ఇసుక అమ్మకాలను ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్

# ఇసుక ఇక్కట్లకు తెర

**ఉచిత విధానం అమల్లోకి తెచ్చిన కూటమి ప్రభుత్వం**

**జిల్లాలో మూడు స్టాక్ పాయింట్ల నుంచి తక్షణం సరఫరా**

**చతుకుపాడులో ప్రారంభించిన మంత్రి స్వామి**

**నిర్మాణ రంగానికి భారీ ఊరట**

ఒంగోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ఇక్కట్లకు తెరపడింది. ప్రజలకు ఇసుకను ఉచితంగా అందజేయాలని సంకల్పించిన టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలలోపు దాన్ని అమల్లోకి తెచ్చింది. జరుగుమల్లి మండలం చతుకుపాడులో ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి సోమవారం ప్రారంభించారు. ఒంగోలు ఏఎంసీ ఆవరణలోని స్టాక్ పాయింట్ వద్ద ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు ప్రారంభించారు. దీంతో నిర్మాణ రంగానికి భారీ ఊరట లభించింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేది. జిల్లాలో ఏప్రాంతంలోనైనా నాలుగు నుంచి 5 టన్నుల పరిమాణం ఉండే ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.వెయ్యికి దొరికేది.

### వైసీపీ పాలనలో బంగారంగా మారిన ఇసుక

వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచేసింది. ప్రాంతాల వారీ తమకు అనుకూలమైన సంస్థలకు టెండర్లను కట్టబెట్టింది. టన్ను రూ.800పైగా ధరలు పెట్టడంతో ట్రాక్టర్ ఇసుక రూ.4వేల నుంచి రూ.5 వేలు పలికింది. వాగులు, వంకలు, చిన్నపాటి నదుల పక్కన ఉన్న ప్రజలను సైతం వారి ఇళ్ల నిర్మాణాలకు కూడా ఇసుక తీసుకెళ్లనివ్వలేదు. మరోవైపు వైసీపీకి చెందిన నేతలు అక్రమంగా అనేక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు చేసి కోట్లు గడించారు. ఇలా ఒకవైపు ప్రకృతి సంపద అయిన ఇసుకను అక్రమ తవ్వకం, మరోవైపు ప్రైవేటు సంస్థల పేరుతో ధరలు పెంచి ప్రజలనెత్తిన భారం మోపి దోపిడీ చేశారు. వైసీపీ కాలంలో ఇసుక బంగారమవడంతో సాధారణ, మధ్య తరగతి వర్గాల ప్రజలు గృహాలు, ఇతర నిర్మాణాలకు అధిక మొత్తాన్ని ఇసుక కోసం వెచ్చించాల్సి వచ్చింది. ఆ ప్రభావం నిర్మాణ రంగంపై పడి వేలాది భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు పనులు లేక అవస్థ పడ్డాయి. ఈ పరిస్థితిని గుర్తించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం అమలులోకి తెస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారు.

### అధికారంలోకి వచ్చిన నెలలోపే అమలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోపే ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను ప్రారంభింది. జిల్లాలో మూడు స్టాక్ పాయింట్లలో 42,834 టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. అందులో జరుగుమల్లి మండలం చతుకుపాడు-1 పాయింట్లో 16,044 టన్నులు, చతుకుపాడు-2 పాయింట్‌లో 24,972 టన్నులు, ఒంగోలులోని ఏఎంసీ ఆవరణలో 1,818 టన్నులు ఉంది. దానిని అందించే ప్రక్రియను ప్రారంభించారు. స్టాక్ పాయింట్లకు గతంలో నెల్లూరు నుంచి ఇసుక తెచ్చి నిల్వ ఉంచగా అక్కడ లోడింగ్, రవాణా, పన్నులు కలిపి టన్ను ధర రూ.247గా నిర్ణయించారు. ఆ మేరకు చెల్లించిన వారికి ఒక్కొక్కరికి రోజుకు 20 టన్నులు అందించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం ట్రాక్టర్ ట్రక్కు ఇసుక (ఐదు టన్నులు) ప్రస్తుతం రూ.1235కే లభించనుంది. వైసీపీ ప్రభుత్వంలోని ధరలతో పోల్చితే ప్రస్తుత ధర కేవలం నాలుగో వంతే.

### మున్ముందు మరింతగా..

ప్రస్తుతం మూడు నిల్వ కేంద్రాల నుంచి ఉచిత ఇసుక సరఫరాను ప్రారంభించగా భవిష్యత్‌లో మరిన్ని ఏర్పాటు చేయనున్నారు. అందుబాటులో ఉంటే సమీప గ్రామాల ప్రజలు తమ అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకెళ్లే వెసులుబాటును కూడా ప్రభుత్వం కల్పించింది. అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడితే ట్రాక్టర్‌కు రూ.10 వేలు, లారీకి రూ.25 వేలు జరిమానా విధించనున్నారు. ఇసుక సరఫరా ప్రక్రియలో సెబ్, రెవెన్యూ, గనులు, ఇతర శాఖల అధికారుల నిఘా ఉండనుంది.



# చేపల కోసం నీళ్లొదిలేశారు!

**చెరువు నుంచి బయటకు పంపిన పాటదారులు**

**పశువులకు నీరు లేక పోషకుల ఇక్కట్లు**



జముకులదిన్నెలో ఖాళీ అయిన చెరువు



దర్శి, జూలై 8 : చేపల పాటదారుల స్వార్థంతో గ్రామాల్లో నీటి ఇక్కట్లు తలెత్తుతున్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లోని చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా నీటిని బయటకు పంపి చేపలు పట్టుకుంటున్నారు. దీంతో అవి ఖాళీ అయి ఒట్టిపోతున్నాయి. చేపలు పట్టుకునేందుకు అడ్డగోలుగా నీరు వెళ్లబెట్టడంతో పశువులకు తాగు నీరు లేక పోషకులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని రాజంపల్లి, జముకుల దిన్నె, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని చెరువుల్లో ఇప్పటికే నీటిని బయటకు పంపి చేపలు పడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. పాటదారుల నిర్వాకంతో చెరువుల్లో చుక్కనీరు లేకుండాపోతోంది. నిబంధనల ప్రకారం చెరువుల్లో నీరు అలాగే ఉంచి వలల ద్వారా చేపలు పట్టుకోవాల్సి ఉంది. త్వరగా పని పూర్తి చేసుకోవాలన్న ఉద్దేశంతో పాటదారులు నీరు బయటకు పంపుతున్నారు. సంబంధిత అధికారులు ఈవిషయం గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వర్షాలు లేక చెరువుల్లో కొద్దిపాటి నీరు మాత్రమే ఉంది. ఉన్న నీటిని కూడా వెళ్లబెట్టడంతో పశుపోషకులు అల్లాడిపోతున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే తప్ప చెరువులకు నీరు చేరే అవకాశం లేదు. ఈనేపథ్యంలో అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.







విద్యార్థి శివకు లక్ష నగదు, ల్యాప్‌టాప్ అందజేస్తున్న లలిత్‌సాగర్, వెంకట్

## ఎన్ఆర్ఐల సహకారంతో స్కూళ్ల అభివృద్ధి

**మోడల్ స్కూల్‌లో సమస్యల పరిష్కారానికి కృషి**

**దర్శి నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ లలిత్‌సాగర్**

**20 మంది పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు**

**పంపిణీ చేసిన ఎన్ఆర్ఐ వెంకట్**

వివరాలు లోపలి పేజీల్లో..



మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్‌రావు

## కళాక్షేత్రం కళాకారులదే

- కార్పొరేటర్ల పెత్తనం చెల్లదు
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), జూలై 8:స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు మీద ఒంగోలులో ఎన్టీఆర్ కళాక్షేత్రం నిర్మించింది కళాకారుల కోసమని, దాని మీద గత రెండు సంవత్సరాలుగా వైసీపీ కార్పొరేటర్లు పెత్తనం చేస్తున్నారని, ఇక మీదట అది చెల్లదని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు అన్నారు. ఆదివారం స్థానిక రంగా భవన్‌లో ఏర్పాటుచేసిన రెండు తెలుగు రాష్ట్రాల మెగా సంగీత విభావరి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కళాక్షేత్రం కళాకారులకు అందుబాటులో లేకుండా పోయిన విషయాన్ని కళాకారులు, నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఇక మీదట కళాకారులకు అందుబాటులో కళాక్షేత్రం ఉంటుందని, దానిని వారు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవటానికి ఉపయోగించుకోవచ్చని అన్నారు. కళాక్షేత్రం కళాకారుల కోసం నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించినదే తప్ప వ్యాపారం కోసం కాదన్నారు. కళాక్షేత్రం విషయంలో కళాకారులకు ఎటువంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దామచర్ల జనార్దన్‌ను విశిష్ట అతిథి మండవ మురళీకృష్ణ, నిర్వాహకులు మాగంటి శ్రీనివాస మూర్తి, పి.శ్రావ్యరెడ్డి, పలువురు కళాకారులు ఘనంగా సత్కరించారు.



జంతుకళేబరాల కోత కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## అనధికారికంగా జంతుకళేబరాల కోత

- కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు
- నిర్వాహకులకు హెచ్చరిక
- షెడ్డుచుట్టూ పట్టల తొలగింపు
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 8 : 'ప్రజారోగ్యంతో చెలగాటం' కథనంపై కార్పొరేషన్ అధికారులు స్పందించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కార్పొరేషన్ అధికారులు చనిపోయిన జంతువుల కళేబరాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. కమిషనరు ఎం. జశ్వంత్‌రావు ఆదేశాలతో శానిటరీ సూపర్ వైజర్ నూకతోటి పిచ్చయ్య తన సిబ్బందితో వెళ్ళి అక్కడ అనధికారకంగా జంతు కళేబరాలతో వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. స్థానికులతో మాట్లాడిన ఆయన వారి నుంచివచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. దీంతో నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు అక్కడ ఉన్నటువంటి వ్యర్థాలను, అదే క్రమంలో షెడ్డు చుట్టూ ఏర్పాటు చేసిన పట్టలను తొలగించారు. ఆ పరిసర ప్రాంతాలను శుభ్ర పరచడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## మద్యం మత్తులో బావిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య

సంతనూతలపాడు, జులై 8: మద్యం మత్తులో ఓ వ్యక్తి బావిలోకి దూకి మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు తెలిపిన సమాచారం మేరకు పాలపర్తి కొండయ్య(38) స్వగ్రామం కొండపి. గత కొంతకాలంగా సంతనూతలపాడులోని బంధువుల వద్ద ఉంటున్నాడు. ఈక్రమంలో కొండయ్య ఆదివారం అర్ధరాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని బావి వద్ద మద్యం సేవించి ఆమత్తులో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తన పక్కనున్న కుక్కను బావిలో పడవేసి తాను కూడా బావిలో దూకాడు. వెంటనే పక్కనే ఉన్న మరో యువకుడు బావిలోకి దూకిన కుక్కను, ఆ యువకుడిని కాపాడేందుకు బావిలోకి దూకి ప్రయత్నించాడు. ఆ క్రమంలో ఇరువూరూ కాపాడండి, కాపాడండి అంటూ కేకలు వేయడంతో వెంటనే సమీపంలో నిద్రపోతున్న స్థానికులు అప్రమత్తమై ఆ యువకుడిని, కుక్కను కాపాడారు. అప్పటికే పాలపర్తి కొండయ్య బావిలో అడుగుభాగానికి వెళ్లాడు. చివరకు పొద్దున్నే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారంలో ఇవ్వడంతో వారు ఒంగోలు నుంచి ఫైర్‌స్టేషన్ సిబ్బంది, సర్పంచ్ డి.నాగమణి, కార్యదర్శి సాయంతో బావిలోని నీటిని బయటకు పంపించి పాలపర్తికొండయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ భాస్కరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## జిల్లా అభివృద్ధికి సహకరించండి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 8 : జిల్లా సమగ్రాభివృద్ధికి సంపూర్ణ తోడ్పాటును అందించాలని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కోరారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో సోమవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి బొకే ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలపై చర్చించారు. జిల్లాను అభివృద్ధి చెందేలా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లను పునర్నిర్మించడం, మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా ప్రకటించడంతో పాటు నిమ్జ్ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాను పారిశ్రామికాభివృద్ధిగా చేసే విధంగా చూడాలని వల్లంరెడ్డి కోరారు. ఆయా అంశాలపై మాగుంట మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు.



ఎంపీ మాగుంటను కలిసి బొకే ఇస్తున్న వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

## నేటి నుంచి ఫేజ్-2 డీఈఈ సెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్

ఒంగోలు(విద్య), జూలై 8 : ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలు(డైట్)లో ప్రైవేటు డీఈడీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఫేజ్-2 కౌన్సెలింగ్ మంగళవారం నుంచి మైనంపాడులో ప్రారంభం అవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర తెలిపారు. విద్యార్థులు వెబ్ ఆప్షన్ల ఆధారంగా వారికి కళాశాలలు కేటాయిస్తూ ప్రాథమిక కేటాయింపు లెటర్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈనెల 9నుంచి 13 వరకు మైనంపాడు డైట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు.

# పేదలకు అందుబాటులో ఇసుక

- వైసీపీ దోపిడీకి చంద్రబాబు చరమగీతం పాడారు
- మంత్రి స్వామి
- చతుకుపాడు డంప్‌ల వద్ద అమ్మకాలు ప్రారంభం
- పాల్గొన్న జేసీ, ఇతర అధికారులు



చతుకుపాడులో ఉచిత ఇసుకను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

జరుగుమల్లి (కొండపి), జూలై 8 : ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీల్లో మరో పెద్దదైన ఉచిత ఇసుక విధానాన్ని సీఎం చంద్రబాబు సోమవారం నుంచి ప్రారంభించడం రాష్ట్రంలోని పేదలకు ఎంతో మేలు చేస్తుందని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని చతుకుపాడు గ్రామం వద్ద నిల్వ ఉన్న డంప్‌ల నుంచి ఇసుక అందించే పాలసీని సోమవారం ఉదయం మంత్రి స్వామి, గ్రామ సర్పంచ్ కోడూరి ఎస్తేరమ్మలు ప్రారంభించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ డంప్‌ల వద్ద ఉన్న నిల్వలతోపాటు రీచ్‌ల నుంచి కూడా ఇసుకను నామమాత్రపు రేటుకే పేదలకు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఇసుకను బ్లాక్‌లో అధిక ధరకు వైసీపీ నాయకులు అమ్ముకోవడం వల్ల భవన కార్మికులు, పేదలు ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. చతుకుపాడులోని రెండు స్టాక్ పాయింట్లలో 31వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం ప్రతిరోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పారదర్శకంగా ఇసుకను అందజేస్తామని చెప్పారు. ఒక్కో మనిషికి రోజుకు గరిష్ఠంగా 20 టన్నుల ఇసుకను అందజేస్తామన్నారు. దీనికి సంబంధించి డిజిటల్ చెల్లింపుల విధానం అమలులో ఉంటుందని తెలిపారు. ఇసుక నూతన విధానంతో భవన నిర్మాణాలు ఊపందుకుంటాయని, తద్వారా కార్మికులకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, భూగర్భ జలవనరులశాఖ డీడీ బి. జగన్నాథరావు, ఒంగోలు ఆర్డీవో జి.వి. సుబ్బారెడ్డి, సెబ్ సింగరాయకొండ సీఐ నరహరి, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీవో జలజాక్షి, టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, నాయకులు పోటు శ్రీనివాసమురళి, ఏలూరి రాంబాబు, కొమ్మాలపాటి కృష్ణ, పాతూరి కోటేశ్వరరావు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పేముల విజయనిర్మల పాల్గొన్నారు.

### ఒంగోలులో ప్రారంభించిన దామచర్ల, మాగుంట

ఒంగోలు(క్రైం) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక నూతన విధానం ప్రజలకు ఉపయోగకరం అని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులోని ఇసుక నిల్వ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక నూతన విధాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దామచర్ల జన్దానరావు , ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అయిన చంద్రబాబు ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం పైన దృష్టి పెట్టి పనిచేస్తుందని అన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ ఇసుక కోసం గత ప్రభుత్వంలో ప్రజలుఅనేక కష్టాలు పడ్డారని, నూతన ప్రభుత్వం దీన్ని గమనించి ఉచితంగా ఇసుక అందించేందుకు జీవో ఇచ్చిందన్నారు. ఒంగోలు మార్కెట్ యార్డు, దక్షిణ బైపాస్‌లో రెండు ఇసుక నిల్వ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఇసుక అవసరం అయినవారు డిజిటల్ పేమెంట్లు ద్వారా చెల్లింపులు చేసి ఇసుకను తీసుకెళ్లవచ్చని అన్నారు. ఇసుక తరలింపులో పారదర్శకంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్, తెలుగు దేశం నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, కఠారి నాగేశ్వర రావు, ఐనాబత్తిన ఘనశ్యామ్,కండే శ్రీనివాస రావు తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 8 : సమస్యల పరిష్కారంకోసం ప్రజలనుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం మీ కోసం అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులను ఉద్దేశించి జేసీ మాట్లాడుతూ అర్జీదారులను కార్యాలయాల చుట్టూ పదే పదే తిప్పుకోకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల విషయంలో అధికారులు నిరంతరం పరిశీలన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ

- అంగన్‌వాడీ టీచర్ పోస్టులను అర్హత ఉన్న ఆయాల ద్వారా భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ కార్యదర్శి మహేష్‌కోరారు. ఒంగోలు ప్రాజెక్టు పరిధిలో ఇచ్చిన ఉద్యోగోన్నతులను వెనక్కు తీసుకున్నారని తెలిపారు. అందువల్ల అర్హులైన వారందరికి ఉద్యోగోన్న తులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
- తాను సర్పంచ్‌గా ఎస్టీ కులం కావడంతో పంచాయతీ కార్యదర్శి చిన్న చూపుచూస్తున్నాడని నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మఫిర్యాదు చేశారు. తాను సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ప్రజలకు సక్రమంగా సేవలు అందిస్తూ ముందుకు సాగుతున్నానని తెలిపారు. ఇటీవల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా వచ్చిన తర్వాత ఎస్టీ ఎరుకుల మహిళ అని చిన్న చూపు చూడటమే కాకుండా అవమానిస్తున్నారని, న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఇలా పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు.

### ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ఒంగోలు(క్రైం),జూలై8: ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చేయాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన 75 ఫిర్యాదులను ఎస్పీ పరిశీలించారు. వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎస్.వి.శ్రీధరరావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ప్యానల్ అడ్వకేట్ బీవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏకేయూ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు(విద్య), జూలై 8 : ఆంధ్రకేసరి యూనివర్శిటీ పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు ఎట్టకేలకు సోమవారం విడుదలయ్యాయి. మార్చిలో జరిగిన పరీక్షల ఫలితాలను యూనివర్శిటీ అధికారులు తాపీగా నాలుగు నెలల తర్వాత ప్రకటించారు. 30నుంచి 40వేల మంది విద్యార్థులు రాస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షా ఫలితాలు నెల రోజుల్లో విడుదల అవుతుండగా ఏకేయూనివర్శిటీలో కేవలం 1,153 మంది ఫలితాల ప్రకటనకు నాలుగు నెలలు పట్టడం అంటే యూనివర్శిటీ పనితీరు ఏలా ఉందో చెప్పకనే చెప్తోంది. యూనివర్శిటీ పరిధిలో 17 పీజీ కళాశాలల్లో చదువుతున్న 1,153 మ ంది విద్యార్థులు మొదటి సెమిస్టర్ ఫలితాలను సోమవారం యూనివర్శిటీ వీసీ ఎం. అంజిరెడ్డి వర్చువల్ విధానంలో ప్రకటించారు. 1,153 మందిగాను 865 మంది పాసై 72శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో ఎంపీఈడీ, ఆక్వా కల్చర్, ఆయిల్ అండ్ షాట్స్, ఎకనామిక్స్, హిస్టరీ తదితర విభాగాల్లో విద్యార్థులు వందశాతం పాసయ్యారు.

ఎంబీఏ విభాగంలో 407 మందికి 353 మంది పాసై 86.7శాతం, ఎంసీఏలో 49 మందికి 44 మంది, ఎంఈడీ విభాగంలో 182 మందికి 118 మంది, బోటని విభాగంలో 29 మందికి 24 మంది, కంప్యూటర్ సైన్స్ విభాగంలో 112 మందికి 87 మంది, గణిత శాస్త్రంలో 85 మందికి 49 మంది, ఆర్గానిక కెమిస్ట్రీ విభాగంలో 151 మందికి 93 మంది, ఫిజిక్ విభాగంలో 23 మందికి కేవలం ముగ్గురు. సంఖ్యాశాస్త్రంలో ఆరుగురికి ఐదుగురు, జువాలజీలో 16 మందికి ఏడుగురు, సోషల్ వర్క్ విభాగంలో 14 మందికి 13 మంది, ఎంకాంలో 24 మందికి 14 మంది పాసయ్యారు. అయితే గతంలో ప్రకటించిన ఫార్మసీ ఫలితాలను కూడా మళ్లీ తాజాగా ప్రెస్‌నోట్‌లో విడుదల చేయడం గమనార్హం.

ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి. హరిబాబు, సీఈ కేవీఎన్ రాజు, సీటీఏ జి. సోమశేఖర్, ఏసీటీఏ ఆర్. శ్రీనివాసులు, పరీక్షల విభా గం పర్యవేక్షకులు శివరామయ్య, సిబ్బంది ఉన్నారు. పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను వీసీ అంజిరెడ్డి, రిజిస్ట్రార్ హరిబాబు, సీఈ రాజులు అభినందించారు.

## దేవస్థాన భూములకు కౌలు వేలం

సంతనూతలపాడు, జూలై 8: సంతనూతలపాడులోని చెన్నకేశవులస్వామి ఆలయం, త్రిపురాంతకస్వామి ఆలయ దేవస్థాన భూములకు ఈవో నర్రా నారాయణరెడ్డి సోమవారం కౌలు వేలం నిర్వహించారు. త్రిపురాంతకస్వామి ఆలయానికి చెందిన సంతనూతలపాడు, చంద్రపాలెం, మైనంపాడు, గుర్వారెడ్డిపాలెం గ్రామాలలో 57.87 ఎకరాలకు భూమి వేలం నిర్వహించారు. గతంలో ఈభూములకు కౌలు కింద ఏడాదికి రూ.లక్షా76వేలు లభించగా, నేడు ఇదే భూమికి అత్యధికంగా కౌలుకింద రూ.4లక్షల 88 వేలు లభించాయి. అదేవిధంగా చెన్న కేశవ స్వామి ఆలయానికి 87.42 ఎకరాలకు సెంట్ల భూములకు ఈఏడాది రూ.8లక్షల48వేల500 లభించాయి. గతంకంటే రూ.2లక్షలు అదనంగా లభించాయని తెలిపారు. కాగా త్రిపురాంతక స్వామి ఆలయానికి చెందిన మరో 60 ఎకరాల భూములకు వచ్చే ఏడాది కౌలు వేలం జరుగుందని ఈవో నారాయణరెడ్డి తెలిపారు. చెన్నకేశవులస్వామి ఆలయానికి చెందిన మరో 30ఎకరాల భూములకు తగిన విధంగా ధర లభించకపోవడంతో కౌలు వేలం నిలిచిపోయింది. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 8 : జిల్లాలోని అన్ని రక్త పరీక్షా కేంద్రాలు(ల్యాబ్‌లు), డయాగ్నోస్టిక్ సెంటర్లు, జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు వారం రోజుల్లో రిజిస్ట్రేషన్ నమోదుతో పాటు రెన్యూవల్ చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. అన్ రిజిస్టర్డ్ హాస్పటల్స్‌లో ల్యాబ్‌లు ఉంటే ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద ఆన్‌లైన్‌లో రిజస్టేషన్‌లో చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేయించుకోని పక్షంలో అటువంటి ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఘనంగా వైఎస్సార్ జయంతి

మద్దిపాడు, జూలై 8:పేదల గుండెల్లో వైఎస్ఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సోమవారం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని రాజశేఖర రెడ్డి విగ్రహాలకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ రూపకర్తని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ, వైసీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, బెజవాడ శ్రీరామమూర్తి మండల ఉపాధ్యక్షుడు పైడిపాటి వెంకట్రావు, పల్లకి సత్యనారాయణ రెడ్డి వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, పిచ్చిరాజు రామకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నాగులుప్పలపాడులో

నాగులుప్పలపాడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ 75 వ జయంతి ని పోతవరంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే నాగులుప్పలపాడులో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాచవరంలో ఇన గంటి రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

### మాజీ మంత్రి నివాళులు

సంతనూతలపాడు: సోమవారం సంతనూతలపాడులో మండల వైసీపీ కన్వీనర్ డి.చెంచిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున, జడ్పీటీసీ డి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### చీమకుర్తిలో

చీమకుర్తి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలను సోమవారం చీమకుర్తి పట్టణంలో ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున,జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ,దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు పాల్గొని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### సంక్షేమ పథకాల స్ఫూర్తిప్రదాత వైఎస్సార్

టంగుటూరు : సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అని గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు చెప్పారు. మండలంలోని అనంతవరంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద ఆరోగ్యానికి భరోసా కల్పించారన్నారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శారీ మందిర్ వెంకటేశ్వర్లు, సుబ్బరాజు కొనియాడారు.



చీమకుర్తిలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

## అవీ..ఇవీ..

### అంకమ్మ తల్లి ఆలయంలో స్వామి పూజలు

కొండపి, జూలై 8 : మండలంలోని కట్టుబడివారి పాలెంలోని అంకమ్మ తల్లి కొలుపుల కార్యక్రమంలో సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, పొన్నలూరు మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, కట్టుబడివారిపాలెం నాయకులు దామా మురళి, దామ శ్రీహరి, పోతినేని సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



అంకమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న స్వామి

### సాదాసీదాగా పరిషత్ సమావేశం

జరుగుమల్లి (కొండపి) : జరుగుమల్లి మండల పరిషత్ సమావేశం సోమవారం సాయంత్రం ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన జరుగుమల్లిలోని మండల పరిషత్ సమావేశం హాలులో సాదాసీదాగా జరిగింది. సమావేశానికి సర్పంచ్‌లు హాజరు కాలేదు. దీంతో సమస్యలు ప్రస్తావనకు రాలేదు. అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో ఎంపీడీవో జలజాక్షి, తహసీల్దార్ చిరంజీవి, పీఆర్ఏఈ శ్రీహరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.365



టంగుటూరు కేంద్రంలో జరుగుతున్న పొగాకు కొనుగోళ్లు

టంగుటూరు, జూలై 8 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో సోమవారం గరిష్ఠ ధర రూ.365 రైతులకు దక్కింది. కనిష్ఠ ధర రూ.205 మీదనే కొనసాగుతోంది. సరాసరి ధర రూ.329.93 పడింది. కె ఉప్పలపాడు రైతుల 926 చెక్కులను వేలానికి అనుమతించారు. వీటన్నింటినీ వేలం వేయగా 885 బేళ్లు కొనుగోలు కాగా, మిగిలిన 45 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఇందులో 4 బేళ్లు ఎన్‌బీ కాగా, 17 సీఆర్ అయ్యాయి. కొనుగోళ్లలో 25 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

టంగుటూరు, జూలై 8 : మండలంలోని సాగర తీరాన ఉన్న అనంతవరం పంచాయతీలోని అనంతవరం, తేటుపురం, తాళ్లపాలెం, పసుకుదురు, కేసుపాలెం గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్లేట్లు, గ్లాసులు, నోట్‌పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. అనంతవరం కసుకుర్తి అనసూయమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ కసుకుర్తి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ రాజశేఖర్ ఆధ్వర్యాన ఈకార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా గ్రామసర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు హాజరై మాట్లాడారు. దాతలు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాల ఉన్నతికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాదాతలు ఉప్పలపాటి సుబ్బరాజు, మర్రి భాస్కరరెడ్డి, ఉప్పలపాటి సత్యనారాయణరాజు, బత్తుల నాగరాజు, అనుసూయమ్మ భర్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

### అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నాగులుప్పలపాడు, జూలై 8 :రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఆ శాఖ డీటీ కె.వి.ఆర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల మేరకు సోమవారం తెల్లవారుజామున అమ్మనబ్రోలు నుంచి 50 బస్తాల రేషన్ బియ్యంతో వెళుతున్న లారీని చీర్వానుప్పలపాడు వద్ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు కృష్ణమోహన్, రామనారాయణ రెడ్డి, డెవిడ్, సిహెచ్ కృష్ణమోహన్ బృందం దాడి చేసి పట్టుకుంది. వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యారు స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఒంగోలులోని ఎఫ్‌సీఐ గోడౌన్‌కు తరలించారు. లారీని పోలీసు స్టేషన్లో అప్పగించినట్లు డీటీ కృష్ణమోహన్ తెలిపారు.



విజిలెన్స్ అధికారులు స్వాధీనంచేసుకున్న రేషన్ బియ్యం లారీ

### ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

నాగులుప్పలపాడు, జూలై 8 : ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం ఉప్పుగుండూరులో జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మన్నెగంటి రాఘవమ్మ (72) సోమవారం ఉదయం కనపర్తిలో ఉన్న కోడలు మనవరాలు వద్దకు వెళ్లేందుకు ఉప్పుగుండూరు బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తోంది. ఈ సమయంలో ఒంగోలు వైపు వెళ్లే ఆర్టీసీ ఫైర్ బస్ రావడంతో ఆత్రుతలో బస్సు ముందు నుంచి వెళ్లగా రాఘవమ్మను గమనించని డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో టైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై బ్రహ్మనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి మృతిచెందిన వృద్ధురాలు

### షిర్డీలో మొక్కుచెల్లించిన కార్మికులు


మద్దిపాడు, జూలై 8: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టడంతో సీతారాంపురంకు చెందిన మండవ వెంకట రాయుడు కంపెనీకి చెందిన కూలీలు షిర్డీలో మొక్కులు చెల్లించారు. ప్రముఖ పొగాకు పారిశ్రామికవేత్త మండవ వెంకట్రావు సోమవారం కూలీలను గ్రేడింగ్ కార్మికులను తీసుకుని షిర్డీ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు అర్హులైన పేదలందరికీ పెన్షన్ పెంచడం శుభపరిణామం అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

### అతిసార, డెంగ్యూ ప్రబలకుండా చర్యలు

సంతనూతలపాడు, జూలై 8: అతిసార వ్యాధి ప్రబలకుండా గ్రామాల్లో ఈనెల 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అదేవిధంగా డెంగ్యూను నిర్మూలించేందుకు ఈనెల 31 వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించాలని సంతనూతలపాడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీహరి అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఆరోగ్యసిబ్బంది, పంచాయతీ, అంగనవాడీ,ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సాయంతో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై తగుచర్యలు తీసుకుని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు .

### ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు అభినందనలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 8 : శాసనమండలి సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జనసేన పార్టీ సీనియర్ నేత పి. హరిప్రసాద్‌ను ఆ పార్టీ నాయకులు అభినందించారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం హరిప్రసాద్‌నుకలిసి బొకే ఇచ్చి అభినందించారు. హరిప్రసాద్‌ను అభినందించిన వారిలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ జడా బాలనాగేంద్ర యాదవ్,నగర అధ్యక్షుడు ఎం. రమేష్ ఉన్నారు.



## పాఠశాలల్లో 'విద్యాప్రవేశం' అమలు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 8 : జిల్లాలో 1నుంచి 8 తరగతులున్న పాఠశాలలన్నింటిలో విద్యా ప్రవేశం కార్యక్రమం అమలు చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం. రమేష్ కోరారు. స్థానిక ఒంగోలు మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం విద్యా ప్రవేశం కార్యక్రమాల అమలు తీరును మండల సీఆర్పీలతో సమీక్షించారు. సీఆర్పీలు తమ క్లస్టర్ పరిధిలో దీక్ష యాప్‌లో లాగిన్‌కాని ప్రధానోపాధ్యాయులు వెంటనే లాగిన్ చేసి సమీక్షించుకోవాలన్నారు. విద్యా ప్రవేశ, నేడు బడికిపోతా, నిష్ట, పొగాకు రహిత పాఠశాలలు, ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాలను వివరించారు.ఒంగోలు మండల విద్యాధికారి టి. కిషోర్‌బాబు, సీఆర్పీలు ఉన్నారు.

### బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

బడిఈడు బాలబాలికలందరిని పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష ఏఎంవో ఎం. రమేష్ పిలుపునిచ్చారు. విద్యా ప్రవేశ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పొనుగుపాటి నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి వారందరిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆ కాలనీలో ముగ్గురు డ్రాప్ అవుట్ బాలికలు తిరిగి స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చేర్పించారు. బీసీడీవో మాధవీలత, ఐఈఆర్‌టీ మాలిక్ మొహిద్దీన్, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు ఉన్నారు.

# మహిళను ఎరగా వేసి దోపిడీలు

**బైక్‌వాలాలకు అడ్డుగా వస్తున్న ఆగంతుకురాలు**

**అర్ధరాత్రి చీమకుర్తి తూర్పుబైపాస్ జంక్షన్ సమీపంలో ఘటనలు**

**పోలీసులకు ఫిర్యాదుచేసిన పలువురు బాధితులు**

చీమకుర్తి, జూలై 8 : చీమకుర్తి తూర్పుబైపాస్ జంక్షన్ సమీపంలో కర్నూల్‌రోడ్‌పై ఆదివారం అర్ధరాత్రి హైడ్రామా నడిచింది. సినీ ఫక్కీలో జరిగిన సంఘటనలు పట్టణ వాసులను, వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రివేళ బైక్‌పై చీమకుర్తికి వెళ్లాలంటే బహుపరాక్ అనే విధంగా సంఘటనలు జరిగాయి. అయితే పోలీసులు మాత్రం ఈ సంఘటనలను అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదనటం కొసమెరుపుగా నిలిచింది.ఆందోళన కల్గించే విధంగా జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో చీమకుర్తికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ ఒంగోలులో పని ముగించుకొని చీమకుర్తికి తన బైక్‌పై వస్తున్నాడు.తూర్పుబైపాస్ జంక్షన్‌కు చేరుకోవటానికి వంద మీటర్ల ముందు రోడ్‌పక్కనే ఉన్న అగంతక మహిళ ఏడుస్తూ నన్ను కాపాడండి అంటూ అతని బైక్‌కు అడ్డుగా వచ్చింది. దీంతో బైక్‌ని ఆపి ఏమైంది అంటుండగానే వెనుక వైపు పొలాల్లో నుంచి కర్రలతో నలుగురు వ్యక్తులు అతనివైపు రావటం గమనించాడు. ఏదో జరుగుతుందని ఊహించి తక్షణమే బైక్‌ను ముందుకుపోనిచ్చి సమీపంలో ఉన్న పెట్రోల్‌బంక్ వద్దకు వెళ్లి ఆగి పోలీసులకు సమాచారం అందించాడు. తదుపరి చీమకుర్తి పోలీస్‌స్టేషనకు వెళ్లగానే అక్కడ తనలాగే మరో కొంతమంది బాధిత యువకులున్నారు. వారు కూడా బైక్‌పై వస్తుండగా అదేప్రాంతంలో ఇలాంటి సంఘటన జరగటంతో పోలీసులకు సమాచారం ఇద్దామని వచ్చారు.వెంటనే స్పందించిన బీటు డ్యూటీలో ఉన్న పోలీసులు యువకులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి అగంతక మహిళ,వ్యక్తుల ఆచూకీకోసం గాలించారు. అక్కడ ఎటువంటి ఆనవాళ్లు,వ్యక్తులు కనపడకపోవటంతో తిరిగి వచ్చేశారు.ఈ సంఘటనపై ఎస్‌ఐ కృష్ణయ్య స్పందిస్తూ వాహనదారులు భయపడాల్సిన పరిస్థితులు ఈ ప్రాంతంలో ఏమి లేవన్నారు.ఈ ప్రాంతంలో ఎటువంటి చోరీలు,దోపిడీలు జరగకుండా చర్యలు చేపడతామని అన్నారు. వాహనదారులు ఎటువంటి ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు.



అర్ధరాత్రి స్టేషన్ వద్ద ఫిర్యాదు చేయటానికి వచ్చిన యువకులు

## కోర్టు వివాదంలో వైసీపీ కార్యాలయ స్థలం

- కార్యక్రమాలు చేపట్టేందుకు నేతల సమాయత్తం
- ముందస్తు చర్యలు చేపట్టిన పోలీసులు

ఒంగోలు(క్రైం),జూలై8: వైసీపీ కార్యాలయ నిర్మాణం చేసిన భూమి వివాదాస్పదంగా మారి హైకోర్టు వరకు వెళ్లింది. సోమవారం వైఎస్‌ఆర్ జయంతి ఒంగోలులో వివాదాస్పదమైన స్థలంలో నిర్మించిన నూతన కార్యాలయంలో జరిపేందుకు ఆ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. అంత కంటే ముందుగానే తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలం 2018 లో సర్వేనంబరు 68/1 లో 1.96 ఎకరాలు భూమిని తెలుగుదేశం పార్టీకి కేటాయించారని, నిర్మాణాలు చేపట్టేలోపే ప్రభుత్వ మారడం, అనతరం అదే భూమిలో వైసీపీ కార్యాలయం నిర్మాణం చేపట్టారు. దీంతో తెలుగుదేశం పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. అయినప్పటికీ నిర్మాణాలు నిలుపుదల చేయకపోగా అక్కడ అక్రమంగా నిర్మించిన భవనంలో కార్యకలాపాలు సాగించాలని వైసీపీ నిర్ణయించింది. దీంతో తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులను ఆశ్రయించడంతో కోర్టు వివాదంలో ఉన్న భవనంలో ఎలాంటి కార్యకలాపాలు సాగించరాదని వైసీపీ నాయకులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. అయినప్పటికీ అక్కడ కార్యక్రమం నిర్వహించాలని వైసీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు అప్రమత్తమైన పోలీసులు వివాదాస్పద స్థలంలో కార్యక్రమాలు చేయడం సరైన చర్య కాదని వైసీపీ నాయకులకు తెలియజేశారు. అదే క్రమంలో శాంతి భద్రతలకు భగం కలగకుండా ముందస్తు చర్యలలో భాగంగా భద్రతా చర్యలు చేపట్టారు. దీంతో కార్యాలయం బైట పోలీసులు విధులు నిర్వహిచారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు ఆధ్వర్యంలో భద్రతా చర్యలు తీసుకున్నారు.



ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

## చంద్రపాడులో కొనసాగుతున్న ఉద్రిక్తత

- మళ్లీ ఇరువర్గాల మధ్య ఘర్షణ
- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు
- పికెట్ కొనసాగింపు

చీమకుర్తి,జూలై 8 : మండలంలోని చంద్రపాడు గ్రామంలో ఎన్నికల ఫలితాల అనంతరం సాగిన ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నెలరోజులుగా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినా ఘర్షణ వాతావారణం నెలకొని ఉంది.తాజాగా ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య మరోసారి ఘర్షణ తలెత్తింది.దీంతో రూరల్ సీఐ అజయ్‌కుమార్,ఎస్‌ఐ కృష్ణయ్యలు సోమవారం సాయంత్రం గ్రామానికి వెళ్లి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.మరోసారి ఘర్షణకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇరువర్గాలకు చెందిన పెద్దలతో శాంతికమిటీలను వేశారు. పోలీస్‌పికెట్‌ను కొనసాగించాలని నిర్ణయించారు.



రిజర్వాయర్ ప్రధాన కాలువలో సిమెంట్ లైనింగ్ పనులు

## 'మోపాడు' ఆధునికీకరణ పనులు ప్రారంభం

పామూరు, జూలై 8: జైకో నిధులతో మండలంలోని మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. వంద సంవత్సరాల మోపాడు రిజర్వాయర్‌ను కాపాడుకొందాం అనే నినాదంతో ఇటీవల ఎమ్మెల్యే ఉగ్ర ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలిసి రిజర్వాయర్‌ను పరిశీలించారు. శాశ్వత పనులు చేపట్టి పూర్వ వైభవం సంతరించేలా చర్యలు తీసుకోవాలని అదికారులకు ఈసందర్భంగా సూచించారు. ఉగ్ర ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు పనులు చేపట్టారు. ప్రధాన కాలువ కు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు, తూము గేటు మరమ్మతుల కోసం చెరువు లోపలి భాగంలో నీటి ప్రవాహాన్ని మట్టితో అడ్డుకట్టు వేసి రింగ్ బండ్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది రసూల్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో రిమాండ్ ఖైదీ మృతి

మద్దిలపాలెం (విశాఖపట్నం), జూలై 8: నగరంలోని పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతానికి చెందిన అరెమల్ల అశోక్ (24) మానసిక రోగి. 2022లో తన తల్లిని హత్య చేయడంతో పోలీసులు అరెస్టు చేయగా కోర్టు రిమాండ్ విధించింది. ఈ మేరకు ఒంగోలు జైలు నుంచి చికిత్స నిమిత్తం ఈ ఏడాది మే 26న నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకువచ్చారు. కొన్ని రోజులు చికిత్స అనంతరం పోలీసులు మళ్లీ ఒంగోలు జైలుకు తరలించగా అక్కడ నిందితుడు పెదనాన్న బెయిల్ ఇప్పించాడు. ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే అశోక్ తన పెదనాన్నను కూడా హత్య చేయడంతో పోలీసులు మళ్లీ అరెస్టు చేసి, జైలుకు తరలించారు. సమస్య ఎక్కువ కావడంతో మళ్లీ ఒంగోలు నుంచి వారం క్రితం పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి జైల్ గార్డు సంరక్షణలో చికిత్స పొందుతున్నాడు. గార్డు ఆదివారం రాత్రి అశోక్‌ను చూడడానికి వెళ్లేసరికి వార్డులోని కిటికీ ఊచలకు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే ఆసుపత్రి సిబ్బంది సహకారంతో బయటకు తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు. సోమవారం వేకువజామున 2.40 గంటలకు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి వైద్యుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా హత్య కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న అశోక్ మానసిక ఆసుపత్రిలో ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ అమ్మవారు

## ఘనంగా గంగమ్మ గ్రామోత్సవం

చినగంజాం, జూలై 8 : మండలంలోని కడవకుదురు గ్రామంలో గంగమ్మ అమ్మవారి కొలుపుల కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గంగమ్మ అమ్మవారి కొలుపుల కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారి హైమారావు ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. సోమవారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారి ప్రభను ఉంచి గ్రామంలోని పురవీధులలో మేళతాళాలు, కనకతప్పెట్లు, బాణసంచా, యువకుల నృత్యాల నడుమ గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి కొలువుల కార్యక్రమాలను ముగిస్తున్నట్లు ఆలయ పూజారి తెలిపారు. యాదవ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

# ఎన్‌ఆర్‌ఐల ద్వారా పాఠశాలల అభివృద్ధి

- టీడీపీ నాయకుడు డాక్టర్ లలిత్ సాగర్
- 20 మంది పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు పంపిణీ
- దాత వెంకట్‌ను అభినందించిన ఉపాధ్యాయులు



పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, పక్కన దాత, ఎన్‌ఆర్‌ఐ వెంకట్

ముండ్లమూరు, జూలై 8: ఎన్‌ఆర్‌ఐల సహకారంతో పాఠశాలలు, గ్రా మాలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. ఇందుకు తానాలో రైతుల అ సోసియేషన్ చైర్మన్ జిల్లెలమూడి వెంకట్ నిదర్శనమని కొనియాడారు. సోమవారం ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చది విన పేద విద్యార్థులతో పాటు మెరిట్ సాధించిన 14 మంది అద్దంకి, తెలంగాణ లోని మిర్యాలగూడెం ప్రాంతానికి చెందిన విద్యార్థులకు రూ.10 లక్షలు విలువ చేసే ల్యాప్ టాప్‌లు డాక్టర్ లలిత్ సాగర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభకు పాఠశాల ప్రిన్సి పాల్ కె.పూర్ణచంద్రరరావు అధ్యక్షత వహించారు.





వెంకట్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరరావు, ఉపాధ్యాయులు, లలిత్ సాగర్

ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ లలిత్‌సాగర్ మాట్లాడుతూ ఉత్తర అమెరికా సంఘం వారి సౌజన్యంతో పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌ల పంపిణీకి దాతైన మండలంలోని ఉల్లగల్లు గ్రామానికి చెందిన ఎన్ ఆర్ఐ జిల్లెలమూడి వెంకట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తాను పుట్టి పెరిగిన గ్రామంతో పాటు మండలాన్ని అభివృద్ధి చేయాలనే ఆలో చన ప్రతిఒక్కరికి కలగాలన్నారు. ఇప్పటివరకు వెంకట్ పలు సేవా కా ర్యక్రమాల్లో పాల్గొనటం శుభపరిణామమన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎప్పుడూ ఎన్‌ఆర్‌ఐలను ప్రోత్సహిస్తుందన్నారు. మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యల్లో ప్రధానంగా విద్యార్థుల కోసం బస్సు షెల్టర్, వా టర్ ప్లాంట్ ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. మంత్రి స్వామితో మాట్లాడి హాస్టల్‌కు భవనం ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామన్నారు.

దాత, ఎన్‌ఆర్‌ఐ జిల్లెలమూడి వెంకట్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామంతో పాటు మండలంలోని గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం రే కుల షెడ్డుకు ఎంత ఖర్చు అయినా నిర్మిస్తామన్నారు. అనంతరం తెలం గాణ రాష్ట్రం మిర్యాలగూడెం మండలం యాదగిరిపల్లికి చెందిన తల్లిదం డ్రులు లేని పేద విద్యార్థి కుంచం శివ ఇటీవల జేఈఈ ఆల్ ఇండియా 211వ ర్యాంకు సాధించటంతో ఆ విద్యార్థికి లక్ష రూపాయల నగదు, ల్యాప్ టాప్ అందజేశారు. అలాగే, కుట్టుమిషన్లు, రైతులకు అవసరమై న పరికరాలను పంపిణీ చేస్తానని వెంకట్ చెప్పారు. అనంతరం వెంక ట్ తల్లిదండ్రులు తిరుపతయ్య, గోవిందమ్మను సన్మానించారు.

కార్యక్రమంలో వెంకట్ సోదరుడు రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు రాముడు, తిరుమలరావు, తానా ప్రతినిధి బండి నాగేశ్వరరావు, నారారాయణ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ జోసిరెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరరావు, మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, కామని పూర్ణచంద్రరరావు, రెడ్డిమాసు రాఘవులు, కొండవీటి బాలయ్య, మండలపు శేషయ్య, శ్రీవిద్య పాల్గొన్నారు.



కోటప్పకొండకు పాదయాత్రగా తరలి వెళుతున్న తమ్ముళ్లు

## కోటప్పకొండకు పాదయాత్ర

**మొక్కులు తీర్చుకున్న కారంచేడు తెలుగు తమ్ముళ్లు**

కారంచేడు(పర్చూరు), జూలై 8 : వైసీపీ గద్దె దిగడం, ప్రజా కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు విజయం సాధించడంతో కారంచేడు గ్రామ తెలుగుదేశం పార్టీ శ్రేణులు అభిమానం చాటుకున్నారు. కారంచేడు నుంచి కోటప్పకొండకు సోమవారం పాదయాత్రను చేపట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చి, చంద్రబాబు సీఎంగా, ఎమ్మెల్యేగా ఏలూరి గెలుపొందితే కోటప్పకొండకు వస్తామని మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో స్వామివారికి మొక్కులు తీర్చుకేనేందుకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో బోడాడ హరి, కొల్ల భాస్కర్, గోరంట్ల వెంకటరత్నం, చాగంటి నాయనమ్మ, నల్లగొర్ల శ్రీరాములు, చాగంటి లక్ష్మీనారాయణ, యార్లగడ్డ ప్రహుదు తదితరులు పాల్గొన్నారు.





ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

## ఆర్యవైశ్యులకు అన్నివిధాలా అండగా ఉంటాం

**ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్**

చీరాల, జూలై 8 : ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ఎంజీసీ మార్కెట్‌లో సోమవారం ఎంజీసీ మార్కెట్ డెవపల్‌మెంట్ సొసైటీ, ది టెక్స్‌టైల్ మర్చంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎంపీ ఇరువురు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్య వైశ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాము వెన్నంటి ఉండి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం ఇరువురును కార్యక్రమ నిర్వహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాతాని ఉ మామహేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు, నాయకులు, కార్యకర్తలు ఎల్లొన్నారు.

# వైఎస్ జయంతి కార్యక్రమాలకు నేతలు దూరం

**హాజరు కాని మునిసిపల్ చైర్‌పర్సన్, పలువురు కౌన్సిలర్‌లు**

అద్దంకి, జూలై 8 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు వైసీపీ ఆధ్వర్యంలో ని యోజకవర్గంలోని అన్ని మండలాలలో సోమవారం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమాలకు వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి హాజరయ్యారు. స్థాని కంగా పలువురు నేతలు దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. టీడీపీ కూటమి అధికారంలో ఉండడంతో వైసీపీ కండువాలతో గెలిచిన పలువురు ప్రజాప్రతినిధులు కార్యక్రమాలకు ము ఖం చాటేసినట్లు తెలుస్తోంది. అద్దంకి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో వైఎస్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, అద్దంకి పట్టణ, మండల పార్టీల అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, జగన్మోహనరెడ్డి, బీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా అద్దంకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మతో పాటు వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్‌లు కొమ్మాలపాటి సుధీర్, మరికొందరు వైసీపీ కౌన్సిలర్‌లు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొంతమంది కౌన్సిలర్‌ల భర్తలు మాత్రం హాజరయ్యా రు. మున్సిపల్ పాలక మండలిలోని ఇద్దరు కౌన్సిలర్‌లు ఎన్నికలకు ముందే టీడీపీ గూటికి చేరగా, మంత్రి రవి కుమార్ ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు వైస్‌చైర్మన్ దేసు పద్మేష్ హాజరయ్యారు. చైర్‌పర్సన్‌తో పాటు మరికొంత మంది కౌన్సిలర్‌లు దూరంగా ఉండడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గడం ఖాయంగా కన్పిస్తుంది.

## విదేశీ విద్య పథకం పునఃప్రారంభం హర్షణీయం

- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 8 : ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు అంబేద్కర్ విదేశీ విద్యా పథకం కింద రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించే ప్రక్రియను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించడం హర్షనీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ముక్కోణపు పార్కు సెంటర్లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి సోమవారం పార్టీ శ్రేణులతో కలసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన సాగిస్తూ ముందడుగు వేస్తున్నారన్నారు. విద్యాభివృద్ధికి అందిస్తున్న చేయూతను అర్హులు వినియోగించుకోవాలని కొండయ్య కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గ్రామీణ రోడ్లపై దృష్టి సారించండి

నియోజకవకర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకుగాను రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కొండయ్య అధికారులకు చెప్పా రు. పార్టీ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్‌శాఖ డీఈఈ శేషయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహులు, చీరాల, వేటపాలెం మండలాల ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేయించండి. కాంట్రాక్టర్లుకు బిల్లులు మంజూరు చేయండి. అంతకుముందు నాణ్యత ప్రమాణాలను పక్కాగా పరీక్షించండి. నాణ్యతలో ఎక్కడ రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అనంతరం అధికారుల సందేహాలను నివృత్తి చేశారు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

# 'మీ కోసం'కు భారీగా అర్జీలు

- స్వయంగా స్వీకరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా
- హాజరైన వివిధ శాఖల అధికారులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం జూలై 8 : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరైన ఈ కార్యక్రమంలో మొత్తం 487 అర్జీలు వచ్చాయి. వాటిల్లో ఎక్కువ భాగం రెవెన్యూ శాఖకు సంబంధించనవే ఉన్నాయి. మార్కాపురం నియోజకవర్గ పరిధి వరకే కార్యక్రమం నిర్వహించినా యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కూడా భారీగా హాజరై తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ప్రతి అర్జీదారునికి తగిన సమయాన్ని కేటాయించి సమస్యలను కలెక్టర్ సావదానంగా విన్నారు. అర్జీదారులకు ఇబ్బంది లేకుండా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. ముందుగా కళ్యాణ మండపం ముందే అర్జీలను పరిశీలించి వారి ఫిర్యాదు ఏ శాఖకు చెందినదో నమోదు చేశారు. లోపలికి ఒక్కొక్కరిని పంపారు. అర్జీదారులు క్రమపద్ధతిలో క్యూలైన్‌లలో ఉండేలా పోలీసు సిబ్బంది చూశారు.

- మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల కూడా లేకపోవడంతో పేద విద్యార్థులు రూ.వేలల్లో ఫీజులు కట్టి చదవలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

- కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీబీఎస్‌ఈ సిలబస్‌ను గత ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టినా రెండవ బాష తెలుగు, ఉర్దూలలో ఏదో ఒకటే ఉంచాలనే నిబంధన వలన ఒక్క మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 200 మంది ఉర్దూ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం మారిందని ఎంపీజే నాయకులు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారిణి బి.సుభద్రకు అర్జీ అందజేశారు.

- యర్రగొండపాలెం పట్టణంలోని మదర్‌థెరిస్సా కళాశాలలో చదువుతున్న 100 మంది ఎస్టీ విద్యార్థినులకు ప్రభుత్వ హాస్టల్ వసతిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థిను లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్టీ బాలికల వసతిగృహం లేకపోవడంతో బీసీ, ఎస్సీ వసతి గృహాలకు దరఖాస్తు చేసుకున్నా పరిమిత సంఖ్యలో సీట్లు ఉండటంతో ఎక్కువ మంది కళాశాల వసతిగృహంలో డబ్బులు చెల్లించే స్థోమతలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

**పింఛన్ తీసేశారు.. ఇప్పించండి**

మార్కాపురం రూరల్ : ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతుడు యక్కంటి వెంకటరెడ్డి తనకు పింఛన్ పునరుద్ధరించాలని కోరారు. తనకు 90 శాతం అంగవైకల్యం ఉందని, గతంలో ఇస్తున్న పెన్షన్ వైసీపీ ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసిందని తిరిగి ఇప్పించాలని కోరారు. 2023 జనవరి నుంచి వైసీపీ ప్రభుత్వం పింఛన్లు నిలిపివేసిందన్నారు. అప్పట్లోనే సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.


కార్యక్రమానికి హాజరైన జిల్లా, మండల స్థాయి అధికారులు

**కోర్టు ఆదేశాలు అమలుచేయడం లేదు..**

మార్కాపురం రూరల్ : కోర్టులో తీర్పు ఇచ్చినప్పటికీ రెవెన్యూ అధికారులు రికార్డులలో తన పేరుతో భూమిని చూపించడం లేదని అలాగే పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వడం లేదని కొనకనమిట్ల మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు బూదాల మాణిక్యమ్మ సోమవారం మార్కాపురంలో జరిగిన ప్రత్యేక మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వంలో తన సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించొద్దు**

మార్కాపురం వన్‌టౌన్ : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల అక్రమ తొలగింపులు మానుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం డీఈవో సుభద్రకు వినతిపత్రం ఇచ్చారు. స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సమస్యలు వివరించారు. ఆమె డీఈవో సుభద్ర దృష్టికి సమస్యలు తెలిపారు. సమస్యలు పరిశీలించి యథావిధిగా ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు గత 24 ఏళ్ల నుంచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని ఎంఈవోలు, హెచ్‌ఎంలు, రాజకీయ నాయకులు రాజీనామా చేయమని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సరోజ, కొండమ్మ, శారద, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రంలో చోరీ

బేస్తవారపేట, జూలై 8: బేస్తవారపేట పట్టణంలోని రైతుభరోసా కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగలకొట్టి లోపలికి ప్రవేశించి ఒక ఎల్‌ఈడీ టీవీ, ఐదు సిలింగ్ ప్యాన్లు, గ్యాస్ సిలిండర్, పోయ్యిలను అపహరించుకు పోయారు.


ఆర్‌బీకేలో తొలగించిన సీలింగ్ ఫ్యాన్

ఈ ఘటన ఆదివారం చోటుచేసుకోగా, సోమవారం ఉదయం వెలుగు చూసింది. కార్యాలయ సిబ్బంది ఉదయం వెళ్లి తలుపులు తెరచి ఉండటం చూసి వెంటనే వ్యవసాయాధికారి జె.మేర్సీకి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై నరసింహారావు ఘటన స్థలం చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

## ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు

త్రిపురాంతకం, జూలై 8: మండల కేంద్రంలోని పలు ఎరువులు, పురుగుమందులు, విత్తన దుకాణాల్లో వ్యవసాయశాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా శ్రీరామ ట్రేడర్స్, శ్రీవెంకట సుబ్రమణ్యేశ్వర ట్రేడర్స్, మల్లీశ్వరి హైబ్రీడ్ సీడ్స్ డిపోలలో తనిఖీలు నిర్వహించారు.


తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు


ఎరువులు, పురుగమందులు, విత్తన నిల్వలను, రికార్డులను పరిశీలించారు. సరైన ప్రిన్సిపుల్ సర్టిఫికేట్, వేరే జిల్లాలకు రీటైల్ డీలర్ ఇన్‌వాయిస్‌లు రాసినందుకుగాను రూ.2,54,924 విలువైన ఎరువులు, రూ.1,79,410 విలువైన పురుగుమందులు, రూ.68,02,500 విలువైన విత్తనాల అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు తనిఖీ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో తిరుపతి ఐవోపీ విజిలెన్స్ అధికారి ఎస్.చంద్రశేఖర్, గుంటూరు కమిషనరేట్ వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.లక్ష్మణకుమార్, స్థానిక ఏవో కె.నీరజ పాల్గొన్నారు.

## మానసిక వైద్యశాలలో అనుమానాస్పదంగా రిమాండ్ ఖైదీ మృతి

మద్దిలపాలెం (విశాఖపట్నం), జూలై 8: నగరంలోని పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, మార్కాపురం ప్రాంతానికి చెందిన అరెమల్ల అశోక్ (24) మానసిక రోగి. 2022లో తన తల్లిని హత్య చేయగా, కోర్టు రిమాండ్ విధించింది. ఈ మేరకు ఒంగోలు జైలు నుంచి చికిత్స నిమిత్తం ఈ ఏడాది మే 26న నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకువచ్చారు. కొన్ని రోజులు చికిత్స అనంతరం పోలీసులు మళ్లీ ఒంగోలు జైలుకు తరలించారు. దీంతో నిందితుడు పెదనాన్న బెయిల్ ఇప్పించాడు. ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే అశోక్ తన పెదనాన్నను కూడా హత్య చేశాడు. పోలీసులు మళ్లీ అరెస్టు చేసి, జైలుకు తరలించారు. సమస్య ఎక్కువ కావడంతో మళ్లీ ఒంగోలు నుంచి వారంక్రితం పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకొచ్చారు. అప్పటి నుంచి జైల్ గార్డు సంరక్షణలో చికిత్స పొందుతున్నాడు. గార్డు ఆదివారం రాత్రి అశోక్‌ను చూడడానికి వెళ్లేసరికి వార్డులోని కిటికీ ఊచలకు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. ఆసుపత్రి సిబ్బంది సహకారంతో బయటకు తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు. సోమవారం వేకువజామున 2.40 గంటలకు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వైద్యుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా వైఎస్సార్ జయంతి

మార్కాపురం, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ముందుగా ఉదయం స్థానిక గడియార స్తంభం వద్ద వైఎస్సా ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైఎస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, వైసీపీ కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


భోజనం అందజేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

స్థానిక స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఆహార పదార్థాలను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.

గిద్దలూరు : పట్టణంలోని రాచర్లగేటు కూడలిలో దివంగత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రాభివృద్ధికి రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి, ఎంపీపీ కడప లక్ష్మీ, మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, వైసీపీ నాయకులు ఎదురు శ్రీనివాసరెడ్డి, సీఆర్‌బి మురళి, బాదం గోపాల్, భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ బాలిరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఎర్రగొండపాలెం ప్రధాన కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఎంపీపీ డి.కిరణ్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సర్పంచ్ అరుణాబాయి, మండల కన్వీనర్ కొప్పర్తి ఓబులరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...**

మార్కాపురం వన్‌టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ 75వ జయంతి నిర్వహించా రు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయ కులు సయ్యద్ జావీద్ అన్వర్ ఆధ్వర్యంలో స్ఫూర్తి మానసిక దివ్యాం గుల పాఠశాలలో వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, కలాం, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యం స్వాధీనం

**రావిపాడు గ్రామంలోని ఓ గృహంలో సీజ్**

కంభం, జూలై 8 : కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలో రావిపాడుకు వెళ్లే రహదారి పక్కన ఓ గృహంలో అక్రమంగా డంప్ చేసిన 200 బస్తాల రేషన్ బియ్యాన్ని కంభం గోడౌన్ డీటీ ప్రసాద్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి అనిల్‌లు స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కథనం ప్రకారం మినిలారీలో రేషన్‌బియ్యాన్ని తీసుకొచ్చిన వారు రావిపాడు రూటులో ఓ గృహంలో భద్రపరుస్తున్నారు. గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి వచ్చి అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. ఈ రేషన్ బియ్యాన్ని గోడౌన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. రేషన్‌బియ్యాన్ని అక్రమంగా దాచిన గృహం గతంలో కంభం మార్కెట్ యార్డులో సహకార సంఘంలో పని చేస్తూ రైతులకు రాయితీ శనగ విత్తనాలను పక్కదారి పట్టించి సస్పెండ్ అయిన దిలీప్ అనే వ్యక్తికి చెందినదిగా తెలిసింది. ఓవైపు పలు ప్రాంతాలలో భారీగా డంప్ చేసిన అక్రమ రేషన్‌బియ్యాన్ని అధికారులు దాడులు చేసి పట్టుకుంటున్నా మరో వైపు అంతకు రెట్టింపుగా రేషన్ బియ్యం నిల్వ చేయడం గమనార్హం. ఇప్పటివరకు బియ్యం దాచిన వారిపై, రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా నామమాత్రపు కేసులు నమోదు చేయడమే అక్రమదారులకు వరంగా మారిందని పలువురు భావిస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

మార్కాపురం, జూలై 8: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంవహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. మీ కోసం కార్యక్రమంలో పలువురు మార్కాపురం జీజీహెచ్‌లో వైద్యసేవలు సరిగా అందడం లేదని ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు వైద్యశాలలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఔట్ పేషెంట్, కాన్పులు, చిన్నపిల్లల వార్డులు, సదరం విభాగం, స్టాఫ్ కోసం వంటచేసే గదులు, మందుల గదులను తనిఖీ చేశారు. సంబందిత రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి సగటున రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు, వారిలో ఎంతమందిని ఒంగోలు రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు అనే వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని రోగులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారికి అక్కడ వైద్యసేవలు సక్రమంగా అందుతు న్నాయో లేవో అనే విషయాలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సక్రమంగా వైద్యసేవలు అందడంలేదని ఫిర్యాదులు అందాయన్నారు. ముఖ్యంగా ఎక్కువ సంఖ్యలో కేసులను ఒంగో లు రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారని తెలిసిందన్నారు. వైద్యులు కూడా సక్రమంగా విధుల్లో ఉండడం లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. త్వరలోనే మరోసారి రాత్రివేళలో ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు. సదరం శిబిరం నిర్వహించిన తర్వాత సర్టిఫికేట్ల జారీలో ఏమైనా అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ రాజమన్నార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సావిత్రి, ఇతర వైద్యులు ఉన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

## మండల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధచూపాలి

**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి**

కొమరోలు, జూలై 8 : కొమరోలు మండల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆదర్శ మండలంగా తీర్చి దిద్దాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమ వారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కామూరి అమూల్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజ రైన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోనే కొమరోలు మండలానికి ప్రత్యేక అభివృద్ధి నిధుల ను కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. అదే ఒరవడిని కొనసాగించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మినిట్స్‌ను తప్పనిసరి గా రాయాలని, వాటిని తర్వాతి సమావేశంలో చర్చకు తీసుకురావాలన్నారు. కొమరోలు గ్రామ పంచాయతీలోని పరిస్థితిపై సమగ్రమైన విచారణ జరిపి నివేదికను ఇవ్వాలని ఎంపీడీఓ నరసింహారావును ఆదేశించారు. ప్రతి సమస్యను ప్రజాప్రతినిధుల ద్వార సత్వరమే పరిష్కార దిశగా కృషిచేయాలన్నారు. ఎంపీపీ కామూరి అమూల్య మాట్లాడుతూ గతంలో అశోక్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. మండలంలోని కొమరోలు ఆర్యమరాఠి కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేయలేదని సభ్యులు ప్రశ్నించారు. స్పందించిన ఏఈ వాటర్ ట్యాంకుకు మెట్లు లేనందున శుభ్రపరచలేదన్నారు. దీనికి ఎమ్మెల్యే ఎంపీపీ నిధుల ద్వార సత్వరమే మరమ్మతులు చేసి మండలంలోని మిట్టమీదిపల్లి, కొమరోలు, అల్లినగరం, ఇడమకల్లు ట్యాంకులను క్లీనింగ్ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. కొమరోలు ప్రభుత్వ వైద్యశాలలో అవసమైన మందులు, నిధులను ఇప్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశాలలో ఎక్సరే మిషన్ ఏర్పాటు చేయాలని, మహిళా వైద్యాధికారిని నియమించాలన్నారు. మండల తహసీల్దార్ మల్లికార్జునరావు రెగ్యులర్‌గా కార్యాలయానికి రాకపోవడంతో కొమరోలులోని రేషన్‌డీలర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. రెండు రోజులకై సరుకులు అయిపోయాయని లబ్ధిదారులను వెనక్కు పంపిస్తున్నారని సమావేశంలో సభ్యులు లేవనేత్తారు. మండలంలోని తాటిచర్ల పశువైద్యాధికారి సమావేశాలకు ప్రతిసారి డుమ్మాకొడుతున్నారని సమావేశంలో ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

**విద్యార్థులకు కిట్‌ల పంపిణీ**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థు లకు నాణ్యమైన విద్యను అందించాలని గిద్దలూ రు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. పాఠశాలలో ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీపీ కామూరి అమూల్య మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, మాజీ ఉపాధ్యాక్షులు తిరుమలరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ క్రిష్ణమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్దుల్‌ఖాదర్, నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, అనపా వీరశేఖర్, రవింద్రారెడ్డి, ఓబుల్‌రెడ్డి, చలిచీమల శ్రీనివాసచౌదరి, ఎంపీటీసీ చెన్నారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, యల్లారెడ్డి, బాలిరెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక విధానంపై హర్షం

మార్కాపురం, జూలై 8: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచి అమలు చేస్తున్న నేపథ్యంలో స్థానిక భవన నిర్మాణ కార్మికులు ఉదయం కూటమి నేతల ఫోటోలకు పాలాభిషేకం చేశారు. స్థానిక గడియార స్తంభం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కల గడ్డ మల్లికార్జున్, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలీలు పాల్గొన్నారు. ముందుగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే నారాయణరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ఉచిత ఇసుకతో నిర్మాణ రంగం ఊపందుకుని కార్మికులకు పుష్కలంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. టీడీపీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుకను పంపిణీ చేస్తానని ఇచ్చిన ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు సోమవారం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు సోమ వారం పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు షేక్ తీరా మాట్లాడుతూ ఉచిత ఇసుక పంపిణీ చేసినందుకు చంద్రబాబు నాయుడుకు తమ కుటుంబాలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, సీనియర్ టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, కాకర్ల కోటయ్య, భవన నిర్మాణ కార్మికుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఆవుల యోగయ్య, అన్వర్, షేక్‌వలి, తెలుగు యువత మైనార్టీ నాయకులు షేక్‌వలి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మార్కాపురంలో పాలాభిషేకం చేస్తున్న కార్మికులు

## అవీ..ఇవీ..

### కాలువల నిర్మాణం చేపడతాం

- మున్సిపల్ కమిషనర్

గిద్దలూరు, జూలై 8 : డ్రైనేజీ కాలువలు లేక ఎక్కడి మురుగు అక్కడే అనే 'ఆంధ్రజ్యోతి' వార్తా కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. క్లబ్ రోడ్డు, షాదీఖానా రోడ్డు, బాలుర ఉన్నత పాఠశాల పక్కరోడ్డు, పలు వీధుల్లో మురుగునీరు కాలువల నిర్మాణం చేపట్టేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని కమిషనర్ యు.శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. కౌన్సిల్ ఆమోదం పొందిన తరువాత నిధుల లభ్యతను బట్టి విడతల వారిగా మురికినీటి కాలువల నిర్మాణం చేపడతామని పేర్కొంటూ అప్పటివరకు కాలువలు లేని ప్రాంతాలలో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించి దుర్వాసన వెదజల్లకుండా పాదాచారులకు, ఆప్రాంత వాసులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామని కమీషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### 12న శాకాంబరి అలంకారం

గిద్దలూరు, జూలై 8 : పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 12న శుక్రవారం శాకాంబరి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో చేసిన శాకాంబరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. 12వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలలోపు భక్తులు దేవస్థానానికి వచ్చి కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు విరాళంగా ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

### మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తాం

- సంక్షేమ అధికారి రజని


మాట్లాడుతున్న మాజీ సైనికుల సంక్షేమాధికారి రజిని

మార్కాపురం వన్‌టౌన్, జూలై 8: మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తామని మాజీ సైనికుల సంక్షేమ అధికారిణి రజిని అన్నారు. స్థానిక మాజీ సైనికుల సంఘ భవనంలో సోమవారం మాజీ సైనికులకు అవగాహన కల్పించారు. పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం నాయకులు హరినారాయణరెడ్డి, రామకృష్ణయ్య, తిరుమలయ్య, అంకన్న, వరవెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### 15న మండల సర్వసభ్య సమావేశం

బేస్తవారపేట, జూలై 8: బేస్తవారపేట మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15న ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో టీ.పార్వతి తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజ ప్రతినిధులు తప్పక పాల్గొనాలని కోరారు.

### అధికారులతీరు మారలేదు

- టీడీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు రసూల్ మహమ్మద్

పొదిలి, జూలై 8 : ప్రభుత్వం మారినా అధికారులతీరు మారలేదని జిల్లా ముస్లిం మైనారిటీసెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేతబట్టి నెలరోజులైనా ప్రభుత్వం ఆదేశాలను అమలు పరచలేదు. పొదిలి ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఫోటోలను ఏర్పాటు చేయాలని చెప్పినప్పటికీ, ఇంతవరకు అమలు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గురువారం నాటికి అన్ని కార్యాలయాల్లో ఫోటోలు ఏర్పాటు చేయకపోతే తామే కార్యాలయాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు. కనుక అధికారులు గమనించి ప్రభుత్వం ఆదేశాలను అమలు చేయాలని ఆయన కోరారు. అన్ని కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

### ఘనంగా పీర్లపెట్టె ఊరేగింపు


ఊరేగిస్తున్న పీర్ల పెట్టె

మార్కాపురం వన్‌టౌన్, జూలై 8: మొహర్రం మాసం సందర్భంగా మార్కాపురం పట్టణంలో సోమవారం పీర్ల పెట్టెలు ఊరేగించారు. స్థానిక గొర్లగడ్డ పీర్లచావిడిలో పీర్ల పెట్టెలను దించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, తప్పెట్ల నడుమ పట్టణ వీధులలో పీర్ల పెట్టెను ఊరేగించారు.

### సాయిబాబా మందిరంలో సప్తాహ ప్రవచనం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 8:. గురుపౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక నెహ్రూబజార్‌లోని షిరిడీ సాయిబాబా మందిరంలో నాలుగో రోజు సప్తహ ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. సాయినాథుని బోధనలు ఆచరణ, నేటి సమాజంలో ఎంతో ముఖ్యమన్నారు. సాయి ఉపవాసకులు సాయిదాసు కూడా సాయి బాబా గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్ష, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, సభ్యులు కరీం, కృష్ణ మోహన్, వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణ

### మంచినీటి బోరు ఏర్పాటు

- 24 గంటల్లోనే పనులు ప్రారంభం


బోరు పనులను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ చాముండేశ్వరి

కంభం, జూలై 8 : కంభం బాలికల గురుకుల పాఠశాలలో తాగునీటి ఎద్దడి నివారణకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో బోరు ఏర్పాటు చేసేందుకు టీడీపీ నాయకులు, ప్రిన్సిపాల్ భూమి పూజ చేశారు. బాలికల గురుకుల పాఠశాలలో బోర్లు ఎండిపోవడంతో నెలరోజులుగా నీటికి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదివారం పాఠశాలను సందర్శించి విద్యార్థినులను, ప్రిన్సిపాల్‌ను అడిగి నీటి సమస్యను తెలుసుకొన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేయడంతో స్పందించిన కలెక్టర్ 24 గంటల్లో బోరు వేయిస్తానని హామీ ఇచ్చిన విషయం విధితమే. ఆమేరకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు సోమవారం ఉదయమే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోరు బండితో పాఠశాలకు వచ్చారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, కొత్తపల్లి శ్రీనివాసులు, టీడీపీ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ కోటయ్య, మాజీ సర్పంచ్ కోటయ్య, టీడీపీ నాయకులు గోపిరెడ్డి కొబ్బరి కాయలు కొట్టి బోరును ప్రారంభించారు. 24 గంటల్లోనే కళాశాల నీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



యర్రబాలెంలో మురుగునీరు వెళ్లేందుకు ఎక్స్‌కవేటర్‌తో తీస్తున్న కాలువ

## యర్రబాలెంలో పారిశుధ్య పనులు

దొనకొండ, జూలై 8: మండలంలోని యర్రబాలెంలో పారిశుధ్య పనులను గ్రామ కార్యదర్శి డేవిడ్ నేతృత్వంలో సోమవారం చేపట్టారు. గ్రామంలో సైడు కాల్వలో మురుగునీరు ముందుకు వెళ్లకుండా నిలబడటంతో దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో పడకేసిన పారిశుధ్యం శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కార్యదర్శి డేవిడ్ సైడ్‌కాల్వలో నిలచిన మురుగునీరు ముందుకు పోయేలా ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీయించే చర్యలు చేపట్టారు.

## రామాలయం హుండీ చోరీ

పామూరు, జూలై 8: పామూరు పట్టణంలోని ఆకులవీధిలోగల శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం హుండీ తాళాలు పగులకొట్టి నగదు దోచుకొని వెళ్లినట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు. ఉదయం దేవాలయానికి వచ్చిన భక్తులు కానుకల హుండీ తాళాలు పగులకొట్టి ఉండటాన్ని గమనించి సమాచారం అందించడంతో నిర్వాహకులు వచ్చి పరిశీలించారు. కానుకల హుండీలో సుమారు రూ.10 వేల వరకు నగదు ఉంటుందని అంచనా వేస్తున్నారు. చోరీ జరిగిన సంఘటన గురించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న కైపు రామకోటిరెడ్డి

తాళ్లూరు, జూలై 8 : మండలంలోని కొత్తపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థుకు కొత్తపాలెంకు చెందిన టీడీపీ సీనియర్‌నేత కైపు రామకోటిరెడ్డి రూ.5 వేల విలువగల పుస్తకసామగ్రిని సోమవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు తనవంతుగా సహకారం అందిస్తూ నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగవాణి, ఉపాధ్యాయుడు దివి రమేస్, అంగన్‌వాడీ కార్యకర్త కురిచేటి వాణి, తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలి

కనిగిరి, జూలై 8: ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన ఫుట్‌పాత్, వీధి వ్యాపారుల సదస్సులో ఆయన మాట్లాడారు. బలవంతంగా వీధి వ్యాపారులను తొలగించటం అన్యాయమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ సీఐటీయూ అండగా ఉంటుందని చెప్పారు.

ఎఐటీయూ పట్టణ నాయకుడు పీసీ కేశవరావు మాట్లాడుతూ జీవనోపాధి కోల్పోయిన కార్మికులను ఆదుకోవటానికి అధికారులు ముందుకు రాకపోవటం అన్యాయమన్నారు. సమావేశంలో నాయకులు బషీర, నరేంద్ర, ఫుట్‌పాత్, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## ఎంపీ మాగుంటకు తాళ్లూరు నేతల అభినందనలు



ఎంపీ మాగుంటను సత్కరిస్తున్న తాళ్లూరు టీడీపీ,జనసేన నేతలు

తాళ్లూరు, జూలై 8: ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన నేతలు సోమవారం ఒంగోలులో ఆయన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. మాగుంటకు శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వల్లభనేని సుబ్బయ్య, షేక్ మీరామొహిద్దీన్, కనిశెట్టి రామలక్ష్మయ్య, బద్దులశ్రీను, దానియేల్, నేరెళ్ల కిషోర్‌బాబు, సూర్యనారాయణ, జనసేన నేత తూము రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐగా నాగమల్లేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



ముండ్లమూరు, జూలై 8: ముండ్లమూరు ఎస్‌ఐగా వి.నాగమల్లేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు మహిళా పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఎస్‌ఐగా పని చేసిన వి.ఆంజనేయులు సెలవుపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు. త్వరలో అన్ని గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకుంటానన్నారు. మండల ప్రజలందరూ తనకు సహకరించాలని ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు కోరారు.

## నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.లక్షా 70 వేలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 8: సీఎస్‌పురం మండలం కోవిలంపాడు పంచాయతి మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ. 1.68, 639లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాదికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కట్ల అమ్మకం ద్వారా రూ.82,140, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.31,435, అన్నదాన విరాళాల ద్వారా రూ.52,564, ఇతర విరాళాల ద్వారా రూ.2,500 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

# మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

» నేటి నుంచి పీర్ల వేడుకలు



చావిడిలో అలంకరించి ఉన్న పీర్లు (ఫైల్)

పామూరు, జూలై 8: మత సామరస్యానికి చిహ్నంగా హిందు - ముస్లింలు అనాదిగా జరుపుకొనే మొహర్రం వేడుకలు ఈనెల 9 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు పీర్ల చావిడి ముజావర్లు తెలిపారు. ఇస్లాం మత వ్యవస్థాపకుడు, మహమ్మద్ ప్రవక్త మనమళ్లు ఇమామే.హసన్, ఇమామే.హుసేన్, ఇమామే ఖాశీం, వంశీయుల త్యాగనిరితికి ప్రతీకగా పది రోజుల పాటు మొహర్రం వేడుకలను జరుపుకోవడం దేశంలో అనాదిగా వస్తున్న ఆచారం. పద్నాలుగు శతాబ్దాల క్రితమే ప్రజాస్వామ్యం, మానవీయ హక్కుల కోసం మహమ్మద్ ప్రవక్త స్థాపించిన ఇస్లాం వ్యవస్థ విస్తరణలో భాగంగా కర్బాల మైదాన యుద్ధ కదనరంగంలో జరిగిన చరిత్రాత్మక పోరాటంలో అశువులబాసిన తీరు, శత్రువులపై వారు చూపిన మానవీయ విలువకు నిలువుటద్దంగా నిలిచి చేసిన ప్రాణ త్యాగాన్ని ప్రతి సంవత్సరం స్మరించుకోవడమే పీర్ల పండుగ ఉద్దేశ్యం. మొహర్రం నెల ప్రారంభంతో ఇస్లాం నూతన సంవత్సర క్యాలెండర్ ప్రారంభమవుతుంది. అమావాస్య ముగిసి నెలవంక దర్శనమవడంతో మొహర్రం వేడుకలు ప్రారంభమవుతాయి. అందులోభాగంగా మంగళవారం నుంచి ఈనెల 18 వరకు జరుగుతాయి. ఈసందర్భంగా పట్టణంలోని మూడు చావిడీలతో పాటు మండలంలోని గోపాలపురం, పలు గ్రామాల్లో ఉన్న పీర్ల చావిడీలకు రంగులు వేయించి రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

# ఎన్‌ఆర్‌ఐల ద్వారా పాఠశాలల అభివృద్ధి

» టీడీపీ నాయకుడు డాక్టర్ లలిత్ సాగర్
» 20 మంది పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు పంపిణీ
» దాత వెంకట్‌ను అభినందించిన ఉపాధ్యాయులు



పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, పక్కన దాత, ఎన్ఆర్ఐ వెంకట్

ముండ్లమూరు, జూలై 8: ఎన్‌ఆర్‌ఐల సహకారంతో పాఠశాలలు, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. ఇందుకు తానాలో రైతుల అసోసియేషన్ చైర్మన్ జిల్లెలమూడి వెంకట్ నిదర్శనమని కొనియాడారు. సోమవారం ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదివిన పేద విద్యార్థులతో పాటు మెరిట్ సాధించిన 14 మంది అద్దంకి, తెలంగాణ లోని మిర్యాలగూడెం ప్రాంతానికి చెందిన విద్యార్థులకు రూ.10 లక్షలు విలువ చేసే ల్యాప్ టాప్‌లు డాక్టర్ లలిత్‌సాగర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభకు పాఠశాల ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరరావు అధ్యక్షత వహించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ లలిత్‌సాగర్ మాట్లాడుతూ ఉత్తర అమెరికా సంఘం వారి సౌజన్యంతో పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌ల పంపిణీకి దాతైన మండలంలోని ఉల్లగల్లు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ జిల్లెలమూడి వెంకట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తాను పుట్టి పెరిగిన గ్రామంతో పాటు మండలాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన ప్రతిఒక్కరికి కలగాలన్నారు. ఇప్పటివరకు వెంకట్ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం శుభపరిణామమన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎప్పుడూ ఎన్ఆర్ఐలను ప్రోత్సహిస్తుందన్నారు. మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యల్లో ప్రధానంగా విద్యార్థుల కోసం బస్సు షెల్టర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. మంత్రి స్వామితో మాట్లాడి హాస్టల్‌కు భవనం ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామన్నారు.



వెంకట్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరరావు, ఉపాధ్యాయులు, లలిత్ సాగర్

దాత, ఎన్ఆర్ఐ జిల్లెలమూడి వెంకట్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామంతో పాటు మండలంలోని గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం రేకుల షెడ్డుకు ఎంత ఖర్చు అయినా నిర్మిస్తామన్నారు. అనంతరం తెలంగాణరాష్ట్రం మిర్యాలగూడెం మండలం యాదగిరిపల్లికి చెందిన తల్లిదండ్రులు లేని పేద విద్యార్థి కుంచం శివ ఇటీవల జేఈఈ ఆల్ ఇండియా 211వ ర్యాంకు సాధించటంతో ఆ విద్యార్థికి లక్ష రూపాయల నగదు, ల్యాప్ టాప్ అందజేశారు. అలాగే, కుట్టుమిషన్లు, రైతులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేస్తానని వెంకట్ చెప్పారు. అనంతరం వెంకట్ తల్లిదండ్రులు తిరుపతయ్య, గోవిందమ్మను సన్మానించారు.

కార్యక్రమంలో వెంకట్ సోదరుడు రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు రాముడు, తిరుమలరావు, తానా ప్రతినిధి బండి నాగేశ్వరరావు, నారారాయణ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ జోసిరెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరరావు, మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, కామని పూర్ణచంద్రరరావు, రెడ్డిమాసు రాఘవులు, కొండవీటి బాలయ్య, మందలపు శేషయ్య, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఇసుక విధానం హర్షణీయం

కనిగిరి, జూలై 8: ఉచిత ఇసుక పాలసీ విధానం హర్షణీయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత ఇసుక పాలసీతో సామాన్యులకు భారీ ఊరట లభించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన నెలలోపే అమల్లోకి తేవటం గొప్ప విషయమన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఇసుక మాఫియాతో రూ.కోట్లు కొల్లగొట్టారన్నారని ఆరోపించారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఇసుక ఉచిత సరఫరా పాలసీపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు.

### చరిత్రాత్మక నిర్ణయం

దర్శి, జూలై 8: ప్రజలకు ఉచితంగా ఇసుక అందించాలని కూటమి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని టీడీపీ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భవన కార్మికులు, నిర్మాణదారుల ఇబ్బందులు గుర్తించి ఉచిత ఇసుక పాల సీని ప్రవేశపెట్టటం హర్షనీయమన్నారు. రాష్ట్ర ప్రగతికి కూటమి ప్రభుత్వం తీసు కుంటున్న నిర్ణయాలు ఎంతో దోహదపడతాయన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ పాలకులు ఇసుక దోపిడీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక మాఫియా కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును దోచుకుందని విమర్శించారు. పేదలు ఇళ్లు కట్టుకునేందకు కూడా ఇసుక అందుబాటులో లేక ఎంతో ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఇసుక దోపిడీ చేసిన వారిపై చర్య లు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



పామూరులో మాట్లాడుతున్న పువ్వాడి వెంకటేశ్వర్లు

### అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే అమలు

పామూరు, జూలై 8: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీ అమలుచేయడంపై ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయం లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు పరిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, ఎం.హుసేన్‌రావయాదవ్, షేక్ ఖాజారహంతుల్లా, జనసేన మండల అధ్యక్షుడు దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ జయంతి



కేక్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

దర్శి, జూలై 8: దివంగత నేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గడియా స్తంభం సెంటర్‌లో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవదానం, వైస్ ఎంపీపీ దుర్గారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీ వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరు: పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచారని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం వైఎస్ జయంతి సందర్భంగా తూర్పుగంగవరం గ్రామంలో ఆయన విగ్రహానికి బూచేపల్లి పూలమాలలువేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ మండల కన్వీనర్ తూము వెంకట సుబ్బారెడ్డి, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, జి.మోషే, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య కేకు కట్‌చేసి శ్రేణులకు పంచిపెట్టారు. మండలంలోని రేగిచెట్లపల్లి గ్రామంలో వైఎస్ విగ్రహాన్ని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ ఆవిష్కరించారు. అనంతరం కేకు కట్‌చేసి పేదలకు చీరెలు పంపిణీచేవారు. కార్యక్రమాల్లో ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ చాంద్ బాషా, అంబటి కొండారెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, జె.గోవిందయ్య, సర్పంచ్ ఎం.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండలం కోవిలంపాడు గ్రామంలో వైఎస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



రిజర్వాయర్ ప్రధాన కాలువలో సిమెంట్ లైనింగ్ పనులు

## 'మోపాడు' ఆధునికీకరణ పనులు ప్రారంభం

పామూరు, జూలై 8: జైకో నిధులతో మండలంలోని మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. వంద సంవత్సరాల మోపాడు రిజర్వాయర్‌ను కాపాడుకొందాం అనే నినాదంతో ఇటీవల ఎమ్మెల్యే ఉగ్ర ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలిసి రిజర్వాయర్‌ను పరిశీలించారు. శాశ్వత పనులు చేపట్టి పూర్వ వైభవం సంతరించేలా చర్యలు తీసుకోవాలని అదికారులకు ఈసందర్భంగా సూచించారు.

ఉగ్ర ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు పనులు చేపట్టారు. ప్రధాన కాలువ కు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు, తూము గేటు మరమ్మతుల కోసం చెరువు లోపలి భాగంలో నీటి ప్రవాహాన్ని మట్టితో అడ్డుకట్టు వేసి రింగ్ బండ్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది రసూల్ పాల్గొన్నారు.



# ఆకతాయిలకు అడ్డాగా విద్యాలయాలు

» విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన

తాళ్లూరు, జూలై 8: అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా విద్యాలయాలు మారుతున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తాళ్లూరులోని వీకే ప్రభుత్వ విద్యాలయ ప్రాంగణం ఆకతాయిలుకు అడ్డాగా మారింది. వాచ్‌మన్ ఉన్నా రాకపోకలకు ఏర్పాటుచేసిన సింగిల్ గేట్ ద్వారా రాత్రిళ్లు ఆట స్థలంలోకి వచ్చి మద్యం సేవిస్తున్నారు. ఖాళీ సీసాలు, తాగిన గ్లాసులను ప్రాంగణంలోనే వదిలి వెళుతున్నారు. పాఠశాల తూర్పువైపు ప్రహరీగోడ వద్ద సైకిల్ స్టాండ్ ఏర్పాటుచేసి వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. రాత్రి సమయంలో వాహనాల చాటున మద్యం సేవించి తాగిన ప్లాస్టిక్ గ్లాసులను కళాశాల ప్రహరీగోడ పైకి విసిరేస్తున్నారు. కళాశాల ప్రహరీగోడ ఆనుకుని బొడ్డు రాయి సమీపాన ప్రభుత్వ నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. ఇక్కడ గోడపై, అరుగుపై మద్యం సేవిస్తూ ఖాళీ సీసాలు, గ్లాసులు పాఠశాల ప్రాంగణంలో పార వేస్తున్నారు. దీంతో ప్రాంగణ మద్యంసీసాలు, గ్లాసులతో నిండిపోతుంది.

గతంలో జిల్లాలోనే ఉత్తమ విద్యాలయంగా పేరొందిన కళాశాల, ఉన్నత పాఠశాల నేడు సమస్యలతో సతమతమవుతున్నది. దీనికితోడు విద్యార్థుల సంఖ్య ఆశించినంత లేదు. విద్యాలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా అడ్డుకట్ట వేసేవారే లేరని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ శాఖ స్పందించి తాళ్లూరు వీకే విద్యాలయ ప్రాంగణం, వాటర్ ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో మద్యం సేవించకుండా, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



కళాశాల ప్రహరీగోడ వద్ద వేసిన మద్యం సీసాలు, మంచినీళ్ల బాటిళ్లు, తాగిన గ్లాసులు





కొల్లూరు : జువ్వలపాలెంలో ఉచిత ఇసుక స్టాక్ పాయింట్‌ను ప్రారంభించి ఇసుక లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి



# కష్టజీవుల కళ్లలో.. ఆనందం

కుదేలైపోయిన నిర్మాణరంగానికి తిరిగి ప్రాణం పోసేందుకు కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైసీపీ సర్కారులో బంగారం కంటే ఖరీదైపోయిన ఇసుకను ప్రజలకు మళ్లీ ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అధికారం చేపట్టిన నెల రోజుల్లోపే కొత్త ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చింది. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. జిల్లాలోని పలు స్టాక్ పాయింట్లలో అందుబాటులో వున్న ఇసుకను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఐదేళ్లుగా నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న ఇసుక సంక్షోభానికి పరిష్కారం లభించినట్లయింది. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఇసుక విధానంతో నిర్మాణ రంగం గాడిన పడి, నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు తిరిగి లభిస్తాయన్న ఆశ కష్టజీవుల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మికులు మనస్ఫూర్తిగా స్వాగతించడంతో పాటు, హర్షం కూడా వ్యక్తం చేస్తున్నారు. తమకు మంచి రోజులు వచ్చాయని సంబరాలు చేసుకుంటున్నారు.

- ఉచిత ఇసుక పాలసీతో నిర్మాణ రంగానికి ఊతం!
- వైసీపీ ప్రభుత్వ ఇసుక దోపిడీతో కార్మికుల అగచాట్లు
- యజమానులను నిలువుదోపిడీ చేసిన బ్లాక్ మార్కెటింగ్
- ఐదేళ్లుగా పనులు కోల్పోయి అర్ధాకలితో బతికిన నిర్మాణ కూలీలు
- ఉచిత ఇసుక రావడంతో నిర్మాణ రంగంలో కదలిక
- జిల్లాలో 6 లక్షల మంది నిర్మాణ కార్మికులకు జీవనోపాధి పునరుద్ధరణ

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఇసుక దోపిడీ విధానం కారణంగా ఘోరంగా నష్టపోయిన రంగా ల్లో భవన నిర్మాణ రంగం ఒకటి. 2014- 19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అందించిన ఉచిత ఇసుక పాలసీని రద్దుచేసిన గత వైసీపీ ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ పేరుతో అడ్డగోలు దోపిడీకి పాల్పడడంతో రాష్ట్రంలో నిర్మాణరంగం కుదేలైపోయింది. ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆగిపోవడంతో ఇటు యజమానులు, అటు కాంట్రాక్టర్లు ఎంతగానో నష్టపోయారు. కానీ అంతకు మిం చిన స్థాయిలో కష్టజీవులైన నిర్మాణ కార్మికులు కష్టాలపా లయ్యారు. కాంట్రాక్టర్లు, యజమానులకు ఆర్థికంగా భారం పెరగగా, నిర్మాణ కార్మికులకు ఉపాధే లేకుండా పోయింది. పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా ఒక రోజో.. ఒక నెలో.. లేక ఒక ఏడాదో కాదు.. ఏకంగా ఐదేళ్లపాటు నిర్మాణ కార్మికులు చేసేందుకు పనిలేక, తినేం దుకు తిండిలేక నిత్యం నరకం అనుభవించారు. అలాంటి వారికి కొత్త ప్రభుత్వం తెరమీదకు తెచ్చిన ఉచిత ఇసుక పాలసీ తిరిగి ప్రాణం పోసింది.

**● అందరికీ అందుబాటులో ఇసుక..**

ఎగుమతి, దిగుమతి, రవాణాతో కలిపి రూ. 9, 10 వేలకు దొరికే 18 టన్నుల లారీ ఇసుక వైసీపీ ప్రభుత్వ కొత్త ఇసుక విధానం కారణంగా రూ. 25 నుంచి 30 వేల వరకూ వెళ్లింది. వ్యాపారం మొత్తం వైసీపీ నేతలు, ఇసుక మాఫియా ఆధీనంలో ఉండడంతో సామాన్యులకు ఎవరికీ ఆన్‌లైన్ బుకింగ్‌లో ఇసుక దొరకలేదు. దీంతో సామాన్యు లు బ్లాక్ మార్కెట్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఒక్కో లారీ ఇసుక రూ. 40 నుంచి 45వేల రూపాయల వరకూ వసూలు చేశారు. అయినా అవసరా లకు తగిన స్థాయిలో ఇసుక దొరకలేదు. ఫలితంగా చాలా మంది నిర్మాణాలు ఆపేసుకున్నారు. కాగా ప్రస్తుత కూట మి ప్రభుత్వం టన్ను ఇసుక రూ. 250 లోడింగ్ చార్జీతో అందుబాటులోకి రావడంతో మళ్లీ విని యోగదారుల్లో ఆనందం కనిపిస్తోంది. మొత్తంగా ఎగు మతి, దిగుమతి కూలీలతో కలిపి లారీ ఇసుక రూ. 10 వేల లోపుకే అందుబాటులోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వినియోగదారులందరికీ ఇసుక అందు బాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం, అధికా రులు కృషి చేస్తున్నారు. తొలుత స్టాక్ పాయింట్లలో వున్న వేలాది మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగదారులకు అందించ నున్నారు. వర్షాకాలం కావడంతో అందుబాటులో వున్న ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక సేకరించేందుకు సమ స్యలు న్నాయి. ఆ రీత్యా మూడు జిల్లాల్లో వర్షాకాలంలో కూడా అందుబాటులో వుండే ఇసుక రీచ్‌లపై అధికారులు కస రత్తు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రోజుకు 20 టన్నుల ఇసు క మాత్రమే అందించనున్నారు. కాగా తొలిరోజు సామా న్య వినియోగదారులకు ఎవరికీ ఇసుక అందలేదన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు ముందు వరుసలో ఉండడంతో సామాన్యులు వెనకబడి పోయారని, వారికి కూడా అందేలా చర్యలు తీసుకోవా లని వినియోగ దారులు కోరుతున్నారు.

**● ఆరు లక్షల మందికి ఉపాధి**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వున్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో వారంతా పనులు కోల్పోయారు. 2020లో కరోనా కష్టకాలంలో వారు నరకం చూశారు. ఆ తరువాత పనులు దొరుకుతాయని ఆశించినా పనులు దొరకలేదు. ప్రభు త్వం ఇసుక ధర పెంచడంతో మూడు జిల్లాల్లో నిర్మాణాలు ఎక్కడివక్కడ ఆగిపోయా యి. అమరావతి నిర్మాణం కూడా ఆగిపోవడంతో వారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయార యింది. పనుల కోసం కార్మిక అడ్డాల్లో వందలాది మంది కార్మికులు ఉదయం 6 గం టల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ వేచి చూసినా పనులు దొరకని దీన స్థితి ఏర్పడింది. వారం లో ఒక్కరోజు కూడా పని దొరకక పస్తులున్న ఘటనలు జిల్లాలో అనేకం కనిపిం చాయి. అనేకమంది కార్మికులు ఆత్మ హత్యలకు కూడా పాల్పడిన ఘటనలు చోటు చేసు కున్నాయి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐదేళ్ల క్రితం విరమించుకున్న పలు వురు తిరిగి నిర్మాణ పనులు చేప ట్టేందుకు సిద్ధమయ్యారు. తద్వారా నిర్మాణ రంగంలో కొత్త ఊపు కనిపిస్తోంది. తద్వారా కష్ట జీవులకు పని భద్రత లభించినట్లయింది. దీంతో వారి కళ్లలో ఆనందం కనిపిస్తోంది.



బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్టాక్ పాయింట్‌లో ఇసుకలోడింగ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ



● లింగాయపాలెం వద్ద ఇసుక నిల్వలు

## ఎలా తీసుకోవాలి

నిబంధనల ప్రకారం వినియోగదారుడు తన ఆధార్, మొబైల్ నెంబరు, అన్‌లోడింగ్ చిరునామా, వాహన నెంబరు వంటివి స్టాక్‌యార్డు సిబ్బందికి అందించాలి. అవన్ని నమోదు చేసిన తర్వాత విక్రయ రశీదు/ఇన్‌వాయిస్‌ని ఇస్తారు. డిశ్చాచ్ పర్మిట్లని సెక్యూర్డ్ స్టేషనరీలో జారీ చేయాల్సి ఉంటుంది. క్యూఆర్ కోడ్‌ని స్కానింగ్ చేసి నగదు చెల్లిస్తేనే అనుమతులు మంజూరు చేస్తారు. కాగా కొంతమంది లారీ యజమానులు/డ్రైవర్లు సోమవారం రీచ్‌ల వద్దకు ఎవరెవరివో ఆధార్ నెంబర్లు తీసుకొని ఇసుక లోడింగ్ చేయాలని వచ్చారు. ఒక్కో స్టాక్‌యార్డులో 100కు పైగా వాహనాలు బారులుదీరి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక విధానం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వినియోగదారుడు తప్పనిసరిగా స్టాక్‌యార్డు వద్దకు వచ్చి అన్ని వివరాలు అందజేసేలా నిబంధన పెట్టాల్సిన అవసరం ఉన్నది.

## రాష్ట్ర చరిత్రలోనే సువర్ణాధ్యాయం



మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, జూలై 8 : ఉచిత ఇసుకతో ప్రతి పేద వాడి ఇంటా పండుగ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారదర్శక విధానంతో నాణ్యమైన ఇసుక పంపిణీ టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన నెలలోపే ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకు రావడం జరిగిందన్నారు. ఉచిత ఇసుక విధానంతో సామాన్యులకు భారీ ఊరట లభించిందన్నారు. ఇసుక మాఫియాతో జగన్‌రెడ్డి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇసుక కుంభకోణం ద్వారా వైసీపీ నాయకులు సుమారు 50వేల కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. పేదలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల రూపాయలు అయితే అందులో 3లక్షల రూపాయలు ఇసుక కొనుగోలుకు ఖర్చు చేశారన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేశారన్నారు. కొత్తగా వచ్చిన ఇసుక పాలసీలో నిర్వహణ ఖర్చుల కోసం నామినల్‌గా ధరలు, రవాణా, లోడింగ్ చార్జీలు వసూలు చేస్తారన్నారు. లక్షల మంది భవన నిర్మాణ, అనుబంధ రంగాలకు ఊతమిచ్చేలా ఉచిత ఇసుక పథకం అమలు చేసిన సీఎం చంద్రబాబుకు మంత్రి గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

## నామమాత్రపు ధరకే ఇసుక

తెనాలి, జులై 8, (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానాన్ని కొత్త ప్రభుత్వం ప్రవేశ పెట్టటంతో నిన్నటి వరకు ఆకాశాన్ని అంటిన ఇసుక ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గతంలో 18 టన్నుల ఇసుక లారీలో 35 నుంచి 40 టన్నులకు పైగా ఇసుకను తరలించుకుపోయి టన్నుల లెక్కన ఒక్కో లారీ కృష్ణా తీర ప్రాంతాల్లోనే రూ. 15వేల నుంచి రూ. 25వేలకు అమ్మిన పరిస్థితి ఉంది. అప్పట్లో రీచ్‌లలో ఇసుక లోడ్ చేస్తే, టన్నుకు రూ. 475 మాత్రమే చెల్లించాలని ప్రభుత్వం రేటు నిర్ణయిస్తే, కాంట్రాక్టర్ సంస్థలు మాత్రం టన్నుకు రూ. 600 నుంచి రూ. 900 వరకు వసూలు చేసిన పరిస్థితి ఉంది. అయితే నూతన విధానంలో ఆయా జిల్లాల్లో ఇసుక రీచ్‌ల దూరం, డంపింగ్ యార్డుల నిల్వలను బట్టి జిల్లా కలెక్టర్‌లే రేటు నిర్ణయిస్తారు. గుంటూరు జిల్లాలో మాత్రం టన్నుకు పోత కూలి కింద రూ. 250 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. జిల్లాలో కొల్లిపర, మున్నంగి, గుండిమెడ, తాళ్లాయపాలెం, లింగాయపాలెం యార్డుల్లో ఎక్కడైనా టన్నుకు రూ. 250 చెల్లిస్తే చాలు. అంటే 18 టన్నుల లారీకి ఇప్పుడు కేవలం రూ. 4,500 మాత్రమే అవుతుంది. అయితే గతంలో రేట్ల ప్రకారం అయితే టన్ను రూ. 700 సగటు రేటనుకుంటే, 18 టన్నులకు రూ. 12,600 చెల్లించాల్సి వచ్చేది. ఇది కేవలం డిమాండ్ సూత్రం మేరకు మాత్రమే. కొన్నిచోట్లయితే రూ. 15వేలపైనే చెల్లించిన పరిస్థితి ఉంది. బాపట్ల జిల్లాలో అయితే బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని డంప్ దగ్గర టన్నుకు రూ. 551, వేటపాలెం మండలం నాయనిపల్లె డంప్ యార్డులో రూ. 675, మార్టూరులో 458గా ధర నిర్ణయించారు. కొరిశపాడు మండలం అనమనమూరు, కొల్లూరు మండలం జువ్వలపాలెం, అద్దంకి మండలం తిమ్మాయపాలెంలో టన్నుకు కేవలం రూ. 197 మాత్రమే చెల్లించాల్సుంది. అయితే గత రేట్లతో పోల్చితే ఇప్పుడున్న రేట్లు చాలా తక్కువ. బాపట్ల జిల్లాలో చాలాచోట్ల దూరం నుంచి ఇసుక తీసుకొచ్చి గతంలో డంప్ చేసిన పరిస్థితి ఉండటం, వినియోగదారుడు రీచ్‌లలో తెచ్చుకున్నా దీనికంటే భారీగానే రవాణా ఖర్చులు చెల్లించాల్సిరావటంతో, ఈ రేట్లు చాలావరకు మేలని, కేవలం కూలి ఖర్చులు మాత్రమే చెల్లించటం వల్ల ధరలో చాలా వెసులుబాటు లభించిందని వినియోగదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఇసుక రవాణా ఛార్జీల ఖరారు

- లారీ/ట్రాక్టర్ యజమానులు డీఎంజీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి
- నిర్ణీత ఛార్జీలకు మించి వసూలు చేస్తే కఠిన చర్యలు

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధా నంలో భాగంగా గుంటూరు జిల్లాలో రవాణ ఛార్జీలను అధికార యంత్రాంగం ఖరారు చేసింది. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు రవాణ శాఖ ఉప కమిషనర్ కరీం తన కార్యాల యంలో ఇసుక రవాణ చేసే లారీలు/ట్రాక్టర్ల యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విధానాన్ని వారికి తెలియజేసి సాధ్యమైనంత తక్కువ ఛార్జీలనే ప్రజల వద్ద వసూలు చేయాలని ఆదేశించారు. చర్చల అనంతరం ఆరు టైర్లు, 10 టైర్లు, 12 టైర్లు లారీలు, ట్రాక్టర్‌కు శ్లాబుల వారీగా ఛార్జీలను ఖరారు చేశారు. 60 కిలోమీటర్ల దూరం వరకు శ్లాబుల విధానం, ఆ తర్వాత నుంచి కిలోమీటర్‌కు రూ. 7.50 నుంచి రూ. 12 వరకు వాహనాన్ని బట్టి వసూలు చేసు కొనే అవకాశాన్ని కల్పించారు.

**15 కిలోమీటర్ల దూరం వరకు:**
● ఆరు టైర్ల లారీ(10 టన్నులు)కి రూ. 2 వేలు, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి రూ. 3 వేలు, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 4 వేలు, ట్రాక్టర్ (5 టన్నులు)కు రూ. 1,500 వసూలు చేసుకోవచ్చు.

**16 నుంచి 30 కిలోమీటర్ల దూరం వరకు:**
● ఆరు టైర్ల లారీ(10 టన్నులు)కి రూ. 3,500, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి రూ. 5 వేలు, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 6 వేలు, ట్రాక్టర్(5 టన్నులు)కు రూ. 2,400 వసూలు చేసుకోవచ్చు.

**31 నుంచి 45 కిలోమీటర్ల దూరం వరకు:**
● 31 నుంచి 45 కిలో మీటర్ల దూరం వరకు: ఆరు టైర్ల లారీ (10 టన్ను ల)కి రూ. 4,500, 10 టైర్ల లారీ (18 టన్నుల)కి రూ. 7,500, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 8 వేలు, ట్రాక్టర్ (5 టన్నులు)కు రూ. 3,000 వసూలు చేసుకోవచ్చు.

**46 నుంచి 60 కిలోమీటర్ల దూరం వరకు:**
● ఆరు టైర్ల లారీ(10 టన్నుల)కి రూ. 5,500, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి రూ. 8,500, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 10 వేలు, ట్రాక్టర్(5 టన్నులు)కు రూ. 3,500 వసూలు చేసుకోవచ్చు.

**60 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వరకు:**
● ఆరు టైర్ల లారీ (10 టన్నుల)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 9, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 7.50, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 7.50, ట్రాక్టర్(5 టన్నులు)కు టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కు రూ. 12 వసూలు చేసుకోవచ్చు.

### ★ లారీ ఇసుక రూ. 10వేలకే వస్తుంది



ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంతో లారీ ఇసుక రూ. 9 నుంచి 10 వేలకే వస్తుంది. గతంలో వేల రూపాయలు పెట్టిన దొరకని ఇసుక అందరికీ అందుబాటులోకి వస్తే పనులు సాగుతాయి. కార్మికులకు చేతినిండా పని వుంటుంది. తద్వారా ఆకలి, పస్తులు తప్పుతాయి.

- దీవెనరావు, సీఐటీయూ

### ★ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం హర్ష ణీయం. గత ప్రభుత్వంలో ఇసుక అందు బాటులో లేక, పనులు కోల్పోయి, కుటుంబాలు గడవక అనేక మంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. చీకటి రోజులు తిప్పికొడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మి కులకు వరంగా మారుతుంది.

- దండా లక్ష్మీనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

### ★ సామాన్యులకు అందుబాటులోకి తేవాలి



తొలిరోజు నాకు ఇసుక అందలేదు. పెద్ద పెద్ద కంపెనీలకే అందింది. దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. సామా న్య వినియోగదారులకు అందేలా చేయాలి. బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించాలి. బ్లాక్ మార్కెట్లో గోతం ఇసుక రూ. 150 అమ్ముతున్నారు. దాన్ని అరికట్టాలి.

- గోనె లూథర్‌పాల్, గుంటూరు సుందరయ్యనగర్ వాసి



● కొల్లిపర వద్ద ఇసుక లోడింగ్ కోసం బారులు తీరిన లారీలు

# రూ.18.88 కోట్ల ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు నిలిపివేత

- జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



పురుగుమందుల కంపెనీలలో తనిఖీలు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బృందాలు

గుంటూరు సిటీ, జూలై 8: జిల్లాలోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సంబంధిత కంపెనీలు, షాపులపై రాష్ట్రస్థాయి తనిఖీ బృందాల దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సోమవారం గుంటూరు అర్బన్‌తో పాటు, వట్టిచెరుకూరు మండలంలో దాడులు నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.18.88కోట్ల విలువైన పురుగు మందులు, ఎరువులు, బయోఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశామని తెలిపారు. అదేవిధంగా అనుమతి లేని రూ.12.44 లక్షల విలువైన పురుగుమందులు స్టాక్ చేసిన కారణంగా వాటిని జప్తు చేసినట్లు తెలిపారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని ఆయన తెలిపారు. దాడుల్లో ఏడీఏలు నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు శ్రీనివాసరెడ్డి, మాణిక్యరావు, ఏఓలు బీ గౌతమ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

- కలెక్టర్ జె.వెంకటమురళి
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 89 అర్జీలు
- గైర్హాజరైన అధికారులకు ఛార్జిమెమోలు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 8 : ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్ర మంలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 89మంది తమ సమస్యలను కలెక్టర్‌కు అర్జీలు ద్వారా వివరించారు. తన పరిధిలో వాటిని తక్షణమే పరిష్కరించి మిగిలిన వాటిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులో గా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు. నిర్లిప్తత ప్రదర్శిస్తే కుదరదన్నారు. చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నీటి పన్నులు ఖచ్చితంగా వసూళ్ళు చేయాలని ఆదేశించారు. కార్య క్రమానికి గైర్హాజరైన అధికారులకు చార్జి మెమోలు జారీ చేయాలన్నారు. డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

● బాపట్ల పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరు తూ బహుజనసమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరా వు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, తురిమెళ్ళ అమ్మేశ్వరరావులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఫిర్యాదు చేశారు.

● బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల దగ్గర నుంచి మార్కెట్‌యార్డు వరకు హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో అవకతవకలు జరిగాయని దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలంటూ దగ్గుమల్లివారిపాలెనకు చెందిన అమ్మేశ్వరరావు సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌ని వినతిపత్రం ద్వారా కోరారు.

# చేపల కోసం నీళ్లొదిలేశారు!



జముకులదిన్నెలో ఖాళీ అయిన చెరువు

దర్శి, జూలై 8 : చేపల పాటదారుల స్వార్థంతో గ్రామాల్లో నీటి ఇక్కట్లు తలెత్తుతున్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లోని చెరువుల్లో నిబంధనలకు వి రుద్ధంగా నీటిని బయటకు పంపి చేపలు పట్టుకుంటున్నారు. దీంతో అవి ఖాళీ అయి ఒట్టిపోతున్నాయి. చేపలు పట్టుకునేందుకు అడ్డగోలుగా నీరు వెళ్లబెట్టడంతో పశువులకు తాగునీరు లేక పోషకులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని రాజంపల్లి, జముకుల దిన్నె, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని చెరువుల్లో ఇప్పటికే నీటిని బయటకు పంపి చేపలు పడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. పాటదారుల నిర్వాకంతో చెరువుల్లో చుక్క నీరు లేకుండాపోతోంది. నిబంధనల ప్రకారం చెరువుల్లో నీరు అలాగే ఉంచి వలల ద్వారా చేపలు పట్టుకోవాల్సి ఉంది. త్వరగా పని పూర్తి చేసుకోవాలనే ఉద్దేశంతో పాటదారులు నీరు బయటకు పంపుతున్నారు. సంబంధిత అధికారులు ఈవిషయం గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వర్షాలు లేక చెరువుల్లో కొద్దిపాటి నీరు మాత్రమే ఉంది. ఉన్న నీటిని కూడా వెళ్లబెట్టడంతో పశుపోషకులు అల్లాడిపోతున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే తప్ప చెరువులకు నీరు చేరే అవకాశం లేదు. ఈనేపథ్యంలో అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

బల్లికురవ, జూలై 8 : మండలంలోని కొప్పెరపాలెం గ్రామానికి చెందిన గొర్రెపాటి ప్రశాంతిబాబు ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ఇద్దరిపై సోమవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొప్పెరపాలెంకు చెందిన గొర్రెపాటి ఆదాం, రత్తమ్మ భార్య భర్తలు వారు ఆదివారం ఘర్షణ పడుతుండగా వారి మధ్యలోకి వెళ్లి ప్రశాంతిబాబు ఘర్షణను అడ్డుకొన్నారు. దీనిపై ఆదాం ఒక్కసారిగా తన భార్యతో నేను మాట్లాడుతుంటే నీకు ఎందుకు అంటూ గొడవ పెట్టుకున్నాడు. అనంతరంవవ ఆదాం అయన కుమారుడు సంతోష్‌బాబు కలిసి కర్రతో ప్రశాంతిబాబుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఇరువురిపై స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మస్తాన్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

## ఇసుక ఇక్కట్లకు తెర

- ఉచిత విధానం అమల్లోకి తెచ్చిన కూటమి ప్రభుత్వం

ఒంగోలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ఇక్కట్లకు తెరపడింది. ప్రజలకు ఇసుకను ఉచితంగా అందజేయాలని సంకల్పించిన టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలలోపు దాన్ని అమల్లోకి తెచ్చింది. జరుగుమల్లి మండలం చతుకుపాడులో ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి ప్రారంభించారు. ఒంగోలు ఏఎంసీ ఆవరణలోని స్టాక్ పాయింట్ వద్ద ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ద న్‌లు ప్రారంభించారు. దీంతో నిర్మాణ రంగానికి భారీ ఊరట లభించింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేది. జిల్లాలో ఏప్రాంతంలోనైనా నాలుగు నుంచి 5 టన్నుల పరిమాణం ఉండే ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.వెయ్యికి దొరికేది.

### హామీని నెలలోపే అమలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోపే ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను ప్రారంభించింది. జిల్లాలో మూడు స్టాక్ పాయింట్లలో 42,834 టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. అందులో జరుగుమల్లి మండలం చతుకుపాడు-1 పాయింట్లో 16,044 టన్నులు, చతుకుపాడు-2 పాయింట్‌లో 24,972 టన్నులు, ఒంగోలులోని ఏఎంసీ ఆవరణలో 1,818 టన్నులు ఉంది. దానిని అందించే ప్రక్రియను ప్రారంభించారు. స్టాక్ పాయింట్లకు గతంలో నెల్లూరు నుంచి ఇసుక తెచ్చి నిల్వ ఉంచగా అక్కడ లోడింగ్, రవాణా, పన్నులు కలిపి టన్ను ధర రూ.247 నిర్ణయించారు. ఆ మేరకు చెల్లించిన వారికి ఒక్కొక్కరికి రోజుకు 20 టన్నులు అందించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం ట్రాక్టర్ ట్రక్కు ఇసుక (ఐదు టన్నులు) ప్రస్తుతం రూ.1235కే లభించనుంది. వైసీపీ ప్రభుత్వంలోని ధరలతో పోల్చితే ప్రస్తుత ధర కేవలం నాలుగో వంతే.

### మున్ముందు మరింతగా..

ప్రస్తుతం మూడు నిల్వ కేంద్రాల నుంచి ఉచిత ఇసుక సరఫరాను ప్రారంభించగా భవిష్యత్‌లో మరిన్ని ఏర్పాటు చేయనున్నారు. అందుబాటులో ఉంటే సమీప గ్రామాల ప్రజలు తమ అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకెళ్లే వెసులుబాటును కూడా ప్రభుత్వం కల్పించింది. అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడితే ట్రాక్టర్‌కు రూ.10 వేలు, లారీకి రూ.25 వేలు జరిమానా విధించనున్నారు. ఇసుక సరఫరా ప్రక్రియలో సెబ్, రెవెన్యూ, గనులు, ఇతర శాఖల అధికారుల నిఘా ఉండనుంది.

### వైసీపీ పాలనలో బంగారంగా మారిన ఇసుక

వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచేసింది. ప్రాంతాల వారీ తమకు అనుకూలమైన సంస్థలకు టెండర్లను కట్టబెట్టింది. టన్ను రూ.800పైగా ధరలు పెట్టడంతో ట్రాక్టర్ ఇసుక ధర రూ.4వేల నుంచి రూ.5 వేలు పలికింది. వాగులు, వంకలు, చిన్నపాటి నదుల పక్కన ఉన్న ప్రజలను సైతం వారి ఇళ్ల నిర్మాణాలకు కూడా ఇసుక తీసుకెళ్లనివ్వలేదు. మరోవైపు వైసీపీకి చెందిన నేతలు అక్రమంగా అనేక ప్రాంతాల్లో ఇసుక త్వకాలు చేసి కోట్లు గడించారు. ఇలా ఒకవైపు ప్రకృతి సంపద అయిన ఇసుకను అక్రమ తవ్వకం, మరోవైపు ప్రైవేటు సంస్థల పేరుతో ధరలు పెంచి ప్రజలనెత్తిన భారం మోపి దోపిడీ చేశారు. వైసీపీ కాలంలో ఇసుక బంగారమవడంతో సాధారణ, మధ్య తరగతి వర్గాల ప్రజలు గృహాలు, ఇతర నిర్మాణాల కోసం అధిక మొత్తాన్ని ఇసుక కోసం వెచ్చించాల్సి వచ్చింది. ఆ ప్రభావం నిర్మాణ రంగంపై పడి వేలాది భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు పనులు లేక అవస్థ పడ్డాయి. ఈ పరిస్థితిని గుర్తించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానం అమలులోకి తెస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించారు.

## అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

- 'మీకోసం'లో కలెక్టర్ తమీమ్ అన్సారియా

మార్కాపురం, జూలై 8: అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. మార్కాపురంలోని వేంకటేశ్వర దేవస్థాన కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీకోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ఈ దృష్ట్యా ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా పరిష్కారం కాని సమస్యలను వివరించాలన్నారు. మండల స్థాయి నుంచి పైస్థాయికి నివేదిక పంపి అది ఎక్కడ ఉందో తెలుసుకొని అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం, కనిగిరి సబ్ కలెక్టర్లు రాహుల్ మీనా, జాన్ ఇర్విన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా మీకోసం కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. 487 మంది తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు.



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

# వైసీపీ ఖాళీ!

- సైలెంట్‌గా ఆఫీసు మార్పు
- వైఎస్ జయంతి కార్యక్రమాలకు బాలినేని, కరణం డుమ్మా
- మమ అనిపించిన నేతలు
- కొత్త కార్యాలయం నిర్మించిన భూమి వివాదాస్పదం
- సీజ్ చేయకుండా కార్పొరేషన్ అధికారుల ఉదాసీనత

**అధికారాన్ని కోల్పోయిన వైసీపీ సైలెంట్‌గా పార్టీ జిల్లా కార్యాలయాన్ని మార్చింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కొత్త కార్యాలయంలోకి సామగ్రిని తరలించింది. పాత కార్యాలయాన్ని స్థల యజమాని ఖాళీ చేయించగా కొత్త ఆఫీసు భవన నిర్మాణం వివాదాస్పదమవడంతో అక్కడ కూడా కార్యక్రమాలు చేపట్టలేని పరిస్థితి ఆపార్టీకి ఎదురైంది. చివరకు దివంగత రాజశేఖరెడ్డి జయంతిని కూడా నిర్వహించలేక పోయారు. కాగా సోమవారం వైఎస్ జయంతి కార్యక్రమాలు జిల్లాలో తూతూ మంత్రంగా నిర్వహించారు. ఆపార్టీ సీనియర్ నాయకులు బాలినేని శ్రీనివాసులరెడ్డి, కరణం బలరాంతోపాటు కింది స్థాయిలో ముఖ్యనేతలు కూడా గైర్హాజరయ్యారు. కొన్నిచోట్ల నాయకులు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఒంగోలులో మేయర్‌తోపాటు వైసీపీ కార్పొరేటర్‌లు అంతా కార్యక్రమానికి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది.**

ఆంధ్రజ్యోతి, ఒంగోలు



వివాదంలో వైసీపీ కొత్త కార్యాలయం

రాష్ట్రంలో అధికారంలో ఉండగా వైసీపీ అన్ని జిల్లా కేంద్రాల్లో ప్యాలెస్‌ల లాంటి పార్టీ కార్యాలయాలను నిర్మించింది. అందులో భాగంగా ఒంగోలులో కూడా కార్యాలయం ఏర్పాటుచేసింది. తిరిగి అధికారంలోకి వస్తే ఘనంగా ప్రారంభించాలని ఆపార్టీ నేతలు భావించారు. అయితే అధికారాన్ని కోల్పోవడంతో కార్యాలయ నిర్మాణంలో ఉన్న లోసుగులు కూడా బయటపడ్డాయి. దీనికితోడు గత ఏడెనిమిది సంవత్సరాల నుంచి ఆపార్టీ కార్యాలయం నడుస్తున్న భవనాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆప్పట్లో మాజీ మంత్రి బాలినేని సన్నిహితుడు పార్టీ కార్యాలయానికి స్థలం ఇచ్చారు. రెండేళ్ల నుంచి ఆయన ఖాళీ చేయాలని కోరుతున్నా అధికారంలో ఉండటంతో ఏమీ చేయలేకపోయారు. వైసీపీ అధికారాన్ని కోల్పోగానే ఆయన ఒత్తిడి పెంచారు. దీంతో పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జంకె వెంటకరెడ్డి గుట్టుచప్పుడు కాకుండా ఆపార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేశారు. సామగ్రిని కూడా వివాదాస్పదంగా ఉన్న కొత్త పార్టీ కార్యాలయంలోకి మార్చేశారు. అక్కడ సోమవారం వైఎస్ జయంతి వేడుకల నిర్వహణకు పిలుపునిచ్చారు. అయితే కొత్త భవనం నిర్మించిన భూమి విషయమై వివాదం నెలకొని ఈ కేసు హైకోర్టుకు చేరింది. ఈనేపథ్యంలో అక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని పోలీసులు వైసీపీ నేతలకు సమాచారం ఇచ్చారు. ముందస్తు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటుచేశారు. దీంతో వైసీపీ నేతలు కార్యక్రమాన్ని అక్కడి నుంచి మార్చుకున్నారు. అలాగే వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి కార్పొరేషన్ నుంచి తీసుకోవాల్సిన అనుమతులు తీసుకోలేదు. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు సీజ్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.



వైఎస్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జంకె వెంకటరెడ్డి తదితరులు

### ఇలా వచ్చి అలా వెళ్లారు..

వైఎస్ జయంతి కార్యక్రమాలను అన్నిచోట్లా ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు, ఇతరత్రా ముఖ్య నాయకులు హాజరుకావాలని వైసీపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశించింది. అయితే కీలకనేత బాలినేని శ్రీనివాసుల రెడ్డి గైర్హాజరయ్యారు. అదేసమయంలో కార్పొరేషన్ మేయర్, వైసీపీ కౌన్సిలర్లు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. కనిగిరిలో ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నారాయణయాదవ్ తన మద్దతుదారులతో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మద్దతుదారులతో తన గృహంలో కార్యక్రమం నిర్వహించారు. చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం మినహా మిగిలిన నియోజకవర్గాల్లో గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓడిపోయిన వారంతా జయంతి కార్యక్రమాలా ఇలా వచ్చి అలా వైఎస్ విగ్రహాలకు దండలు వేసి వెళ్లి పోవడం కనిపించింది.

# పూనూరులో ఘర్షణ.. పలువురికి గాయాలు



పూనూరులో చర్చి వద్ద పోలీసుల పికెట్

యద్దనపూడి, (మార్టూరు) జూలై 8: యద్దనపూడి మండలం పూనూరు ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి రెండువర్గాలు మధ్య గొడవ జరిగింది. ఇరు గ్రూపులకు చెందిన వ్యక్తులు గాయపడ్డారు. ఒకే సామాజిక వర్గంవారు సమావేశమై మాట్లాడుకుంటున్న సమయంలో మాటామాటా పెరిగి అదికాస్తా రాళ్లదాడి చేసుకునే స్థాయికి వెళ్లింది. గాయపడిన రెండు గ్రూపులకు చెందిన వ్యక్తులు చిలకలూరిపేట, చీరాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఈ కాలనీలో ఆదివారం అర్థరాత్రి నుంచి పోలీస్ పికెట్ కొనసాగుతున్నది.

### వివాదానికి కారణం ఇదే..

ఎస్సీ కాలనీలో ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ చర్చి ఉంది. ఈ చర్చిలో పాస్టర్ బోధనలు చేస్తుంటారు. చర్చికి కూతవేటు దూరంలో ఉన్న పాస్టర్ ఉంటున్న ఇల్లు శిథిలావస్థలో ఉంది. దానిని తొలగించి నూతనంగా ఇంటిని నిర్మించాలని చిన్న కాలనీ వారు నిర్ణయించారు. ఆ స్థలం ఈ కాలనీ పరిధిలోనే ఉంది. చర్చికి అతి సమీపంలో మరో ప్రదేశంలో ఇంటిని నిర్మించాలని పెద్ద కాలనీవారు పట్టుబట్టారు. ఇదే విషయమై మాట్లాడుతుండగా భిన్నాభిప్రాయాలు తలెత్తి గొడవకు దారితీసింది. కుర్చీలు గాల్లోకి లేచాయి. ఒకరిపై మరొకరు రాళ్ల దాడి చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ జీవీఎస్ చౌదరి, పర్చూరు ఎస్ఐ ఎస్.రమేష్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చారు. గొడవకు పాల్పడుతున్న వారిని తరిమేశారు. గాయపడిన వారిని చీరాల, మార్టూరు, చిలకలూరిపేటకు త రలించారు. అందరితో మాట్లాడి ప్రశాంతవాతావరణాన్ని తీసుకొచ్చామని, ఇంతవరకు ఎవరిపై కేసులు నమోదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

ఇదిలావుండగా గురువారం చర్చి వార్షికోత్సవం జరుగనుంది. ఈ క్రమంలో జరిగిన గొడవల కారణంగా కార్యక్రమంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు పహారాలో వార్షికోత్సవం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎన్‌ఆర్‌ఐల ద్వారా పాఠశాలల అభివృద్ధి

- టీడీపీ నాయకుడు డాక్టర్ లలిత్ సాగర్
- 20 మంది పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు పంపిణీ
- దాత వెంకట్‌ను అభినందించిన ఉపాధ్యాయులు

ముండ్లమూరు, జూలై 8: ఎన్‌ఆర్‌ఐల సహకారంతో పాఠశాలలు, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. ఇందుకు తానాలో రైతుల అసోసియేషన్ చైర్మన్ జిల్లెలమూడి వెంకట్ నిదర్శనమని కొనియాడారు. సోమవారం ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదివిన పేద విద్యార్థులతో పాటు మెరిట్ సాధించిన 14 మంది అద్దంకి, తెలంగాణ లోని మిర్యాలగూడెం ప్రాంతానికి చెందిన విద్యార్థులకు రూ.10 లక్షలు విలువ చేసే ల్యాప్ టాప్‌లు డాక్టర్ లలిత్‌సాగర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభకు పాఠశాల ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరరావు అధ్యక్షత వహించారు.



పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, పక్కన దాత, ఎన్‌ఆర్‌ఐ వెంకట్

ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ లలిత్‌సాగర్ మాట్లాడుతూ ఉత్తర అమెరికా సంఘం వారి సౌజన్యంతో పేద విద్యార్థులకు ల్యాప్ టాప్‌ల పంపిణీకి దాతైన మండలంలోని ఉల్లగల్లు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ జిల్లెలమూడి వెంకట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తాను పుట్టి పెరిగిన గ్రామంతో పాటు మండలాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన ప్రతిఒక్కరికి కలగాలన్నారు. ఇప్పటివరకు వెంకట్ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం శుభపరిణామమన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎప్పుడూ ఎన్‌ఆర్‌ఐలను ప్రోత్సహిస్తుందన్నారు. మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యల్లో ప్రధానంగా విద్యార్థుల కోసం బస్సు షెల్టర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. మంత్రి స్వామితో మాట్లాడి హాస్టల్‌కు భవనం ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తామన్నారు.





వెంకట్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరరావు, ఉపాధ్యాయులు, లలిత్ సాగర్

దాత, ఎన్‌ఆర్‌ఐ జిల్లెలమూడి వెంకట్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామంతో పాటు మండలంలోని గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం రేకుల షెడ్డుకు ఎంత ఖర్చు అయినా నిర్మిస్తామన్నారు. అనంతరం తెలంగాణరాష్ట్రం మిర్యాలగూడెం మండలం యాదగిరిపల్లికి చెందిన తల్లిదండ్రులు లేని పేద విద్యార్థి కుంచం శివ ఇటీవల జేఈఈ ఆల్ ఇండియా 211వ ర్యాంకు సాధించటంతో ఆ విద్యార్థికి లక్ష రూపాయల నగదు, ల్యాప్ టాప్ అందజేశారు. అలాగే, కుట్టుమిషన్లు, రైతులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేస్తానని వెంకట్ చెప్పారు. అనంతరం వెంకట్ తల్లిదండ్రులు తిరుపతయ్య, గోవిందమ్మను సన్మానించారు.

కార్యక్రమంలో వెంకట్ సోదరుడు రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు రాముడు, తిరుమలరావు, తానా ప్రతినిధి బండి నాగేశ్వరరావు, నారారాయణ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ జోసిరెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరరావు, మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, కామని పూర్ణచంద్రరరావు, రెడ్డిమాసు రాఘవులు, కొండవీటి బాలయ్య, మందలపు శేషయ్య, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

# మాయమాటలతో నగదు మాయం

- లండన్ నుంచి ఐఫోన్, బంగారు వస్తువులు పంపిస్తానని మోసం
- బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.2.20లక్షలు మాయం
- కేసు నమోదు చేసిన బల్లికురవ పోలీసులు

బల్లికురవ. జూలై 8: కొత్త నెంబరు నుంచి హిందీలో ఫోను చేసిన ఒక వ్యక్తి మాయ మాటలు చెప్పి నేను అనాథనని, మీకు లండన్ నుంచి ఐఫోన్, బంగారు వస్తువులు పంపిస్తున్నానని చెప్పి రెండులక్షల పైబడి నగదుతో మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి చెందిన ముస్లిం మహిళ షేక్ షర్మిలకు ఈనెల ఒకటో తేదీన ప్లస్ 447478663404 నెంబరు నుంచి అజ్ఞాత వ్యక్తి ఫోను చేసి హిందీలో మాట్లాడాడు. అమె కూడా హిందీలో మాటలు కలపగా తాను లండన్‌లో ఉంటానని తాను అనాథనని, నీతో మాట్లాడుతుంటే నీవు నా చెల్లెలు లా ఉన్నావని నీకు ఐ ఫోను బంగారు వస్తువులు పంపుతానని వాటిని వాట్సాప్‌లో ఫొటో పెట్టాడు. మాయమాటలు నమ్మిన మహిళ తన అడ్రస్సు పంపింది. రెండో తేదీన మరలా మహిళకు 7989881161 నెంబరు నుంచి మరో వ్యక్తి ఫోను చేసి మీకు లండన్ నుంచి పార్శిల్ వచ్చిందని, ముంబయి ఎయిర్‌పోర్టులో ఉందని రూ.25000 పంపిస్తే వెంటనే పంపిస్తానని తన నెంబరుకు పంపాలని చెప్పగా వెంటనే అమె పంపింది. మరలా వెంటనే మరో వ్యక్తి ఫోన్ చేసి మీకు వచ్చిన పార్శిల్‌లో ఇన్‌కంట్యాక్స్ అధికారులు పట్టుకున్నారని వెంటనే మీరు రూ.1,45,000 పంపాలని లేకుంటే లక్షలు విలువచేసే వస్తువులు మీకు రావని చెప్పి, వచ్చిన వస్తువులను వీడియో కాల్ ద్వారా చూపించారు. వెంటనే కొణిదెన స్టేట్ బ్యాంక్ అకౌంట్ నెంబరు నుంచి వారు చెప్పిన నెంబరుకు నగదు పంపింది. వెంటనే మరుసటి రోజు మరలా బ్యాంక్ అకౌంట్ నుంచి రెండు విడతలుగా రూ.65 వేలు వరకు వేరే నెంబరుకు నగదు జమ అయింది. బ్యాంకు కాల్ సెంటర్ నుంచి అ యువతికి మీరు ఎవరికి ఓటీపీలు చెప్పకండి మీ ఎకౌంట్ నుంచి నగదు డ్రా అవుతుందని చెప్పగా వెంటనే తాను మోసపోయానని గ్రహించిన మహిళ 6వతేదీన బల్లికురవ పోలీసు స్టేషన్‌లో తన వద్ద ఉన్న ఫోను నెంబర్ల ఆధారాలు చూపి, రూ. 2.20 లక్షల నగదు కాజేశారని ఫిర్యాదు చేశారు. సైబర్ నేరం కింద ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కొండయ్య

## టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 8 : పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వీరంతా ఇటీవల కొండయ్యకు మద్దతు తెలపగా టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీలో చేరారు. కొండయ్య వారి మెడలో టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ పురపాలన పారదర్శకంగా సాగాలన్నారు. అందుకు ఎప్పటికప్పుడు పరస్పరం చర్చించుకుంటూ ముందుకు సాగుదామన్నారు. తమ వార్డుల్లో సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందించాలని నూతనంగా పార్టీలో చేరిన కౌన్సిలర్లు కొండయ్యను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యానాదిరావు, ఎంద్రపాటి కెజియ, షాహిద్, నాగలక్ష్మి, సత్యానందం,సుజాత, శోభనరెడ్డి, శిరీష పాల్గొన్నారు.

# ఎండిపోయిన మంచినీటి చెరువులు..!


నీళ్లు లేక ఎండిపోయిన యద్దనపూడి మంచినీటి చెరువు ... రెండో చెరువులో నీటికుంటలో చేపలు పడుతున్న చిన్నారులు

» యద్దనపూడిలో పొంచి ఉన్న ముప్పు
» తాగునీటికి ప్రజల ఇక్కట్లు

యద్దనపూడి, (మార్టూరు) జూలై 8 : మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామంలో తాగునీటి సమస్య పొంచి ఉన్నది. గ్రామానికి ప్రధాన తాగునీటి వనరైన గ్రామం నడిబొడ్డున ఉన్న రెండు మంచినీటి చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. దాంతో గ్రామంలో ఇపుడి పుడే తాగునీటికి సమస్యలు మొదలయ్యాయి. వాస్త వంగా గత 20 రోజుల నుంచి గ్రామంలో చెరువులో నీళ్లలేక కొళాయిల ద్వారా సరఫరా కావడం లేదు. అయితే తాగునీటి సమస్య ఏర్పడకుండా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒక చెరువులో పెద్ద లోతైన గుంతను ఏర్పాటుచేసి దాని నుండి నీటిని పైపుల ద్వారా పంప్‌హౌస్‌కు అనంతరం ఓవ ర్‌హెడ్ ట్యాంకు కు అధికారులు పంపింగ్ చేస్తున్నారు. అంతే గాకుండా చెరువుకట్టపై 300 అడుగులకు పైగానే ఒక బోరును ఏర్పాటుచేసి దానికి మోటారును ఏర్పాటు చేసి నీటిని మోటార్లుద్వారా పంపుహౌస్‌కు మళ్లిస్తున్నా రు.కాని ఆశించినంతంగా ప్రజలకు తాగునీరు అందడంలేదని గ్రామస్థులు చెప్తున్నారు. తద్వారా ప్రజానీకం త్రాగునీటికి అధికంగా మంచినీటి ఆర్‌వో ప్లాంటులపైనే ఆధారపడుతున్నారు.

**గురుకుల పాఠశాలకు ట్యాంకర్ల ద్వారా**

రెండు మంచినీటి చెరువులలో నీళ్లు లేకపోవడంతో గ్రామంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు తాగడానికి మంచినీటి సమస్య ఎదుర యింది. చెరువులలో నీరు ఉన్నపుడు మోటార్ల ద్వారా గురుకుల పాఠ శాలలోకి మంచినీటిని సరఫరా చేసే వారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు కనీస అవసరా లకు ఉపయోగించేందుకు స్కూల్లో ఉన్న బోరు నీటిని వినియోగిస్తున్నారు. కాని ప్రస్తుతం చెరువులో నీళ్ల లేకపోవడంతో తాగునీటి కోసం విద్యార్థినులు ఇబ్బం దులు పడకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గ్రామంలోని పార్టీ నాయకులకు సూచ నలు చేశారు. దాంతో గ్రామంలోని అధికార పార్టీనే తలు గన్నవరం నుండి తాగునీటిని ట్యాంకర్లు ద్వారా స్కూలుకు సరఫరా చేస్తున్నారు. రెండు రోజులకు ఒక ట్యాంకరును స్కూలుకు సరఫరా చేస్తున్నారు. దాంతో ప్రస్తుతానికి తాత్కాలికంగా గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మంచినీటి సమస్య ఇబ్బంది తొలగింది.

**సాగర్ జలాలు వచ్చేదెప్పుడు..?**

గత మూడు నెలలు క్రితం సాగర్ జలాలను విడు దల చేసినపుడు ఈ జలాలు యద్దనపూడి చెరువులకు చేరలేదు. ఈ సమయంలో నీళ్లు తక్కువగా రావడం అదికూడా కొద్దిరోజులు మాత్రమే నీళ్లు రావడం అంతే గాకుండా కోనంకి సబ్ డివిజన్‌లో దిగువ గ్రామాలకు పూర్తి స్థాయిలో నీళ్లు రాకపోవడంతో యద్దనపూడి మండలంలోని చాలా గ్రామాలకు సక్రమంగా సాగర్ జలాలు చేరలేదు. ఈ నేపథ్యంలో యద్దనపూడి చెరు వులకు నీళ్లు రాకపోవడంతో చెరువులు పూర్తిగా ఎండి పోయాయి. మరల సాగర్ జలాలు వస్తేనే తప్ప లేదా భారీ స్థాయిలోనైనా వర్షాలు కురిస్తేనే గాని చెరువులు నిండే అవకాశం లేదు. మరి సాగర్ జలాలును అధికా రులు ఎపుడు విడుదల చేస్తారా అని గ్రామస్థులు ఆశ గా ఎదురుచూస్తున్నారు. ఇదిలావుండగా ఒక చెరు వులో ఉన్న చిన్న నీటి కుంటలో మాత్రం చిన్నారులు చేపల కోసం వెదుకులాడుతున్నారు.


బస్టాండ్ ఇన్‌గేట్‌లో నిలిచిన వర్షపు నీరు

## చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్టాండ్

అద్దంకి, జూలై 8 : చిన్నపాటి వర్షం పడ్డా అద్దంకి లోని ఆర్టీసీ బస్టాండ్ చిన్నపాటి చెరువు ను తలపించేలా మారు తుంది. ఆది, సోమ వారం లలో కురిసిన వర్షాలకు ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ లో పెద్ద ఎత్తున నీరు నిలిచాయి. వర్షపు నీరు సైడ్ డ్రైన్ లోకి వెళ్ళేందుకు సరైన మార్గం లేకపోవటం తో ఎక్కడిక్కడ నిలిచి బస్సుల తో పాటు ప్రయాణికుల రాక పోకలకు ఇబ్బంది గా మారింది. తరచూ నీరు నిలిచి రోడ్డు గోతుల మయంగా మారుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టిం చుకున్న దాఖలాలు ఉండటం లేదని పలువురు విమర్శిస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్ లో నీరు నిలువ కుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరు తున్నారు.

## శివాలయం భూముల కౌలు వేలం

అద్దంకి, జూలై 8 : అద్దంకి పట్టణంలోని పాత శివాలయం (రామలింగేశ్వరస్వామి) దేవాలయం భూముల కౌలు వేలం సోమవారం దేవాలయ ఆవరణలో జరిగింది. అద్దంకి రెవెన్యూ పరిధిలో విప్పర్లవారిపాలెం, నాగులపాడు గ్రామాల సమీపంలో ఉన్న 21.06 ఎకరాల దేవాలయం భూమికి కౌలు వేలం నిర్వహించగా 3,21,600 రూపాయలు పలికింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర కుమార్, ట్రస్టీ చిన్ని రామలింగేశ్వరరావు, గుంటూరు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

## విదేశీ విద్య పథకం పునఃప్రారంభం హర్షణీయం

**ఎమ్మెల్యే కొండయ్య**

చీరాల, జూలై 8 : ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం కింద రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించే ప్రక్రియను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించడం హర్షణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ముక్కోణపు పార్కు సెంటర్లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం పార్టీ శ్రేణులతో కలసి పాలాభిషేకం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన సాగిస్తూ ముందడుగు వేస్తున్నారన్నారు. విద్యాభివృద్ధికి అందిస్తున్న చేయూ తను అర్హులు వినియోగించుకోవాలని కొండయ్య కోరారు. కార్యక్రమంలో నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించండి**

నియోజకవకర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకుగాను రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కొండయ్య అధికారులకు చెప్పారు. పార్టీ కార్యాలయంలో సోమవారం పంచా యతీరాజ్‌శాఖ డీఈఈ శేషయ్య, ఆర్అండ్‌బీ డీఈ నరసింహులు, చీరాల, వేటపాలెం మండలాల ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేయిం చండి. కాంట్రాక్టర్లుకు బిల్లులు మంజూరు చేయండి. అంతకుముందు నాణ్యత ప్రమాణాలను పక్కాగా పరీక్షించండి. నాణ్యతలో ఎక్కడ రాజీపడొద్దని స్పష్టం చేశారు. పనులకు సంబంధించిన నివేదికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని చెప్పారు. పలు సూచనలు చేశారు. అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయండి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతులు

పంగులూరు, జూలై 8 : మండలంలో చోరీ జరిగిన ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. చోరీ జరిగిన ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని పంగులూరు విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రైతుసంఘం ఆధ్వ ర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్‌లకు దొంగల బెడద ఎక్కువైందన్నారు. పోయిన చోట ఏర్పాటు చేయడంలో విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వ్యవసాయ సీజన్ దృష్ట్యా తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కృష్ణమూర్తి, మల్లారెడ్డి, ఆదంసాహెబ్, హనుమంతరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## రేపు జాతీయ కోర్కెల దినోత్సవం

చినగంజాం, జూలై 8 : జాతీయ కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయా లని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ కార్మికులకు పిలుపుని చ్చారు. చినగంజాంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు జి.యాకోబు అధ్య తన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10వ తేదీన జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాల యాల వద్ద, మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జీవి.రాంప్రసాద్‌రెడ్డి, డి.రాఘవులు, సీహెచ్.శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

## చదువుకు ఆర్థిక సాయం

పంగులూరు, జూలై 8 : గుజరాత్ రాష్ట్రంలో ఇంజనీరింగ్ రెండవ సంవ త్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థుల వసతి ఖర్చులకు రామకూరు చారిట బుల్ ట్రస్ట్ వారు 10వేల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కల్లంవా రిపాలెం గ్రామానికి చెందిన భవనం అభిరామిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి సవాని వర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. వారి చదువుకు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి జోర్ల ఆంజనేయవర ప్రసాద్ సోమవారం సాయం అందిం చారు. కార్యక్ర మంలో ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌ఐ మృతికి కారుకులపై చర్యలు తీసుకోవాలి

చీరాలటౌన్, జూలై 8 : తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలో విధుల్లో ఉన్న దళిత ఎస్‌ఐ ఆత్మహత్యకు పాల్పడడం విషాదకరమని పలువురు దళిత బహు జన పార్టీ ప్రతినిధులు అన్నారు. ఎస్సై మృతిపై సోమవారం స్థానిక తహసీ ల్దార్ కార్యాలయం వద్ద వారు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ ఎస్సై శ్రీనివాసరావును ఉన్నతాధికారులతో పాటు కింది స్థాయి ఉద్యో గులు ఏకమై కులం పేరుతో దూషించి అవమానాలకు గురిచేసినట్లు ఆరోపిం చారు. ఈక్రమంలో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై విచా రణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ నాసరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు జిలానీ, మిక్కిలి లావణ్య, రబ్బానీ, బాషా, శ్రీను పాల్గొన్నారు.

## ఆవరణల్లో మందుబాబుల ఆగడాలు

ఇంకొల్లు, జూలై 8 : ఇంకొల్లు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మందు బాబుల ఆగడాలు పెరిగిపోయాయి. కార్యాలయాలకు ప్రహరీగోడలు లేకపోవ డంతో రాత్రి వేళల్లో మద్యం సేవించేందుకు ఆ ప్రాంతాలు అనువుగా ఉండ టంతో రాత్రి వేళల మందుబాబులు అక్కడకు చేరి వారి తాగి ఆగడాలు సాగి స్తున్నారు. కార్యాలయాల ఆవరణల్లో లైట్లు సక్రమంగా వెలగకపోవడం, దీనిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారికి అడ్డూఅదుపు లేకుండా పోతుంది. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ప్రధానవాకిలి ముందు మద్యం కాళీ సీసాలు, వాటర్ బాటిళ్లు సిబ్బంది వచ్చి తలుపులు తీసే సమయానికి దర్శ నమిచ్చాయి. చివరికి తాగిన మద్యం సీసాలు, వాటర్‌బాటిల్స్ సైతం అక్కడే వదిలేసి వెళ్తున్నారు. అధికారులు పట్టించుకొని రాత్రి వేళల్లో వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.

## వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, జూలై 8 : విజయనగర్ కాలనీలో వెంకయ్య ఆశ్రమంలో సోమ వారం రోటరీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. రొటేరియన్లలో చెరుకూరి అంజిబాబు కుమారుడు సందీప్ జ్ఞాపకార్థం వృద్ధులు, పేదలకు అన్నదానం చేశారు. అనంతరం వారికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దుమాల కోటేశ్వరరావు మాదాల సాంబ శివరావు, కొర్రపాటికాజారావు, ఇంటూరి ఆంజ నేయులు షేక్ కాజా హుస్సేన్ పాల్గొన్నారు.



ఆశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న రోటరీ సభ్యులు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ అమ్మవారు

## ఘనంగా గంగమ్మ గ్రామోత్సవం

చినగంజాం, జూలై 8 : మండలంలోని కడవకుదురు గ్రామంలో గంగమ్మ అమ్మ వారి కొలువుల కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గంగమ్మ అమ్మవారి కొలు వుల కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారికి పలు కార్యక్రమాలు నిర్వహిం చారు. ఆలయ పూజారి హైమారావు ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. సోమవారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారి ప్రభను ఉంచి గ్రామంలోని పురవీధులలో మేళతాళాలు, కనకతప్పెట్లు, బాణసంచా, యువకుల నృత్యాల నడుమ గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. మంగళవారం అమ్మవారికి పొంగళ్లను సమర్పించి కొలువుల కార్యక్రమా లను ముగిస్తున్నట్లు ఆలయ పూజారి తెలిపారు. యాదవ పెద్దల ఆధ్వర్యంలో జరి గిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు జరిపారు.

## గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు


ప్రచారం నిర్వహిస్తున్న ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు

పంగులూరు, జూలై 8 : ఆది మధ్యాంత రహితుడైన పరమాత్మ భూమిపై జన్మిస్తే ఆయనను గురువు అని అంటామని, గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణభగవానుడని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు మడియం పెద్దరెడ్డి అన్నారు. ఈ నెల 21న వచ్చే గురుపౌర్ణమిని పురస్కరించుకుని పంగు లూరు, కోటపాడు, జనకవరం గ్రామాలలో నరసరావుపేటకు చెందిన ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు ఎలిశెట్టి రమేష్, కాటం పోతు రాజు, చల్లగుండ్ల భాస్కరరావు, పగడాల రామయ్య, కుంచాల చినవెంకయ్య, వెంకటే శ్వర్లు, పగడాల అశోక్, అమరలింగయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

## అందుబాటులోకి ఉచిత ఇసుక

» నెరవేరనున్న పేదల సొంతింటి కల
» ఊపందుకోనున్న నిర్మాణ రంగం
» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, జూలై 8 : రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చిందని, పేద మధ్య తరగతి ప్రజలకు ఇసుక కష్టాలు తీరనున్నాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజ లకు ఇసుక అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా మార్గదర్శకాలను విడుదల చేసింద న్నారు. ఏపీ ప్రభుత్వం ఇసుక విధానాన్ని తీరుసుకురావడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ విధానంతో నిరుపేద మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట లభిం చిందన్నారు. వైసీపీ పాలనలో తప్పుడు విధానాల వల్ల నిర్మాణ రంగం కుదేలైంద న్నారు. పేదల సొంతింటి కల మధ్యలోనే నిలిచిపోయిందన్నారు. ఐదేళ్లు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఫ్రీ శాండ్ పాలసీని అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయడం బడుగు, బలహీన వార్గల అభ్యున్నతికి రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురా వడమే చంద్రబాబు ప్రభుత్వం లక్ష్యం అన్నారు. జగన్‌రెడ్డి ఇసుక మాఫియాను నడి పారని ఏలూరి అన్నారు. ఒక్క ఇసుక కుంభకోణం ద్వారా 50వేల కోట్లకు పైగా కొల్ల గొట్టారని ఆరోపించారు. వైసీపీ నేతలే నేరుగా ఇసుకాసురులుగా అవతారం ఎత్తి కోట్లు స్వాహా చేశారని మండిపడ్డారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఖర్చు అయితే అందులో ఇసుకకే రూ.3లక్షలు ఖర్చు చేయాల్సిన దుస్థితి వైసీపీ పాలనలో నెలకుందన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసు కను జగన్ అండ్ కో మింగేశారన్నారు. ప్రజా ప్రభుత్వ నిర్ణయంతో ప్రజల కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి అన్నారు.

## గంగవరం రోడ్డు అభివృద్ధితో మేలు

ఇంకొల్లు, జూలై 8 : ఇంకొల్లు నుంచి గంగవరం మీదుగా పంగులూరు వరకు ఉన్న ఆర్ అండ్‌బీ రహదారిని రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసే ఇంకొల్లు ప్రాంత ప్రజలకు జాతీయ రహదారికి చేరుకునేందు రవాణా సౌకర్యవంతంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య అన్నారు. సోమవారం ఆయన ఇంకొల్లు వచ్చిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని, అభివృద్ధి కార్యా క్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారని గరటయ్య చెప్పారు.

## వెంకటేశ్వర్లుకు నివాళి

ఇంకొల్లు, జూలై 8 : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి తొలి అధ్యక్షుడిగా పని చేసిన మండలంలోని గొల్లపాలెం శివారు గ్రామానికి చెందిన చెల్లపల్లి వెంకటే శ్వర్లుకు పలువురు నివాళులర్పించారు. గొల్లపాలెంలో ఆయన దశదిన కర్మ పాల్గొన్నవారు వెంకటేశ్వర్లు చేసిన సేవలను గుర్తుచేశారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభం


రశీదును అందిస్తున్న తహసీల్దార్ సంధ్యశ్రీ

అద్దంకి, జూలై 8 : ఉచిత ఇసుక సరఫరా పథకాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. మండలంలోని తిమ్మాయపాలెం వద్ద గుండ్ల కమ్మ నది ఇసుక స్టాక్ పాయింట్ నుంచి అం దజేస్తున్నట్లు ఆర్‌ఐ శంకర్ తెలిపారు. టన్ను ఇసుక రూ.197 చొప్పున ఒక్కొక్కరికీ 20 టన్నుల ఇసుక ఇవ్వటం జరుగుతుందన్నారు. తిమ్మాయపాలెం డంపింగ్ పాయింట్ వద్ద 5,100 టన్నుల ఇసుక అందుబాటులో ఉంద న్నారు. ఇసుక అవసరమైన వ్యక్తులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకు రావాలని తెలిపారు.

మార్టూరు : మార్టూరులో ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభ మైంది. స్థానికంగా పాల కేంద్రంవద్ద ఇసుక రీచ్ నుంచి ఇసుకను ఉచితంగా పంపిణీ చేయ డానికి మైనింగ్ రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. ఇసుకకు అధికారులు ఎలాంటి సొ మ్ములు వసూలు చేయకుండా కేవలం సీనరేజీ తదితర టాక్సులు నిమిత్తం టన్నుకు రూ.458 ధరను నిర్ణయించారు. దాంతో మార్టూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి 4 టన్నుల ఇసుకకు ఇసుకరీచ్ వద్ద రూ.1832 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. దాంతో అతనికి మొదటగా ఇసుక చెల్లింపు రశీదును తహసీ ల్దార్ సంధ్యశ్రీ అందించారు. తరువాత అత నికి 4 టన్నుల ఇసుకను లోడింగ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకో వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రహమాన్ బాషా, వీఆర్‌వో రవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఇసుక బుకింగ్‌కు ఏర్పాటు చేసిన శిబిరంలో సచివాలయ సిబ్బంది

**ఉచిత ఇసుక ధరపై పునరాలోచించండి**

**ఎమ్మెల్యే కొండయ్య దృష్టికి తెచ్చిన వినియోగదారులు**

ఉచిత ఇసుక పాలసీ సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. ఈ క్రమంలో చీరాల నియోజకవర్గంకు సంబంధించి 216 జాతీయ రహదారి పక్కన పందిళ్లపల్లి వైజంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌లో విక్రయాలు ప్రారం భించారు. టన్ను రూ.675గా నిర్ణయించారు. దీంతో ఒక్కో ట్రాక్టరుకు 4.5 టన్నులను లోడ్ చేస్తారని, అందుకు సంబంధించి ట్రాక్టరుకు వచ్చి రూ.3,038 చెల్లించాలని (క్యూఆర్ కోడ్ ద్వారా) అక్కడ నియమించిన సచివాలయ సిబ్బంది ఇసుక కోసం వచ్చిన వారికి చెప్పారు. అయితే ఇటు మార్టూరు, బాపట్ల తదిత ప్రాంతాలతో పోలిస్తే చీరాలలో ఇసుక ధర అధికంగా ఉంది. దీంతో కొనుగోలు దారులు పెదవి విరుస్తున్నారు. వచ్చిన వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇదిలావుంటే ఇసుక విక్రయాలకు సంబంధించి పూర్తిస్థాయి మార్గ దర్శకాలు రాలేదని, అందుకు కొంత సమయం పడుతుందని ఒకరిద్దరు కొనుగోలుకు సుము ఖత చూపిన వారికి అక్కడి సిబ్బంది తెలి పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివా సయాదవ్ ఉచిత ఇసుక పాలసీ తీరుతెన్నులు, ప్రజాభిప్రాయం ఎలా ఉంది. ఏమన్నా లోటు పాట్లు ఉన్నాయా అనే కోణంలో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చీరాల నియోజకవర్గంలో నిర్ణ యించిన ధర ఎక్కువగా ఉందని , దానిపై పునరాలోచించాలని చె ప్పినట్లు తెలిసింది. మొత్తమ్మీద వైసీపీ పాలనలో కొనుగోలు చేయ లేని ఇసుక ప్రస్తుతం పారదర్శక ధరతో అందు బాటులోకి వచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కోటప్పకొండకు పాదయాత్రగా తరలి వెళుతున్న తమ్ముళ్లు

## కోటప్పకొండకు పాదయాత్ర

**మొక్కులు తీర్చుకున్న కారంచేడు తెలుగు తమ్ముళ్లు**

కారంచేడు(పర్చూరు), జూలై 8 : వైసీపీ గద్దె దిగడం, ప్రజా కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు విజయం సాధించడంతో కారంచేడు గ్రామ తెలుగు దేశం పార్టీ శ్రేణులు అభిమానం చాటుకున్నారు. కారంచేడు నుంచి కోట ప్పకొండకు సోమవారం పాదయాత్రను చేపట్టారు. టీడీపీ అధికారంలోకి వచ్చి, చంద్రబాబు సీఎంగా, ఎమ్మెల్యేగా ఏలూరి గెలుపొందితే కోటప్పకొండకు వస్తామని మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో స్వామివారికి మొక్కులు తీర్చుకేనేందుకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో బోడాడ హరి, కొల్ల భాస్కర్, గోరంట్ల వెంకటరత్నం, చాగంటి నాయ నమ్మ, నల్లగొర్ల శ్రీరాములు, చాగంటి లక్ష్మీన్నారాయణ, యార్లగడ్డ ప్రహాదు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

## ఆర్యవైశ్యులకు అన్నివిధాలా అండగా ఉంటాం

**ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్**

చీరాల, జూలై 8 : ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ఎంజీసీ మార్కెట్‌లో సోమవారం ఎంజీసీ మార్కెట్ డెవపల్‌మెంట్ సొసైటీ, ది టెక్స్‌టైల్ మర్చంట్స్ ఆసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంపీ ఇరు వురు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఆర్యవైశ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాము వెన్నంటి ఉండి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం ఇరువురును కార్యక్రమ నిర్వహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాతాని ఉ మామహేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు, నాయకులు, కార్యకర్తలు ఎల్గొన్నారు.

# వైఎస్ జయంతి కార్యక్రమాలకు నేతలు దూరం

**హాజరు కాని మునిసిపల్ చైర్‌పర్సన్, పలువురు కౌన్సిలర్‌లు**


నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చినహనిమిరెడ్డి, నేతలు


అద్దంకి, జూలై 8 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు వైసీపీ ఆధ్వర్యంలో ని యోజకవర్గంలోని అన్ని మండలాలలో సోమ వారం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమాలకు వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి హాజరయ్యారు. స్థాని కంగా పలువురు నేతలు దూరంగా ఉండటం చర్చనీ యాంశమైంది. టీడీపీ కూటమి అధికారంలో ఉండడంతో వైసీపీ కండువాలతో గెలిచిన పలు వురు ప్రజాప్రతినిధులు కార్యక్రమాలకు ము ఖం చాటేసినట్లు తెలుస్తోంది. అద్దంకి పట్టణం లోని ఎన్టీఆర్ నగర్‌లో వైఎస్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షుడు, మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, అద్దంకి పట్టణ, మండల పార్టీల అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, జగన్మోహనరెడ్డి, బీవీ కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు హాజర య్యారు. ప్రధానంగా అద్దంకి మున్సిపల్ చైర్‌ప ర్సన్ ఎస్తేరమ్మతో పాటు వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్‌లు కొమ్మాలపాటి సుధీర్, మరికొందరు వైసీపీ కౌన్సిలర్‌లు హాజరు కాక పోవడం చర్చనీయాంశంగా మారింది. కొంత మంది కౌన్సిలర్‌ల భర్తలు మాత్రం హాజరయ్యా రు. మున్సిపల్ పాలక మండలిలోని ఇద్దరు కౌన్సిలర్‌లు ఎన్నికలకు ముందే టీడీపీ గూటికి చేరగా, మంత్రి రవికుమార్ ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు వైస్ చైర్మన్ దేసు పద్మేష్ హాజరయ్యారు. చైర్‌పర్స న్‌తో పాటు మరికొంతమంది కౌన్సిలర్‌లు దూరంగా ఉండడంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గడం ఖాయంగా కన్పిస్తుంది.

చీరాల : గడియార స్తంభం సెంటర్లోను సోమవారం వైఎస్‌ఆర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమా లలువేసి నివాళులర్పించారు. వైసీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, గవిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**వేడుకల్లో పాల్గొన్న ఆమంచి**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో సోమవారం విజయవా డలో జరిగిన వైఎస్ జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా మాజీ ఎమ్మెల్యే, నియోజవకర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, సీఎం రేవంత్‌రెడ్డికి బొకే ఇచ్చి సాదరంగా ఆహ్వానిం చారు. కార్యక్రమంలో ఆమంచితో పలువురు చీరాల ప్రాంత నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 9 జూలై 2024





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

# భక్తులకు ఏలోటూ రానీయొద్దు!

- రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేయండి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్ ఆదేశం

**నెల్లూరు (సాంస్కృతికం) జూలై 8 :** బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రొట్టెల పండుగ ఏర్పాట్లపై కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ నెల 17న ప్రారంభమయ్యే రొట్టెల పండుగ 21వ తేదీతో ముగుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 15లక్షలకు పైగా భక్తులు హాజరయ్యే ఈ పండుగకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. దర్గా పరిసర ప్రాంతాలు, ఘాట్లు, పార్కింగ్ ప్రదేశాల్లో శానిటేషన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. రద్దీకి అనుగుణంగా బ్యారికేడ్ ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖలకు కేటాయించిన పనులు నిర్దిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పండుగ రోజుల్లో నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన సందర్భాల్లో ఇతర జిల్లాల నుంచి కూడా పోలీసు లను రప్పించాలన్నారు. 24గంటలూ అందుబాటులో ఉండే విధంగా స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన వైద్య బృందాలు, 108 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. పండుగకు వచ్చే భక్తులు జిల్లాలోని ప్రసిద్ధ కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలను సందర్శించే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో శానిటేషన్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సౌజన్య, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ పద్మావతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**● ఏర్పాట్ల పరిశీలన**

బారాషహీద్ దర్గా ప్రాంగణాన్ని కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కలిసి కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. స్వర్ణాల చెరువులో నీటి మట్టం పెంచాలని అధికారులకు సూచించారు. అనంతరం షవర్ బాత్‌కు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. దర్గాకు ఇరువైపులా నిర్మించిన అక్రమ కట్టడాలను కలెకర్ దృష్టికి మైనార్టీ నాయకులు తీసుకెళ్లారు. దర్గా కమిటీ చర్చించుకుని అక్రమ కట్టడాలను తొలగించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దర్గాలతో భక్తుల కోసం సివిల్ వర్క్‌లకే రూ.4కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మైనారిటీ నాయకులు షంషుద్దీన్, సమీహుస్సేన్, షేక్.ఖాదర్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

**● మొదలైన భక్తుల రాక**

ఆదివారం మొహర్రం మాసం ప్రారంభం కావడంతో జిల్లాకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు రాక మొదలైంది. నాగపూరు, బెంగళూరు, కడప, అనంతపురం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వర్ణాల ఘాట్‌లో స్నానాలు చేసి బారాషహీద్‌లను దర్శించుకున్నారు.



మర్రిపాడు : వలనా రశీదుపై వినియోగదారుడితో సంతకం చేయిస్తున్న ఆత్మకూరు ఆర్డీవో మధులత

# ప్రజలకు భారీ ఊరట!

- ప్రారంభమైన ఉచిత ఇసుక విధానం
- ఇప్పుడు మూడు రీచ్‌లలో.. రెండు నెలల్లో అన్నింటా!
- డిజిటల్ చెల్లింపులతో పారదర్శకతకు శ్రీకారం

**నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) :** ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నెరవేరుస్తూ ప్రజలకు భారీ ఊరట కల్పించింది. జిల్లాలో ఉచిత ఇసుక విధానం సోమవారం ప్రారంభమైంది. గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీకి తెరదించుతూ పారదర్శకంగా ఇసుకను అందించేలా ఏర్పాట్లు చేశారు. రీచ్‌లకు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో తొలుత యార్డుల్లో ఉన్న ఇసుకను పేదలకు అందిస్తున్నారు. తొలిరోజున పల్లిపాడు, మినగల్లు, మర్రిపాడు ప్రాంతాల్లోని యార్డుల్లో ఉచిత ఇసుక విధానం మొదలైంది. పల్లిపాడు, మినగల్లు యార్డుల్లో విక్రయాలను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. మర్రిపాడు యార్డులో ఆత్మకూరు ఆర్డీవో మధులత, మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌లతో కలిసి విక్రయాలు ప్రారంభించారు. ఈ మూడు యార్డుల్లో కలిపి 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. టన్ను ఇసుక ధరను రూ.370గా నిర్ణయించారు. రీచ్‌ల నుంచి ఈ యార్డులకు తరలించిన రవాణా చార్జీలను కూడా ఇందులో కలిపారు. అయితే పర్యావరణ అనుమతులు వచ్చాక రీచ్‌ల వద్దనే ఇసుక విక్రయాలు మొదలవుతాయి. అప్పుడు టన్ను ఇసుక ధర మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఇసుక విక్రయాలకు ఒక లెక్క పక్కా లేకుండా పోయింది. తెల్లకాగితాల మీద బిల్లులు ఇచ్చేవారు. డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఉండేది కాదు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ఇసుక విక్రయాలను చేపట్టాలని నిర్ణయించింది. అంతా ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు జరపాలని ఆదేశించింది. దీంతో అధికారులు మూడు యార్డుల్లోనూ డిజిటల్ చెల్లింపునకు స్కానర్లను అందుబాటులో ఉంచారు. కొనుగోలుదారులు పేమెంట్ చేయగానే ఆన్‌లైన్ బిల్లులు జనరేట్ చేసి ఇస్తున్నారు. కాగా ఉచిత ఇసుక విధానం అమల్లోకి రావడంతో తొలి రోజే ఇసుక కోసం వాహనాలు యార్డుల వద్ద బారులు తీరడం విశేషం.

**టన్ను ఇసుక ధర ఇలా..**

| స్టాక్‌యార్డు | పాతధర | ప్రస్తుతం |
|---|---|---|
| మర్రిపాడు | 723 | 370 |
| మినగల్లు | 650 | 370 |
| పల్లిపాడు | 650 | 370 |

**● ఉచితంగా అందిస్తున్నాం : డీడీ**

**నెల్లూరు (వెంకటేశ్వరపురం) :** జిల్లాలో 3 స్టాక్ యార్డుల ద్వారానే ఉచితంగా ఇసుకను అందిస్తున్నట్లు మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల్లో జిల్లాలోని అన్ని రీచ్‌లలో ఇసుక విక్రయాలు ప్రారంభిస్తామని తెలిపారు. అప్పుడు మరింత చౌకగా కేవలం కూలీల ఖర్చులతో అందిస్తామని వివరించారు.





వాదులాడుకుంటున్న పొదుపు మహిళలు

# మా డబ్బులు ఏం చేశారు?

- వైసీపీ కార్యక్రమాలకు ఎలా ఖర్చు చేస్తారు?
- ఇప్పుడు నష్టాలని ఎలా చెబుతారు!
- టీఎల్‌ఎఫ్‌లను నిలదీసిన పొదుపు మహిళలు
- తీవ్ర వాగ్వివాదం.. బాహాబాహీకి దిగిన వైనం

**నెల్లూరు (హరనాథపురం), జూలై 8 :** 'మహిళా మార్టు పేరుతో మా దగ్గర వసూలు చేసిన నగదు ఏమైంది? వైసీపీ కార్యక్రమాలకు ఎలా వాడతారు? ఇప్పుడు నష్టాల పేరుతో మమ్మల్ని మోసం చేస్తారా!? ఇప్పటివరకు జరిగిన లావాదేవీల లెక్కలు చూపండి?' అంటూ పొదుపు మహిళలు నిలదీయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నగరంలోని డైకస్‌రోడ్డు (పొదలకూరు రోడ్డు) సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహిళా మార్టులో నిధులు స్వాహాపై పొదుపు మహిళలు 'నువ్వా నేనా' అన్న రీతిలో వాదులాటకు దిగారు. పెద్దల కొలువు వద్ద సోమవారం జరిగిన టౌన్‌లెవల్ ఫెడరేషన్ల (టీఎల్‌ఎఫ్) సమావేశంలో పొదుపు మహిళలు భారీగా పాల్గొన్నారు. ఒక్కో పొదుపు గ్రూపు నుంచి సుమారు రూ.1500 వంతున రూ.16 లక్షల వరకు వసూలు చేసి, ఎన్నికల ముందు ఈ మహిళా మార్టును ఏర్పాటు చేసినట్లు సమాచారం. కార్పొరేషన్ పరిధిలో 9 టీఎల్‌ఎఫ్‌లు ఉంటే కేవలం టీఎల్‌ఎఫ్-1, 5లు మహిళా మార్టు ఏర్పాటు చేసినట్లు సమచారం. డైకస్ రోడ్డు వద్ద అన్న క్యాంటీన్‌లో ఈ మహిళా మార్టును ఏర్పాటు చేశారు. అయితే టీడీపీ అధికారంలోకి రావటంతో అన్నక్యాంటీన్లు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ఈ పరిస్థితుల్లో మెప్మా మహిళా మార్టు తరలింపు తప్పనిసరి అయ్యింది. ఈ నేపథ్యంలో పొదుపు సంఘాల సభ్యులతో సోమవారం పెద్దల కొలువులో టీఎల్‌ఎఫ్-1, 5లకు సంబంధించి పొదుపు గ్రూపు అధ్యక్షుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మహిళా మార్టు ఏర్పాటుకు ఎంత ఖర్చు చేశారనే అంశమై మహిళల మధ్య వాగ్వాదం జరిగింది. గతంలో అధికారంలో ఉన్న పార్టీ కార్యక్రమాలకు అనవసరంగా ఖర్చు చేశారని ఆరోపించారు. ఖర్చు వివరాలు తెలపాలని కొందరు పట్టుబట్టడంతో గందరగోళం నెలకొంది. ఒకానొక దశలో మహిళలు బాహాబాహీకి దిగారు. అయితే, టీఎల్‌ఎఫ్‌కు చెందిన వారు సమాధానమిస్తూ మహిళా మార్టు ద్వారా రూ.8.5లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని చెప్పినట్లు తెలిసింది. దీంతో మిగిలినవారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. టీఎల్‌ఎఫ్-1, 5 అధ్యక్షులనూ వైసీపీకి చెందిన వారుగా పొదుపు మహిళలు చెప్పారు. నష్టపోయిన మహిళలకు తెలుగుదేశానికి చెందిన పొదుపు మహిళలు అండగా నిలబడి మాట్లాడారు. మొత్తం మీద సమావేశం రసాభాసగా మారింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితి సర్దుబాటు చేశారు.

# ఆహ్లాదకరంగా నగర వనాలు

- పనులు నాణ్యతగా చేపట్టండి
- జిల్లా అధికారులకు సీసీఎఫ్ ఆదేశం

**నెల్లూరు (వెంకటేశ్వరపురం)జూలై 8 :** పట్టణవాసుల కోసం చేపడుతున్న నగరవనాలలో ఆహ్లాదం ఒట్టిపడేలా తీర్చిదిద్దాలని అటవీ శాఖ గుంటూరు రేంజ్ సీసీఎఫ్ (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) వై శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా నగర ప్రాంతాల్లో జరుగుతున్న నగరవనాల పనుల పురోగతిని సీసీఎఫ్ పరిశీలించారు. ముందుగా కావలి ప్రాంతంలో నగరవనాన్ని పరిశీలించారు. కావలివాసులకు ఎంతో ఆహ్లాదకంగా నగరవనాన్ని ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నెల్లూరు సమీపంలోని కొత్తూరు, వెంకటాచలం ప్రాంతాల్లో రూపుదిద్దుకొంటున్న నగరవనాలను కూడా ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతగా చేయాలని, అదేవిధంగా ప్రజలకు అన్నీ సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సీసీఎఫ్ ఆదేశించారు. జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్,రేంజర్‌లు మాల్యాద్రి పలువురు అధికారులు పాల్గొన్నారు.

**● అటవీ శాఖలో ఇద్దరికి పదోన్నతులు**



మాల్యాద్రి

జిల్లా అటవీశాఖలో పదోన్నతులతో పాటు బదిలీలు జోరుగా సాగుతున్నారు. రెండు రోజుల క్రితం ఎఫ్ఎస్‌వోలు (ఫారెస్ట్ సెక్షన్ అధికారి) పదోన్నతులు పొందగా తాజాగా ఇద్దరు డీఆర్‌వోలకు రేంజర్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు ఇంచార్జ్ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న డీఆర్‌వో (డిప్యూటీ రేంజ్ అధికారి) ఎస్ మాల్యాద్రి రేంజర్‌గా పదోన్నతి లభించింది. దీంతో ఆయన్ను కావలి రేంజర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అదే విధంగా ఆత్మకూరు డీఆర్‌వో సీ మాధవరావుకు రేంజర్‌గా పదోన్నతి లభించింది. గుంటూరు జిల్లా వినుకొండ రేంజర్‌గా ఆయన్ను బదిలీ చేశారు.

# 'సెంట్రల్' ఈఈ.. పోస్ట్ కోసం పోటీ!

- ఇక్కడకు వచ్చేందుకు అనేక మంది ప్రయత్నాలు
- పోటీ పడుతున్న ఇద్దరు వివాదాస్పద అధికారులు
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- డీఈతోపాటు ఈఈ పోస్టు ఇన్‌చార్జ్ కావాలట!
- రెగ్యులర్ ఈఈ లేకపోతే నిర్వహణ కష్టమే

**నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) :** జిల్లా ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యంత కీలకమైనది నెల్లూరు సెంట్రల్ డివిజన్. మొత్తం ఐదు డివిజన్లు ఉన్నా అందులో అతిపెద్ద డివిజన్ సెంట్రల్ డివిజనే! ఉమ్మడి జిల్లా మొత్తంలో దాదాపు 6 లక్షల ఎకరాలకుపైగా సాగు విస్తీర్ణం ఉండగా ఈ సెంట్రల్ డివిజన్ పరిధిలోనే 3.50 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ప్రతి ప్రభుత్వంలోనూ రూ.వందల కోట్ల పనులు జరుగుతుంటాయి. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాలు సెంట్రల్ డివిజన్ పరిధిలో ఉన్నాయి. ఇంతటి కీలకమైన డివిజన్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వచ్చేందుకు పలువురు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులోనూ ఇద్దరు అధికారుల మధ్య పోటీ తీవ్రంగా ఉన్నట్లు ఆ శాఖలో చెప్పుకుంటున్నారు. డీఈఈ స్థాయి కలిగిన ఈ అధికారులకు, నెల్లూరు డీఈతోపాటు సెంట్రల్ డివిజన్ ఇన్‌చార్జి ఈఈ పోస్టు కూడా కావాలంటూ తమ శక్తులన్నీ ఉపయోగిస్తున్నారు. టీడీపీ నాయకులు కొందరు ఒక డీఈఈకి, మరికొందరు ఇంకో డీఈఈకి సపోర్టుగా ఎమ్మెల్యేల వద్దకు తీసుకెళుతున్నారు. అయితే ఈ ఇద్దరు అధికారులూ వివాదాస్పదులు కావడం గమనార్హం.


**● పని కోసమా.. పనుల కోసమా!?**

డెల్టా ప్రాంతమైన సెంట్రల్ డివిజన్ పరిధిలో అన్ని నియోజకవర్గాలను సమన్వయం చేసుకుంటూ కాలువలను బాగు చేస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఈఈపై ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్లు ఖర్చు చేసినట్లు చూపించినా కాలువల్లో పూడిక కూడా తీసిన దాఖలాలు కనిపించడం లేదు. పనులు చేయకనే బిల్లులు తినేశారని ప్రస్తుత ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచీ ఆరోపిస్తూ వస్తున్నారు. సెంట్రల్ డివిజన్ నుంచి కొందరు ఫైళ్లు మాయం చేస్తున్నారని ఇటీవల ఎమ్మెల్యేలకు సమాచారం అంద డంతో వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఆర్వో సెంట్రల్ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి వెళ్లడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో సెంట్రల్ డివిజన్‌కు ఇన్‌చార్జ్ అధికారులను కాకుండా రెగ్యులర్ ఈఈని నియమించాల్సిన అవసరముంది. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉత్తమ అధికారులను సెంట్రల్ డివిజన్‌కు తీసుకొస్తే కానీ ఇక్కడ పరిస్థితులు మారవని రైతులే అభిప్రాయపడుతున్నారు.



**● ఆ ఇద్దరి మధ్యే పోటీ**

సెంట్రల్ డివిజన్ పరిధిలో సర్వేపల్లి కాలువ ఆధునికీకరణ, జాఫర్ సాహెబ్ కాలువ ఆధునికీకరణ, పెన్నా పొర్లు కట్టల నిర్మాణం, సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ, ముదివర్తి కాజ్‌వే నిర్మాణం, ఇతర ప్యాకేజీ వర్కులు కలుపుకుంటే రూ.500 కోట్లకుపైగా వర్కులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇద్దరు డీఈఈ స్థాయి అధికారులు సెంట్రల్ డివిజన్ ఈఈ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో ఓ అధికారి ప్రస్తుతం ఆత్మకూరు డివిజన్‌లో పనిచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అక్కడ ఐదేళ్లపాటు లేఅవుట్లకు చెరువుల మట్టిని అమ్ముకున్నారన్న ఆరోపణలను మూటగట్టుకున్నారు. లేఅవుట్లలో కాలువలకు ఇష్టారీతిన ఎన్‌వోసీలు కూడా జారీ చేశారు. తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు పెట్టారన్న అభియోగాలు కూడా ఉన్నాయి. వైసీపీ నాయకులతో అంటకాగిన ఆ అధికారి వ్యవహారాలు మంత్రి ఆనం రామనారాయణ దృష్టికి వెళ్లడంతో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ఆయన నేరుగా ప్రస్తావించారు. సదరు అధికారి పనితీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇక ఆత్మకూరులో కష్టమనుకున్న ఆ అధికారి ఇప్పుడు సెంట్రల్ డివిజన్ కోసం పట్టుబడుతున్నారు. ఈ అధికారిపై ఇసుకను అమ్ముకున్నారన్న కేసుల్లో విజిలెన్స్ విచారణ కూడా జరగడం గమనార్హం. అదే సమయంలో గతంలో బుచ్చిలో పనిచేసి ఇప్పుడు సోమశిల ప్రాజెక్టులో పనిచేస్తున్న మరో అధికారి కూడా సెంట్రల్ డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈ పోస్టు కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతు న్నారు. ఈయన పనిచేసిన చోటల్లా వివాదాలకు కేరాఫ్‌గా మారుతుండడం గమనార్హం. వీరిద్దరు ఇక్కడ రైతులకు పనిచేయడం కోసం కన్నా పర్సంటేజీల కోసమే ఎక్కువ ఆరాటపడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటువంటి వారి చేతుల్లో సెంట్రల్ డివిజన్‌ను పెడితే రైతులకు అవస్థలు తప్పవని ఆ శాఖ ఇంజనీర్లే చెప్పుకుంటుండడం కొసమెరుపు.



**రద్దయిన రైళ్ల వివరాలు**

| రైలు నెం. | ప్రారంభం | ముగింపు | రద్దు తేదీలు |
|---|---|---|---|
| 07500 | విజయవాడ | గూడూరు | 15 నుంచి 30 |
| 07458 | గూడూరు | విజయవాడ | 16 నుంచి 31 |
| 07461 | విజయవాడ | ఒంగోలు | 16 నుంచి 30 |
| 07576 | ఒంగోలు | విజయవాడ | 16 నుంచి 30 |
| 12744 | విజయవాడ | గూడూరు | 15 నుంచి 30 |
| 12743 | గూడూరు | విజయవాడ | 16 నుంచి 31 |
| 17259 | గూడూరు | విజయవాడ | 16, 23, 30 |
| 17260 | విజయవాడ | గూడూరు | 16, 23, 30 |
| 22708 | తిరుపతి | విశాఖపట్నం | 14, 21, 28 |
| 22707 | విశాఖపట్నం | తిరుపతి | 15, 22, 29 |

# నెల్లూరు మీదుగా వెళ్లే పది రైళ్ల రద్దు


- మరో నాలుగు దారిమళ్లింపు
- ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు..

**నెల్లూరు (వెంకటేశ్వరపురం) :** జిల్లా మీదుగా వెళ్లే పది రైళ్లను ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ పీఆర్‌వో మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ - గూడూరు మధ్య మూడవ రైల్వేలైను ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎర్నాకుళం-హౌరా (22878), సత్రగంచి - తాంబరం (22841), హౌరా - బెంగళూరు (22863), మధురై - నిజాముద్దీన్ (12651) రైళ్లను దారి మళ్లించినట్లు తెలిపారు. మరో దాదాపు 29 రైళ్ల సమయాన్ని మార్పు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రైళ్ల మార్పులను గమనించి ప్రయాణికులు సహకరించాలని కోరారు.

# సమస్యల్లో రాళ్లపాడు

- వైసీపీ పాలనలో నిరాదరణకు గురైన ప్రాజెక్టు
- పూడికతీతకు నోచని కాలువలు
- వంతెన రోడ్డుకిరువైపులా పెరిగిన చిల్లచెట్లు
- ఏళ్లతరబడి వేధిస్తున్న సిబ్బంది కొరత
- సమస్యలు పరిష్కరించాలంటున్న ఆయకట్టు రైతులు

**లింగసముద్రం, జూలై 8 :** నాలుగు మండల్లాలోని ప్రజలకు సాగు, తాగునీటిని అందిస్తున్న రాళ్లపాడు ప్రాజెక్టు సమస్యల సుడిగుండంలో చిక్కుఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ ప్రాజెక్టు నిరాదరణకు గురైంది. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు రెండుసార్లు నిండితే గానీ అధికార, అనధికారికంగా ఉన్న 25 వేల ఎకరాల్లో పంటలు పండవు. ఈ సమస్య పరిష్కారానికి సోమశిల ఉత్తర కాలువ నుంచి నీరు రావడం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఐదేళ్లుగా నిరాదరణకు గురైన రాళ్లపాడు ప్రాజెక్టు



కొత్త స్పిల్‌వేలో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు చేయని వైనం

**● బలహీనంగా కౌంటర్ వెయిట్లు**

ప్రాజెక్టులోని పాత స్పిల్‌వేలోని గేట్లను ఆపరేట్ చేసేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్ వెయిట్లు బలహీనంగా ఉన్నాయి. దీంతో ఈ స్పిల్‌వేలోని 10 గేట్లను, 2 పూడుగేట్లను ఆపరేట్ చేయడం లేదు. ఈ కౌంటర్ వెయిట్లు తెగి పడతాయనే కారణంతో అధికారులు వీటిని ఆపరేట్ చేయడం లేదు. ఈ స్పిల్‌వే నుంచి లక్ష క్యూసెక్కుల వరద నీటిని మన్నేరుకు విడుదల చేసే సామర్థ్యం ఉంది. కాగా కొత్త స్పిల్‌వేలోని ఐదు గేట్ల నుంచి 1.70 లక్షల క్యూసెక్కుల వరద నీటిని మన్నేరుకు విడుదల చేసే సామర్థ్యం ఉంది.కానీ అంతకు మించి వరద నీరు పరిస్థితిని ఏమిటన్నది రైతుల ప్రశ్న. అలాగే ఈ స్పిల్‌వే నిర్మాణం జరిగిన 2000లో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు కోసం కట్టడాలు నిర్మించారు. వాటిని ఏర్పాటు చేయలేదు.

**● పొడిగింపునకు నోచని ఎడమ కాలువ**

ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. రెండేళ్లక్రితం అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ కాలువ పొడిగింపు పనులకు రూ27 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.కానీ అధికారులు రూ.32 కోట్లు కావాలని ప్రతిపా దనలు పంపించారు. అయితే ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.దీంతో కాలువ పనులు సాగలేదు. ఇకపోతే ప్రాజెక్టు కుడి ఎడమ కాలువ పూడికతీతకు నోచుకోలేదు. ప్రాజెక్టు వంతెన రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి.ఇవి ప్రాజెక్టు కట్టకు ఇబ్బందిగా మారాయి.



పూడికతీతకు నోచని ఎడమ కాలువ

**● వేధిస్తున్న సిబ్బంది కొరత**

ప్రాజెక్టులో ఏళ్ల తరబడి సిబ్బంది కొరత వేధిస్తోంది.ప్రస్తుతం ఇద్దరు డీఈలు, నలుగురు ఏఈలు, డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు లస్కర్లు మాత్రమే ఉన్నారు.అటెండర్లు, వ్యాచ్‌మన్లు లేరు.వాస్తవానికి 10 మంది ఏఈలు, 16 మంది లస్కర్లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు ఇద్దరు, అటెండర్లు, వాచ్‌మన్లు ఇతర సిబ్బంది 10 మంది వరకు ఉండాలి. ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వమైనా తగిన చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

# ఊరా.. వల్లకాడా!?

- శ్మశానాన్ని తలపిస్తున్న ఆత్మకూరులోని ఖాళీ ప్లాట్లు
- ఏపుగా పెరుగుతున్న పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు
- విష పురుగులు, దోమలకు ఆవాసం



ఆత్మకూరు 6వ వార్డులోని నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలం

**ఆత్మకూరు, జూలై 8:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో సమీప ప్రాంతాల్లో జనావాసాల మధ్య కొందరు స్థలాలను కొనుగోలు చేసి వదిలేశారు. వాటిపై యజమానుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్ యార్డులుగా.. ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. వీటిలోకి సమీపంలోని ఇళ్లలోని వాడిన నీరంతా వస్తుండటంతో మురుగుకూపాలుగా మారుతున్నాయి. వర్షం పడగానే వాటిలో నీళ్లు చేరి ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమలు ప్రబలుతున్నాయి. ఈ ఖాళీస్థలాల చుట్టుపక్కల నివాసముంటున్న ఇళ్లలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారినపడుతున్న బాధితులు ఉన్నారు. ఇళ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులు ఇప్పటికే పలుమార్లు ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. వారు మాత్రం అందులో ఎలాంటి పనులు చేయడం లేదు. మున్సిపాల్టీ పరిధిలోని 6వ వార్డు ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసుకు ఎదురుగా ఉన్న 250 అంకణాల ఖాళీ స్థలంలో కంపచెట్లు పెరిగి విషపురుగులకు ఆవాసంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ పాములు ఇళ్లలోకి వస్తున్నట్లు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## ఏపీ ఎస్‌పీడీసీఎల్ యాప్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించండి



క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్‌ను దుకాణం వద్ద అతికిస్తున్న ట్రాన్స్ కో ఏడీ శ్రీనివాసులు

**సంగం, జూలై 8:** ఏపీఎస్పీ డీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు అనంతరం విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలపై సిబ్బందికి సల హాలు అందజేశారు. స్థానిక దుకాణాల వద్ద ఏపీఎస్పీ డీసీఎల్ క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్‌ను అతికించి బిల్లులు చెల్లింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## జీవో 117ను రద్దు చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

**అనంతసాగరం, జూలై 8:** గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తెచ్చిన జీవో నెంబర్ 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడాలని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పలు పాఠశాలలో క్యాంపెయిన్ నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి సాదిక్, సభ్యులు కిష్టయ్య, వెంకటేశ్వర్లు, మహేష్ పాల్గొన్నారు.

## ఉపాధి పనులు కల్పించాలి

**అనంతసాగరం, జూలై 3:** గ్రామాల్లో పనులు లేక అవస్థలు ఎదుర్కొంటున్న కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం మండల కార్మిక సంఘం నాయకులు అన్వర్‌బాష అధికారులను కోరారు. సోమవారం ఈ విషయంపై ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. పనిచేసిన వారికి పెండింగ్ ఉపాధి వేతనాలు అందలేదని పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఇసుక యార్డు ప్రారంభం

**మర్రిపాడు, జూలై 8:** మండలకేంద్రంలోని ప్రభుత్వ ఇసుక యార్డును సోమవారం ఆత్మకూరు ఆర్డీవో మధులత ప్రారంభించారు. టన్నుకు రూ.370లకు వినియోగదారులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ డీడీఏ శ్రీనివాస్‌కుమార్, తహశీల్దారు సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని అందజేస్తున్న టీడీపీ నాయకులు

**వరికుంటపాడు, జూలై 8:** తూర్పుబోయమడగల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికే చెందిన టీడీపీ నాయకులు నాదెండ్ల నారయ్య, ఎంఎంకె చౌదరి, చల్లకొలుసు బాలరాజులు విద్యా సామగ్రిని అందజేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో చిన్ననారయ్య, సురేష్, మదన్, అజయ్, తోడిందల రత్తయ్య పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి

**ఉదయగిరి రూరల్, జూలై 8:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే.అంజయ్య తెలిపారు. సోమవారం స్థానిక పెట్రోల్‌బంకు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బందితో కలిసి హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. న్యాయస్థానాల ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, న్యాయవాదులు రామారావు, సుధాకర్, షరీఫ్, మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి అంజయ్య

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు మందులు అందజేస్తున్న వైద్యులు

**ఉదయగిరి రూరల్, జూలై 8:** పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు శశిధర్ కోరారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సోమవారం గుడినరవ రైతు సేవాకేంద్రంలో పశుపోషకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశువులకు పచ్చి, ఎండు గడ్డి కాకుండా ఖనిజ లవణ మిశ్రమం, తౌడు వంటి పదార్థాల అందిస్తే పాల దిగుబడి పెరగడంతో పాటు పాలల్లో వెన్నశాతం అధికంగా ఉంటుందన్నారు. సబ్సిడీపై అందించే గడ్డి విత్తనాలను వినియోగించుకోవాలన్నారు. పశుపోషణ, ఆరోగ్యం, పాలదిగుబడి పెంచే మెలకువలను తెలిపారు. అనంతరం ఖనిజ లవణ మిశ్రమం, ద్రావకాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గండిపాళెం ఇన్‌చార్జి పశు వైద్యాధికారి అనూష, దుత్తలూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

## పండ్ల తోటల పెంపకం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

**ఉదయగిరి రూరల్, జూలై 8:** మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా 200ఎకరాల్లో పండ్లతోటల పెంపక లక్ష్యాన్ని సిబ్బంది పూర్తి చేయాలని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ, హార్టికల్చర్ అధికారి జయశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బంది, హార్టికల్చర్ వీఏఏలతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 45 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, మిగిలిన 155 ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో బీ.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళి



ఆత్మకూరు: వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తదితరులు

**ఆత్మకూరు, జూలై 8:** వైస్సార్ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గంలోని మండలాల వైసీపీ కన్వీనర్లు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** స్థానిక సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి మండల వైసీపీ కన్వీనర్ దొంతి రెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు మండ్ల శివ, అన్నంరెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, రోశిరెడ్డి, కండ్లగుంట వెంకటరెడ్డి పాల్గొన్నారు.

**సీతారామపురం:** స్థానిక బస్టాండ్ కూడలిలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, పార్టీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి కేక్ కట్ చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు చెరుకుపల్లి రమణరెడ్డి, పానెం రమణయ్య, వెంకటరెడ్డి, గోరంట్ల తిరుపాలు, సర్పంచ్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

**ఉదయగిరి:** స్థానిక ఆనకట్ట సమీపంలోని వైఎస్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఓబులరెడ్డి, అక్కి. భాస్కర్‌రెడ్డి, గొల్లపల్లి తిరుపతి పాల్గొన్నారు.

**సంగం:** మండలంలో వైస్సార్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెక్‌పోస్టు, సంగం బ్యారేజ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ కరీముల్లా, ముడి మల్లికార్జునరెడ్డి, పెరుమాళ్ల రవీంద్రబాబు, ఊటుకూరు జనార్దన్‌రెడ్డి, కట్టిపల్లి ప్రకాశ్, జహంగీర్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి వినతి

**ఉదయగిరి, జూలై 8:** మేజర్ పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సీపీఎం మండల నాయకుడు షేక్ పర్వీన్‌బాషా సోమవారం ఈవో ఖరీముల్లాకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. ప్రతిరోజు పారిశుధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. స్థానిక సచివాలయం నుంచి అబీద్‌బాబా దర్గా వరకు సైడ్ కాలువ లేక మురుగు నీరు రోడ్డుపైనే పారుతుందని వాపోయారు. హైవేపై ఇంటి నివాస స్థలాల పట్టాలు కోల్పోయిన లబ్ధిదారులకు వెంటనే ఇతర ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు

**ఉదయగిరి, జూలై 8:** పట్టణంలోని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఇంద్రసే నా రెడ్డి హెచ్చరించారు. సోమవారం బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. తరుచూ బస్టాండ్ సెంటర్‌లో ఆటోల నిలుపుదలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు విక్రయించే ఆటోలపై దృష్టి సారించామన్నారు. ఎవరైనా ట్రాఫిక్‌కు అంతరాయం చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## డిప్యూటీ సీఎం చిత్రపటం అందజేత



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని తహసీల్దారుకు అందచేస్తున్న నాయకులు

**సంగం, జూలై 8:** స్థానిక తహసీల్దారు, మండల కార్యాలయాలకు జనసేన వ్యవస్థాపకులు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని సోమవారం జనసేన నాయకులు అందజేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, చిరంజీవి యూత్ అధ్యక్షులు దాడి భాను కిరణ్ ఆధ్వర్యంలో తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో సూపరిటెండెంట్ జ్యోతిలక్ష్మికి అందజేసి కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, చిరంజీవి యూత్ నాయకులు కృష్ణమోహన్, యామల రాజా, కిషోర్, షేక్ జబాన్‌బాష, వినయ్, వెంకటేష్, నాని ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక పాలసీతో ఊపందుకోనున్న నిర్మాణరంగం

**కావలి, జూలై 8:** ప్రభుత్వం ఉచిత ఇసుకపాలసీ తీసుకుని రావటంతో నిర్మాణరంగం ఊపందుకోనుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన నెలలోపే అమల్లోకి తీసుకువచ్చాడని పేర్కొన్నారు. కూటమి పాలనలో అమలులో ఉంటున్న ఉచిత ఇసుక పాలసీపై నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణ ఉంటుందని ఆయన వివరించారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి ఇసుక కుంభకోణం ద్వారా రూ. 50వేల కోట్లుకుపైగా కొల్లకొట్టారన్నారు. వైసీపీ నేతలే ఇసుకాసుర అవతారమెత్తి దోచుకున్నారని తెలిపారు.

## హెచ్చరిక బోర్డు ఏర్పాటు

**అనంతసాగరం, జూలై 8:** మంచాలపల్లి సమీపంలోని సర్వే నెంబర్ 1065-1లోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కొందరు ఆక్రమించారు. ఎవరూ ఇందులో ప్రవేశించరాదంటూ సోమవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



## కందుకూరులో మౌలిక సమస్యలు పరిష్కరించాలి



కందుకూరు : సబ్ కలెక్టరు విద్యాధరికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**కందుకూరు, జూలై 8:** పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, శివారు కాలనీల్లో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం ప్రతినిధి బృందం సబ్ కలెక్టరు, మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిణి జి. విద్యాధరికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు ఆమెను కలిసి మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరించి పరిష్కారించాలని కోరారు. పట్టణంలోని అనేకప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీల లాంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. అలాగే తాగునీటి సమస్య, పారిశుధ్యం నిర్వహణ సమస్యను పరిష్కరించటంతో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌కే మున్వర్‌సుల్తానా, ఎస్ఏ గౌస్, ఎస్. పవన్, ఎం. పద్మ, ఎం. ప్రసాదు, డీఎం రాయుడు తదితరులు పాల్గొన్నారు.

### అర్జీల నమోదు

**కావలి :** ఆర్డీవో కార్యాలయానికి డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు వస్తుంటారు. అయితే పరిష్కారవేదికకు వచ్చిన అర్జీలను, సత్వర పరిష్కారంలో భాగంగా వాటిని ముందుగా పుస్తకంలో నమోదు చేస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం బయట సోమవారం ఒక సెల్ ఏర్పాటు చేసి తొలుత అర్జీదారులు తమ సమస్యలతో కూడిన అర్జీల వివరాలు తెలుపుతూ అక్కడ నమోదు చేసుకుంటున్నారు. ఆ తర్వాత ఆ అర్జీలు ఆర్డీవో శీనానాయక్ వద్దకు తీసుకెళ్లి తమ సమస్యలను వివరిస్తున్నారు. ఇప్పుడు అర్జీలను పుస్తకంలో నమోదు చేసుకుంటున్నందున వాటి పరిష్కారం ఎంతవరకు వచ్చిందో తెలుసుకునే అవకాశం కలుగుతోంది.

### ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

**జలదంకి :** మండలంలోని ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కూలీసంఘం, రైతు సంఘాల నేతలు సోమవారం ఎంపీడీవో రామచంద్రకు వినతిపత్రం అందించారు. మండలంలోని అన్నీగ్రామాల కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని, పనులు జరిగే చోట తాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు మేలంగి ఆంథోనిబాబు, తాళ్నూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

### తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

జలదంకి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం హెల్ప్‌డెస్క్‌ను తహసీల్దార్ వాసు ఏర్పాటు చేశారు. కార్యాలయం పనివేళల్లో ఈ హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ హెల్ప్‌డెస్క్ లో ఓ ఉద్యోగిని నియమించామన్నారు. సందర్శకులకు కావాల్సిన వివరాలు, వీఆర్వోల సమాచారాన్ని ఈ హెల్ప్‌డెస్క్ ద్వారా పొందవచ్చన్నారు.

## కార్యాలయాల్లో అధినేతల చిత్రపటాల ఏర్పాటు



కలిగిరి : ఎంపీడీవోకు చిత్రపటాలు అందిస్తున్న టీడీపీ నేతలు

**కావలి, జూలై 8:** స్థానిక జనతాపేటలోని సచివాలయం, అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సోమవారం కూటమినేతల చిత్రపటాలను స్థానిక నేతలు ఏర్పాటు చేశారు. 29, 31 వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు సురే మదన్‌మోహన్‌రెడ్డి, మంచాల ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ,సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మాల్యాద్రి, కాంద్ర గంగినాయుడు, బొట్లగుంట హరిబాబు, కాంద్ర భాస్కర్‌నాయుడు, రామమోహన్, మద్దా మల్లి కార్జున్, చల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**కలిగిరి:** స్థానిక తహసీల్దారు కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలకు సోమవారం టీడీపీ నేతలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల చిత్రపటాలతోపాటు గోడ గడియారాలను బహూకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు బాలకిషోర్, ఎంపీడీవో రంగసుబ్బరాయుడు, టీడీపీ నేతలు బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, చీమల తాతయ్య, వేళ్ళ నరేంద్ర, ఊసా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

**బిట్రగుంట:** బోగోలు మండలం ఎస్సీపాలెం సచివాలయానికి స్థానిక యువనేత అన్నంగి ఆదిశేషయ్య యాదవ్ సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చిత్రపటాలను బహూకరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, జిల్లా నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లురెడ్డి, వెంకారెడ్డి, హర్ష, పి.శీనయ్య, శ్రీనివాసులురెడ్డి, కే.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు మందు పిచికారీ

**ఉలవపాడు, జూలై 8 :** అంటువ్యాధులు ప్రబలకుండా ఉలవపాడులో సోమవారం అబేట్ పిచాకారీ చేశారు. మురికి కాలువలు, నీరు నిలువ ఉన్న చోట ఈ మందు పిచికారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి విజయమ్మ తెలిపారు. ట్రంక్‌రోడ్డు ప్రధాన రహదారుల్లో, మురికి కాలువల్లో ప్రతిరోజు అబేట్ పిచకారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక పాల ఉత్పత్తికి ప్రత్యేక దాణా అవసరం

**వలేటివారిపాలెం, జూలై 8 :** అధిక పాల ఉత్పత్తికి ప్రత్యేక దాణా చాలా అవసరమని కందుకూరు డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని చుండిలో సర్పంచి ఇరపని సతీష్ అధ్యక్షతన సోమవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ పాడి గేదెలకు ఎండుగడ్డి, పచ్చిగడ్డి తగు నిష్పత్తిలో ఇచ్చినప్పుడే బాగా పాలు ఇస్తాయన్నారు. కార్యక్రమంలో స్థానిక సహాయ సంచాలకులు బ్రహ్మయ్య, మండల పశువైద్యాధికారి డాక్టర్ వంశీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## లిఖిత్‌కుమార్‌కు నవోదయలో సీటు

**వలేటివారిపాలెం, జూలై 8 :** స్థానిక ప్రగతి యూపీ స్కూల్ విద్యార్థి చుండూరి లిఖిత్‌కుమార్‌కు జవహర్ నవోదయ పాఠశాలలో సీటు లభించింది. ఈ సందర్భంగా లిఖిత్‌కుమార్‌ను, అతని తల్లిదండులను సోమవారం యూపీ స్కూల్ కరస్పాండెంట్ దాసరి తిరుమలరావు, ప్రిన్స్‌పాల్ అజిజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు

**ఉలవపాడు, జూలై 8 :** మండలం పరిధిలోని 40 గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. 2,556 సర్వీసులు తనిఖీ చేసి, 113 కేసులు నమోదు చేశామన్నారు. వీటికి రూ.5,57,500 అపరాధ రుసుము విధించినట్లు ఏఈ శ్రీనివాసులు చెప్పారు. ఈ దాడుల్లో ఒంగోలు విద్యుత్‌శాఖ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈలు ఖాన్, ఆపరేషన్ ఈఈ వీరయ్య, పీ యుగంధర్, కందుకూరు డివిజన్ డీఈఈలు, ఏఈలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

## క్షేత్ర సహాయకుడిని తొలగించాలి

**కొండాపురం, జూలై 8:** అవినీతికి పాల్పడుతున్న ఉపాధి హామీ క్షేత్రసహాయకుడిని విధుల నుంచి తొలగించాలని సత్యవోలు గ్రామస్థుడు డేగ నాగేశ్వరరావు, తదితరులు సోమవారం ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్షేత్రసహాయకుడు జడపల్లి రమేష్ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ ఇతర కుటుంబాల వారు పనులకు వెళ్లకున్నా, వెళ్తున్నట్లు బోగస్ మస్టర్‌లు చేసుకొని ఉపాధిహామీ నిధులను స్వాహాచేశాడని తెలిపారు. ఈ విషయంపై గతంలో ఫిర్యాదుచేసినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఉపాధి హామీ రికార్డులను పరిశీలించి క్షేత్రసహాయకుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## డిప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ

**కొండాపురం:** మండల పరిధిలోని సాయిపేట దామా చినబాబు మెమోరియల్ పాఠశాల, మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను కందుకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో వరప్రసాద్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా సాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆయన పదవతరగతి విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎం బాలక్రిష్ణయ్యతో కలసి పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. అనంతరం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి తనిఖీచేశారు. అక్కడ నుంచి మండల విద్యావనరులకేంద్రానికి వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవోలు కే.రవికుమార్, ఆనందరావు పాల్గొన్నారు.

## బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి పెట్టండి

**బిట్రగుంట :** రైల్వే రోజురోజుకు శిథిలావస్థకు చేరుకుంటున్నదని, ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ ఎంపీ పురందేశ్వరిని కోరారు. సోమవారం రాజమండ్రిలో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ఈ మేరకు ఆమెకు వినతిపత్రం ఇచ్చారు. వందలాది ఎకరాల రైల్వే స్థలాలు నిరుపయోగంగా మారాయని, ఇక్కడ రైల్వే ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తే రైల్వేకి ఆదాయం, నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని ఆయన వివరించారు.

## మంత్రి దృష్టికి కావలి నియోజకవర్గ సాగునీటి సమస్యలు



జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కావలి ఎమ్మెల్యే, కావ్య, బీద రవిచంద్ర తదితరులు

**కావలి,జూలై 8:** నియోజకవర్గంలోని సాగునీటి వనరుల సమస్యలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తీసుకెళ్లారు. సోమవారం వారు అమరావతిలోని మంత్రి చాంబరుకు వెళ్లి ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నీటివనరులు, తదితర సమస్యలపై ఆయనతో చర్చించారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గుంటుపల్లి రాజకుమార్ చౌదరి తదితరులు ఉన్నారు.

## సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిశీలన



సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, అధికారులు

**కందుకూరు, జూలై 8:** పట్టణానికి తాగునీరందించే రామతీర్థం మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకును సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులు, స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ట్యాంకు వద్ద ఉన్న ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు జరుగుతున్నందున తాగునీటి సరఫరా విషయమై మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, పబ్లిక్‌హెల్త్ అధికారులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. అనంతరం ఏకలవ్యనగర్, జనార్దన్ ఎస్టీ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, అల్లం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## ముస్లింలకు సముచితస్థానం కల్పించడం హర్షనీయం

**కావలి, జూలై 8:** టీడీపీలో ముస్లింలకు సముచిత స్థానం కల్పించటం హర్షణీయమని పలువురు ముస్లిం నేతలు తెలిపారు. టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా షేక్ అర్షియా బేగంను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ నియమించారు. ఈ సందర్భంగా సోమవారం కావలి టీడీపీ కార్యాలయంలో అర్షియా బేగంను పలువురు నేతలు సన్మానించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో మైనార్టీ పదవుల్లోనే మాత్రమే ముస్లింలకు స్థానం కల్పించేవారన్నారు. మొట్ట మొదటిసారిగా పట్టణ మహిళా అధ్యక్షురాలిగా ముస్లిం మహిళకు ప్రాధాన్యత కల్పించినందుకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఈ సమావేశంలో ముస్లిం నేతలు సయ్యద్ అబ్దుల్ రహీం, షేక్ ఖాదర్‌బాష, షేక్ రఫీ, సర్దార్ కిర్మాణీ, షేక్ రఫీ అహ్మద్, ఖమర్‌బాబు, హజరత్, షేక్ ఇబ్రహీం, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునఃప్రారంభించాలి

**కొండాపురం :** రక్షిత మంచినీటి సరఫరా కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునఃప్రారంభించాలని మండల టీడీపీ నాయకులు కోరారు. సోమవారం ఆపథకాన్ని మాజీ వైస్ ఎంపీపీ పోలినేని చంద్రబాబునాయుడు, టీడీపీ నేతలు పోలినేని రమేష్, గద్దె రామక్రిష్ణదాసరి అశోక్ తదితరులు పరిశీలించారు. మండలంలోని తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటంతో గతంలో టీడీపీ ఈపథకాన్ని మంజూరు చేసిందన్నారు. పథకం పూర్తయి నీటి సరఫరా కొద్దిరోజులు జరిగాక వైసీపీ ప్రభుత్వం ఆపివేసిందన్నారు. ఈ పథకాన్ని పునః ప్రారంభించేందుకు కృషిచేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిలారి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**కావలి రూరల్ :** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కావలి ఏడీఏ నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని వీరరాఘవ ఫర్టిలైజర్స్, శ్రీనాగార్జున సీడ్స్, నాగమోహన్ దుకాణాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఏడీఏ ఈ వెంకటరమణ, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఏడీఏ నర్సోజి, విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఏవో లలిత తదితరులు పాల్గొన్నారు.

## లోఓల్టేజీ సమస్య పరిష్కారం

**బిట్రగుంట :** బోగోలు శివాలయం వీధిలో కొంతకాలంగా లోఓల్టేజీ సమస్య ఉంది. ఎన్నికల సమయంలో స్థానికులు ఈ సమస్యను దగ్గుమాటి క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించాక సమస్యను పరిష్కరించారు. ఈ క్రమంలో సోమవారం అదనపు ఫేస్ విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. లైన్‌మన్ రమేష్ యుద్ధ ప్రాతిపదికన పనులు చేసి, విద్యుత్ సరఫరా చేశారు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**కందుకూరు :** పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా మండలంలోని మాచవరంలో ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్‌షాక్‌కు గురై జనసైనికుడు ఇనకొల్లు నరసింహారావు మృతిచెందాడు. ఆయన తల్లిదండ్రులకు సోమవారం ప్రకాశం జిల్లా కాపు సంఘం తరపున రూ. 1,29,801ల ఆర్థికసహాయం అందించారు. పారిశ్రామికవేత్త మద్దిశెట్టి శ్రీధర్, కందుకూరు నియోజకవర్గ కాపుసంఘం అధ్యక్షుడు దారం మాల్యాద్రి, జిల్లా చిరంజీవి యూత్ అధ్యక్షుడు అడుసుమల్లి వెంకటరావు, ఇతర దాతల తోడ్పాటుతో ఈ మొత్తాన్ని సేకరించారు. బస్తా బియ్యంతోపాటు ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేశామని సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్ తెలిపారు.